PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 143 | విజయవాడ, గురువారం 25 డిసెంబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 25 December 2025 | Rs

నింగిలోకి దూసుకెళ్తున్న 'బ్లూ బర్డ్ బ్లాక్ 2'

'బాహుబలి' విజయవంతం

- నింగిలోకి 'బ్లూ బర్డ్ బ్లాక్ 2' ఉపగ్రహం
- కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులు
- భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలు : ఇస్రో చైర్మన్

3

27న చలో లోక్ భవన్

- 26న గ్రామ సభల్లో 'ఎంజిఎన్ఆర్ఇజిఎ' కొనసాగించాలని డిమాండ్
- ఎస్‌కెఎం పిలుపు

2

సుప్రీంకు ఉన్నావో అత్యాచార బాధితురాలు

6

కేంద్రం మార్గదర్శకాల ప్రకారమే...

- పిపిపిలో వైద్య కళాశాలలపై సిఎం చంద్రబాబు
- ముందుకొచ్చే సంస్థలకు ప్రోత్సహకాలివ్వండి
- సమీక్షలో ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే వైద్య కళాశాలలను పబ్లిక్,ప్రైవేటు భాగస్వామ్య విధానం (పిపిపి)లో చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఆయన వైద్య ఆరోగ్యశాఖపై సమీక్ష నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిపిపి విధానంలో నిర్మించతలపెట్టిన మెడికల్ కళాశాలలను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాలల పిపిపిలో వెనక్కు తగ్గేదే లేదని, దేశవ్యాప్తంగా ఈ పద్ధతి అమల్లో ఉందని అన్నారు. పిపిపి విధానంలో చేపట్టిన మెడికల్ కళాశాలల నిర్మాణానికి కేంద్ర మార్గదర్శకత్వాలకు అనుగుణంగా విజిఎఫ్ సహా ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. ముందుకొచ్చిన ప్రాజెక్టుతో ఒప్పందం చేసుకుని ముందుకు వెళ్లాలని సిఎం సూచించారు. అన్ని కాలేజీలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు బిడ్డర్లతో సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పిపిపి విధానంలో ఆస్పత్రులు, మెడికల్ కళాశాలల వసతులపై కేంద్రం సూచనలు, మార్గదర్శకాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. పిపిపి ప్రాజెక్టుల అమలును ప్రోత్సహించేందుకు కేంద్రం, ఆర్థిక వ్యవహారాల విభాగం, ఆర్థిక మంత్రిత్వశాఖ ద్వారా పలు విధానపరమైన ఆర్థిక సహాయ పథకాలను ప్రవేశపెట్టిందని అధికారులు చెప్పారు.. దీనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలని కేంద్రం సూచించిందన్నారు. ఇందులో భాగంగా వైద్య రంగంలో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద ఇచ్చే 60 శాతం ఆర్థిక మద్దతులో చెరో 30 శాతం చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. విజిఎఫ్ ద్వారా అరుణాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఆస్పత్రులు, వైద్య కళాశాలలు నిర్మించేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ఇప్పటికే అనుమతులిచ్చిందని తెలిపారు. కేంద్రం కూడా పిపిపిని ప్రోత్సహిస్తోందని, దీనిద్వారా వైద్య కళాశాలలు, ఆస్పత్రుల వంటి కీలక ఆరోగ్య వసతుల అభివృద్ధి వేగవంతం కావడమే కాకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయని కేంద్రం అభిప్రాయపడినట్లు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. తొలి విడతగా ఆదోని, మదనపల్లి, పులివెందుల, మార్కాపురం మెడికల్ కళాశాలలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. నాలుగు మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో నిర్మించి నిర్వహించేలా సెప్టెంబరు 18న ప్రభుత్వం టెండర్లు పిలిచిందని, అక్టోబరు ఆరో తేదీన నిర్వహించిన ప్రీబిడ్ సమావేశంలో ఆరు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పాల్గొన్నాయని అధికారులు తెలిపారు. అయితే కొందరు బిడ్డర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కోరారన్నారు. కొందరు రెండో సమావేశం కూడా నిర్వహించాలని కోరారని, వారికి సైట్ విజిట్ ఏర్పాట్లు కూడా చేశామని చెప్పారు. రెండు దశల అనంతరం మరింత సమాచారం కావాలని కోరాయని, ప్రతి ప్రాజెక్టుకూ గరిష్టంగా 50 ఎకరాలు కేటాయింపు, డిజైన్ల వివరాలు వంటి అంశాలపై చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందన్నారు. ఎన్ఎంసి నిబంధనలు అనుసరించి భూమిని సమర్థవంతంగా వినియోగించుకునేలా డిజైన్లు రూపొందించుకునే స్వేచ్ఛ ఇవ్వాలని, కన్సార్టియం సభ్యుల సంఖ్యను రెండు నుంచి మూడుకు పెంచాలని మిగతా 6లో

ఉద్యమ నేతపై పిడి చట్టం

- సిపిఎం నాయకుడు అప్పలరాజు అరెస్ట్
- ఉదయాన్నే ఇంటిని చుట్టుముట్టిన పోలీసులు
- అరెస్టు చేసి సెంట్రల్ జైలుకు తరలింపు
- అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా నిరసనలు

అప్పలరాజును అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి- ఎస్.రాయవరం (అనకాపల్లి)

ఆయన ప్రజా ఉద్యమ నేత. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరు బాట పట్టారు. ప్రజలను కదలించారు. ఈ క్రమంలో ఎన్నో సార్లు సర్కారు దమనకాండకు గురయ్యారు. లాఠీ దెబ్బలు...అరెస్టులకు ఏమాత్రం వెనుకంజవేయలేదు. అయితే, దీనినే రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నేరంగా పరిగణించింది. ప్రాణాలు తీయడానికి వెనుకాడని గంజాయి గూండాల మీద, ప్రజలను భయోత్పాతానికి గురిచేసే రౌడీ షీటర్లమీద, ఆడపిల్లలను అమానుషంగా కబళించే మానవమృగాల మీద సైతం పెట్టని ప్రివెంటివ్ డిటెన్షన్ (పిడి) చట్టాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, రైతు సంఘం నాయకులు ఎం.అప్పలరాజుపై బనాయించింది. బుధవారం ఉదయాన్నే అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం ధర్మవరం గ్రామానికి భారీ సంఖ్యలో పోలీసులను పంపి ఆయన్ను అరెస్ట్ చేసింది. పెద్ద ఎత్తున మంచు కమ్ముకుని ఉండే ఉదయం ఏడు..ఏడున్నర గంటల ప్రాంతంలోనే పదుల సంఖ్యలో అప్పలరాజు ఇంటిని చుట్టుముట్టి, ఒక్కసారిగా లోనికి ప్రవేశించారు. ఊహించని ఈ పరిణామానికి షాక్‌కు గురైన ఆయన భార్య లక్ష్మి, తల్లి లచ్చుమ్మ 'ఇదేమన్యాయం' అని ప్రశ్నిస్తుండగానే వారి చేతిలో కొన్ని కాగితాలుపెట్టి అక్కడినుండి తరలించారు. ఏం జరుగుతోందో, ఎలా జరుగుతోందో ఇరుగు పొరుగు వారికి కూడా తెలియకుండా పోలీసులు జాగ్రత్తపడ్డారు. ఆయన్ను అక్కడి నుండి తరలించిన తరువాతే అప్పలరాజుపై పిడి చట్టం బనాయించి, తరలించిన విషయం స్థానికులకు తెలిసింది. ఇటీవల ముఖ్యమంత్రి లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఎవరొచ్చినా అప్పలరాజును గృహ నిర్బంధం చేస్తున్నారు. చూసిన కొద్దిమంది గ్రామస్తులు ఇదీ అలాంటిదేననుకున్నారట. ఉదయాన్నే అప్పలరాజును అరెస్ట్ చేసిన పోలీసులు పలు సెక్షన్లు పెట్టి, పీడీ యాక్ట్ కింద అరెస్టు చేసి విశాఖలోని కేంద్ర కారాగారానికి బుధవారం తరలించారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ డిటెన్షన్ ఆర్డర్ జారీ చేశారు. ఈ ఏడాది ఆగస్టు 6 నుంచి అక్టోబర్ 12 మధ్య మూడు నెలల కాలంలో మిగతా 5లో

అప్పలరాజుపై పీడీ యాక్టును ఉపసంహరించాలి

- వెంటనే విడుదల చేయాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

2

గిరిజన ప్రాంతాలకు డ్రోన్లతో మందుల సరఫరా

- వైద్యారోగ్యశాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన ప్రాంత ఆస్పత్రులకు డ్రోన్ల ద్వారా మందులు సరఫరా చేసేందుకు వైద్యారోగ్యశాఖ 'రెడ్ వింగ్' సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా సమీపంలోని గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు డ్రోన్ల ద్వారా మందులు, బ్లడ్ యూనిట్స్ పంపిణీ చేసేందుకు వీలుగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు వైద్యారోగ్యశాఖ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇప్పటికే రెడ్ వింగ్ సంస్థ అరుణాచల్‌ప్రదేశ్‌లో విజయవంతంగా సేవలు అందిస్తుందని తెలిపింది. ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌లో భాగంగా మొదటి 6 నుంచి 7 నెలలు ఉచితంగా సేవలు అందించడానికి సంస్థ అంగీకరించినట్లు పేర్కొంది.

ఒప్పందంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరాపాండియన్, సంస్థ ప్రతినిధి కుందన్ మాదిరెడ్డి ఈ ఒప్పందంలో పత్రాలు మార్చుకున్నట్లు తెలిపింది. పాడేరుకు ప్రధాన కేంద్రంగా పరిసర ప్రాంతాల్లోని 60 నుంచి 80 కిలోమీటర్ల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డ్రోన్ సేవలు అందుతాయని పేర్కొంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

గవర్నరు, ముఖ్యమంత్రి క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

క్రిస్మస్ పండగ యేసు క్రీస్తును స్మరించుకునే సమయమని, ఇది ప్రజలందరిలో క్షమాగుణం, దయ, ఐక్యత, ప్రేమ, కరుణ, దాతృత్వం చూపేదని గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మాజీ సిఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. యేసు క్రీస్తు జీవితం అందరికీ ధర్మం, విశ్వాసంతో కూడిన జీవితాన్ని గడపడానికి ప్రేరణనిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రపంచంలో శాంతి, సామరస్యం కోసం కృషి చేయాలన్నారు.

బిఎల్‌ఒలకు గౌరవ వేతనం పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల విధులు నిర్వహిస్తున్న బూత్ లెవెల్ ఆఫీసర్ల (బిఎల్‌ఒ)కు ప్రభుత్వం గౌరవ వేతనం పెంచింది. ఈ మేరకు బుధవారం జిఓ ఆర్‌టి నెంబరు 2455ను విడుదల చేసింది. పెంచిన వేతనాలు 2025 ఆగస్టు ఒకటి నుంచి అమల్లోకి వచ్చినట్లేనని అందులో పేర్కొంది. ప్రస్తుతం బిఎల్‌ఒలకు ఏడాదికి రూ.12 వేలు, బిఎల్‌ఒ సూపర్‌వైజర్లకు రూ.18 వేలు ఇస్తుండగా, ప్రస్తుతం ప్రభుత్వం ఎస్ఎస్ఆర్/ఎస్ఆర్‌తో పాటు ప్రత్యేక కార్యక్రమాలకు బిఎల్‌ఒలకు అదనంగా రూ.2 వేలు చెల్లించనుంది. సంవత్సరం పూర్తిగా పనిచేసిన వారికి పూర్తి వేతనం, మధ్యలో చేరిన వారికి పనిచేసిన కాలానికి అనుగుణంగా చెల్లింపులుంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

'ఉన్నావో' దుండగునికి బెయిల్ దుర్మార్గం : ఐద్వా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని 'ఉన్నావో' దుండగుడికి శిక్ష నిలిపివేయడం, బెయిల్ ఇవ్వడం దుర్మార్గమని ఐద్వా రాష్ట్ర కమిటీ పేర్కొంది. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో దుండగుడు కుల్దీప్ సింగ్ సెన్‌గర్‌కు హైకోర్టు శిక్షను నిలిపివేయడం, బెయిల్ ఇవ్వడాన్ని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, సావిత్రి తప్పుబట్టారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దుండగుడుకు రాజకీయ అండదండలు ఉన్నాయని, కోర్టు తీర్పు తమను తీవ్ర ఆందోళన కలిగిస్తోందని బాధితులు చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతుందని తెలిపారు. మైనర్‌పై అత్యాచారం చేసి ఆమె తండ్రిని హత్య చేసిన కేసులో సెన్‌గార్ దోషి అని 2019లో కోర్టు నిర్ధారించిందని పేర్కొన్నారు.

నేరస్తులు అనే అనుమానంతో వారి ఇళ్లను, ఆస్తులను బుల్డోజర్లతో కూల్చి వేసే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ కేసులో దుండగుడుకు కోర్టు అనుకూలంగా వ్యవహరిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

శివాజీ మాటలు అభ్యంతరకరం

మహిళల దుస్తులపై హీరో శివాజీ మాటలు చాలా అభ్యంతరకరం అని శ్రీదేవి, సావిత్రి పేర్కొన్నారు. హీరోయిన్‌లను అభ్యంతరకరంగా చూపించి వ్యాపారం చేసుకుంటున్న నిర్మాతలు, దర్శకులను శివాజీ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. చిన్న పిల్లలు మొదలు వృద్ధ మహిళలు వరకూ అత్యాచారానికి గురికావడానికి కారణమేంటని ప్రశ్నించారు.

27న చలో లోక్ భవన్

- 26న 'ఎంజిఎన్ఆర్ఇజిఎ'పై గ్రామ సభలు
- ఎస్‌కెఎం పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరుతూ.. ఈ నెల 26న ప్రభుత్వం నిర్వహించనున్న గ్రామ సభల్లో నిరసన తెలియజేయాలన్నారు. 27న చలో లోక్ భవన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. విజయవాడలోని ఎంబివికెలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విబి జి ఆర్ఎఎం జి పేరుతో తెచ్చిన కొత్త చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు, ఇతర వృత్తిదారులకు పని కల్పించిన పథకం 2005లో ప్రారంభించిన ఉపాధి హామీ పథకమని, ఆ పథకానికి అవసరమైన మార్పులు చేసి కొనసాగించాలన్నారు. కొత్త పథకంలో కేంద్రం ఆర్థిక భారాన్ని తగ్గించుకుని, రాష్ట్రాలపై మోపిందన్నారు. కొన్ని రాష్ట్రాలకు మాత్రం 90 శాతం నిధులిస్తూ, మరికొన్ని రాష్ట్రాలకు 60 శాతం నిధులు కేటాయిస్తూ వివక్ష చూపుతోందని తెలిపారు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతున్నా.. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మిన్నకుండటం తగదన్నారు. 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచామనడం ప్రజలను మభ్యపెట్టడమేనని తెలిపారు. ఈ నెల 26న నిర్వహించే గ్రామ సభల్లో ఈ పథకానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలని రైతులు, వ్యవసాయ కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీరు ఫెడరలిజానికి వ్యతిరేకంగా ఉందన్నారు.

ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. ఉపాధి పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం దుర్మార్గమన్నారు. కేంద్ర చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని రైతులు, వ్యవసాయ కూలీలకు పిలుపునిచ్చారు. ఎన్‌డిఎ పక్షాలు మౌనంగా ఉండటం సరికాదని హితవు పలికారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఇటీవల రూ.16 లక్షల కోట్లు రుణాలు రద్దు చేసిందని, ప్రతియేటా రూ.2 లక్షల కోట్లు రాయితీలు ఇస్తుందన్నారు. పేదలకు మేలు చేసే ఉపాధి హామీ చట్టం రద్దు చేయడం, ప్రభుత్వానికి అనుకూలంగా కొత్త పథకం తీసుకురావడం సరైంది కాదన్నారు. 27న లెనిన్ సెంటర్ నుంచి లోక్ భవన్‌కు ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేసి, వినతిపత్రాన్ని సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల చంద్రశేఖర్, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి జమలయ్య, ఎఐకెఎం రాష్ట్ర కార్యదర్శి హరినాథ్, టియుసిఐ రాష్ట్ర నాయకులు మరీదు ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి రాణి, రైతు సంఘం నాయకులు పివి ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటాలిటీ ఇండస్ట్రీకి రుషికొండ ప్యాలెస్

- 28న మరోసారి భేటీ
- పర్యాటక భూములపై సమగ్ర సర్వే
- త్వరలో తుది నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా, ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా విశాఖలోని రుషికొండ ప్యాలెస్‌ను వినియోగించాలని భావిస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్ తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సబ్ కమిటీ మూడో భేటీ బుధవారం సచివాలయంలో జరిగింది. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. ప్యాలెస్ వినియోగంపై వచ్చిన ప్రతిపాదనలపై చర్చించామని, తాజ్, లీలా ప్యాలెస్, అట్మాస్ కోర్, ఫెమా సంస్థలు ముందుకొచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రుషికొండ భవనాలు హోటళ్లకు పూర్తి అనుకూలంగా లేవన్నారు. ప్యాలెస్‌లపై అదనంగా భవనాలు నిర్మిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వచ్చినట్లు మంత్రులు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలపై మరోసారి ఈనెల 28న ఆన్‌లైన్ జిఒఎం సమావేశంలో చర్చిస్తామన్నారు. అనంతరం తుది ప్రతిపాదనలను రాష్ట్ర కేబినెట్ ఆమోదం కోసం పంపనున్నట్లు వారు తెలిపారు. అంతిమంగా హాస్పిటాలిటీ వైపు మొగ్గు చూపుతూ వయబుల్ మోడ్‌లో ముందుకు వెళ్లాలని సబ్ కమిటీలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బీచ్ ఫ్రంట్ వినియోగంలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ మాల్దీవులు, పుదుచ్చేరి తరహా విధానాలను అనుసరిస్తే బాగుంటుందని చర్చించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్ణయాలతో పర్యాటకశాఖకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. రుషికొండ కింద ఉన్న తొమ్మిది ఎకరాలు హోటల్స్ కోసం అదనంగా అడిగారని, సిఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం ఏడెకరాల్లో ఎలాంటి నిర్మాణం చేయకూడదని తెలిసిందన్నారు. మిగిలిన రెండెకరాలను ఎలా వినియోగిస్తే బాగుంటుందనే విషయంపై చర్చించినట్లు మంత్రులు వెల్లడించారు. రుషికొండ ప్యాలెస్‌లోని చివరి రెండు బ్లాకులు ప్రజలకు ఆర్ట్ గ్యాలరీ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం, ఇతర అవసరాల కోసం ఉంచుతామన్నారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రజాధనం వృథా అయ్యిందన్నారు. భేటీ సందర్భంగా పర్యాటకశాఖ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆదేశించామన్నారు. నివేదిక వచ్చిన అనంతరం తర్వాత జరిగే భేటీలో నిర్ణయం తీసుకుంటామన్నారు. రుషికొండ ప్యాలెస్ వైట్ ఎలిఫెంట్‌లా మారిందని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్వాకంతో పర్యాటకశాఖకు ఏటా రూ.7 కోట్ల ఆదాయాన్ని తెచ్చే రిసార్ట్ స్థానంలో భవనాలు కూల్చి ప్యాలెస్ కట్టారని, తద్వారా ఆదాయం కోల్పోగా ప్రతినెలా రూ.25 లక్షల నిర్వహణ భారం పడిందన్నారు. ఈ భేటీలో పర్యాటకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, ఎపిటిఎ సిఇఒ, ఎపిటిడిసి ఎమ్‌డి ఆమ్రపాలి, పర్యాటకశాఖ అధికారులు పాల్గొన్నారు.

సనాతన ధర్మానికి
వ్యతిరేక పోరాటమే పెరియార్‌కు నివాళి

- అంద్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సనాతన ధర్మానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే పెరియార్‌కు ఘనమైన నివాళి అని పూలే, అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అంద్ర మాల్యాద్రి తెలిపారు. విజయవాడ సున్నపు బట్టీల సెంటర్‌లోని పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన బుధవారం పెరియార్ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. అసమానతలతో కూడిన సమాజం అభివృద్ధి జరుగుతోందని, సమానత్వం కోసం ఐక్య ఉద్యమాలు జరగాలని అన్నారు. మతోన్మాదం పేరుతో దేశంలో దాడులు, కుల వివక్ష పెరిగిపోతుందన్నారు. వీటికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి అసమానతలు లేని సమాజం కోసం ప్రయత్నం చేయాలన్నారు. పెరియార్ జీవితం నేటి ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. మహనీయులు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడుతూనే సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రసన్నకుమార్, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

గిరిజనులపై దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- హోంమంత్రి అనితకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, ఇనుమూరులో (డి.22) ఆదివాసీ గిరిజనులపై దాడిచేసి, గాయపర్చి, పంటను ధ్వంసం చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, 5వ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనుల భూ సమస్యలపై పోలీసుశాఖ అనుచిత జోక్యాన్ని అరికట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనితను వి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి కలిసి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఇనుమూరులో ఆర్.ఎస్.నెంబర్ 221, 223, 210, 213, 217లో 42.77 ఎకరాల ప్రభుత్వ బంజరు భూములు 57 కుటుంబాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు తమ పూర్వీకుల నుండి పోడుసాగు చేస్తున్నారని తెలిపారు. ఈ భూములపై తమకు పట్టాలివ్వాలని, దశాబ్దాలుగా కోరుతూనే ఉన్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై రాష్ట్ర హైకోర్టులో కేసు నమోదైందని తెలిపారు. అయినప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులతో కలిసి పలుమార్లు గిరిజనులను వేధించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంగళవారం బుట్టాయిగూడెం గ్రామంలో రెవెన్యూ అధికారులతో కలిసి, పోలీసు అధికారులు ఆదివాసీ గిరిజనులు (ఎస్‌టి-కోయ) వేసిన మొక్కజొన్న పంటను ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారని వివరించారు. అడ్డొచ్చిన గిరిజనులపై దాడిచేసి గాయపర్చారని, వేరే జిల్లాలో ఉన్న గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా ఆర్‌డిఒ ఇచ్చిన ప్రొటెక్షన్ ఆర్డర్‌ను సాకుగా తీసుకుని పోలవరం డిఎస్‌పి, జీలుగుమిల్లి సిఐ ఆదేశాల మేరకు బుట్టాయిగూడెం ఎస్ఐ అయిన మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని వివరించారు. తమ పంటను ధ్వంసం చేయొద్దని వేడుకున్న ఆదివాసీ గిరిజనులను కొట్టి గాయపర్చారని, దాడిలో చంద్రశేఖర్ అనే గిరిజనుడు తీవ్రంగా గాయపడ్డాడని పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజన మహిళలను ఎస్ఐ మహేష్, మగ పోలీసులు తీవ్రంగా కొట్టి, గెంటివేశారని తెలిపారు. పోలీసులు ఈ విధంగా దుశ్చర్యలకు పాల్పడటం సర్వసాధారణమైపోయిందని మంత్రికి చెప్పారు. ఇటీవల ఇనుమూరుతో పాటు ఇదే మండలానికి చెందిన మర్లగూడెం, బుట్టాయిగూడెం గ్రామాల్లోనూ, జీలుగుమిల్లి మండలంలో సిరివారిగూడెంలో ఆదివాసీ గిరిజనులు, మహిళల పట్ల ఈ విధంగానే వ్యవహరించారని మంత్రికి వివరించారు. తరుచూ గిరిజనులపై పలు కేసులు మోపుతున్నారని, షెడ్యూల్ ప్రాంత భూ సమస్యలపై పోలీసుల జోక్యం ఉండకూడదని జిఓ ఎంఎస్ నెంబర్ 1049/28-7-2007 (ఆర్) ఉన్నా ఖాతరు చేయడం లేదని పేర్కొన్నారు. 5వ షెడ్యూల్‌లో చట్టవిరుద్ధంగా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి తహశీల్దార్లు గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇస్తున్నారని చెప్పారు. వాటిని సాకుగా తీసుకుని పోలీసులు ఈ వివాదాల్లో జోక్యం చేసుకుని గిరిజనులను వేధిస్తున్నారని, చివరికి పోలీసులే వారి ఆదేశాలు పాటించని గిరిజనులపై కేసులు, రౌడీషీట్లు పెడతామని బెదిరిస్తున్నారని వివరించారు. చట్టం అందరికీ సమానమన్నది మాటలకే పరిమితం చేస్తున్నారని, గిరిజనేతర భూస్వాముల దాడి, భూ ఆక్రమణలపై గిరిజనులు ఫిర్యాదు చేస్తే సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోమని తహశీల్దార్ కోర్టుల్లో తేల్చుకోమంటున్నారని తెలిపారు. ఇందుకు తార్కాణంగా పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్లలో ఒక్క గిరిజనేత భూస్వామిపై కూడా కేసు నమోదు కాలేదని, గిరిజనులు, వారి నేతలపై వందలాది కేసులు నమోదయ్యాయని, ఇది గిరిజనుల పట్ల వివక్షకు, పరాకాష్టకు నిదర్శనమని పేర్కొన్నారు. తక్షణం ఇనుమూరు గిరిజనులపై దాడిచేసి, గాయపర్చి, మహిళలను కొట్టి, పంట ధ్వంసం చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, షెడ్యూల్ ప్రాంత భూ వివాదాల్లో జోక్యం చేసుకోరాదన్న జిఓ, ఆదేశాలు, చట్టాలను అమలు పర్చాలని కోరారు.

పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

నెల్లూరు జిల్లాలో గంజాయి మాఫియాపై పోరాడిన ఫలితంగా హత్యకు గురైన కె పెంచలయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆదుకోవాలని హోంమంత్రి అనితను శ్రీనివాసరావు, రమాదేవి కోరారు. ఎస్‌సి, ఎస్‌టి చట్టం ప్రకారం పునరావాస చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

అప్పలరాజును విడుదల చేయాలి

అనకాపల్లి జిల్లాలో బల్క్‌డ్రగ్స్ కాలుష్యం మీద జరుగుతున్న ఆందోళనలో పాల్గొంటున్న సిపిఎం నాయకులు అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టి అక్రమంగా అరెస్టు చేశారని, ఆయనను విడుదల చేయాలని, పిడి యాక్టును ఎత్తివేయాలని మంత్రిని కోరారు.

విఆర్‌ఎల సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విఆర్‌ఎల సమస్యలపై సిఎస్, రెవెన్యూ ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తానని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఎపి గ్రామ, రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీసాహెబ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం బుధవారం సచివాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. ఈ సందర్భంగా విఆర్‌ఎలకు ప్రమోషన్లు ఇవ్వాలని, తెలంగాణలో అమలు చేస్తున్న విధంగా పే స్కేల్ జీతాలు చెల్లించాలని, విఆర్‌ఒ, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ ఖాళీ పోస్టుల భర్తీలో విఆర్‌ఎలకు 70 శాతం పోస్టులు కేటాయించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన బృందంలో అల్లూరి సీతారామరాజు, కడప, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కొండబాబు, నాగేంద్ర, దశరథరాజు ఉన్నారు.

పండగలకూ కందిపప్పు లేనట్లే !

- జనవరి నుంచి రాగులు, జొన్నలు
- జిల్లా కేంద్రాల్లోనే గోధుమ పిండి పంపిణీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేదలకు సబ్సిడీపై పంపిణీ చేయాల్సిన కందిపప్పుకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. అధికారంలోకి వచ్చిన ఒకట్రెండు నెలలు పంపిణీ చేసిన అనంతరం రేషన్ షాపులకు కందిపప్పు పంపిణీని నిలిపేసింది. అధికారంలోకి వచ్చి రెండేళ్లయిన సందర్భంగానైనా నూతన సంవత్సరంలో కందిపప్పును పంపిణీ చేస్తారని ఆశించిన పేదలకు ప్రభుత్వం నిరాశే మిగిల్చింది. కందిపప్పు ఓపెన్ మార్కెట్లో కిలో రూ.180 నుంచి రూ.200 ధర పలుకుతోంది. రేషన్ షాపుల ద్వారా పప్పును పంపిణీ చేస్తూ సబ్సిడీ పోను లబ్ధిదారులకు కిలో రూ.68లకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సబ్సిడీ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం కందిపప్పు పంపిణీకి రాం రాం పలికింది. పేదలు బయట మార్కెట్లో అంత ధర పెట్టి కొనడం కష్టమే. జాతీయ ఆహార భద్రత పథకం-2013 ప్రకారం.. 2026 జనవరి నుంచి రేషన్ షాపుల్లో బియ్యంతోపాటు రాగులు, జొన్నలు కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ శాఖ జొన్నలు 21,766 మెట్రిక్ టన్నులు, రాగులు 22,136 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జొన్నలు రేషన్ దుకాణాలకు ఇప్పటికే చేరగా, గోధుమ పిండి, రాగులు ఇంతవరకు చేరలేదని సమాచారం. ఇప్పటి వరకు కేవలం రాయలసీమతో పాటు పల్నాడు జిల్లాల్లో మాత్రమే రాగులు పంపిణీ చేయగా, తాజాగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ రాగులతో పాటు జొన్నలు పంపిణీ చేసే దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందుకు ప్రధానంగా డయాబెటిస్ అధికంగా ఉన్న జిల్లాల్లో పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఉదాహరణకు ఒక కార్డుదారునికి 20 కిలోలు బియ్యం ఇస్తుంటే అటువంటి వారు కోరుకుంటే వారికి రాగులు లేక జొన్నలు 3 కిలోల వరకు ఇచ్చి, ఆ మేర బియ్యం కోటాను కుదిస్తారు. అలాగే జనవరి నుంచి కిలో రూ.20 ధరకు గోధుమ పిండి ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి బుధవారం కన్స్యూమర్ ఎఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్ సప్లై డిపార్టుమెంట్ జిఓఆర్‌టి నెంబరు 66ను విడుదల చేసింది. గోధుమ పిండి కిలో రూ.20లకు ఇవ్వనుండగా, రేషన్ షాపు డీలర్లకు కిలోకు రూ.1 కమీషన్ కింద ప్రభుత్వం చెల్లించనుంది. గోధుమ పిండిని రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తారా? లేక కేవలం కొన్ని ప్రాంతాల్లో పంపిణీ చేస్తారా? అనే విషయం జిఓలో పేర్కొనబోయినప్పటికీ ఆ శాఖ అధికారులు నుంచి అందుతున్న సమాచారం మేరకు 2026 జనవరి ఒకటి నుంచి కేవలం జిల్లా కేంద్రాల్లోనే పైలట్ ప్రాజెక్టుగా గోధుమ పిండిని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తారు. ఈ ప్రాజెక్టు సక్సెస్ అయిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

అప్పలరాజుపై పీడీ యాక్టు కేసు ఉపసంహరించాలి

- వెంటనే విడుదల చేయాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు నాయకులు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పీడీ యాక్టు కేసును ఉపసంహరించాలని, వెంటనే విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఉమ్మడి విశాఖపట్నం, ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న ఆయనను చట్టవిరుద్ధంగా నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫార్మా లాబీ, కార్పొరేట్ల కొమ్ముగాసి, వారిని సంతృప్తిపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చర్యలకు పాల్పడుతోందని తెలిపారు. ఏనాడో ఉమ్మడి రాష్ట్రంలో 2013 మే నెలలో నమోదైన వాటి మొదలు తాజాగా రాజయ్యపేట బల్క్‌డ్రగ్ పార్క్ కేసు 10.12.2025 వరకు మొత్తం 19 కేసుల్లో ప్రభుత్వం అప్పలరాజును నిందితునిగా పేర్కొందని తెలిపారు. కానీ ఆ 19 కేసుల్లో రెండింటిలో కోర్టులు నిర్దోషిగా తేల్చగా, 12 కేసులు మూసివేశారని పేర్కొన్నారు. ఒక కేసు సివిల్ వివాదంగా ఖరారు చేయగా, మరో నాలుగు కేసులు దర్యాప్తులో ఉన్నాయని, ఇందులోనూ 151 సెక్షన్ కేసులే ఎక్కువని తెలిపారు. అప్పలరాజును నిర్బంధించాలన్న దుర్బుద్ధితో పీడీ యాక్టు ప్రయోగించారని స్పష్టంగా అర్థమవుతోందని పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాలు, భూములు కోల్పోతున్న పేద రైతులు, అందులోనూ అసైన్డ్ భూములు సాగుచేస్తున్న దళిత, గిరిజన బలహీనవర్గాల వారి కోసం, వృత్తి, ఉపాధి కోల్పోయే వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదార్ల ప్రయోజనాలు కాపాడడానికి అప్పలరాజు ఉద్యమాల్లో పాల్గొంటూ వాటికి నాయకత్వం వహిస్తున్నారే తప్ప సొంత ప్రయోజనాల కోసం కాదని వివరించారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కాపాడే ధ్యేయంతో ప్రజలను కదిలించి ఉద్యమాలు నడుపుతున్నందుకే ప్రభుత్వం ఆయనపై కక్ష కట్టిందని తెలిపారు. పీడీ చట్టం నోటీసులో పేర్కొన్నట్లు అప్పలరాజు భూకబ్జాదారు కాదని, కార్పొరేట్ల లాభాల కోసం సముద్ర తీరాన్ని, పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టి రాజ్యాంగం, చట్ట ప్రకారం ప్రభుత్వం వ్యవహరించాలని ప్రజలను సమీకరిస్తున్నారే తప్ప ఆయన ఏ రకంగానూ ఎవరిపైనా గూండాగిరి చేయలేదని వివరించారు. ఈ కేసులు పరిశీలిస్తే ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, ఆ తరువాత టిడిపి, వైసిపి, ఇప్పుడు టిడిపి కూటమి ఇలా ఏ పార్టీ అధికారంలో ఉన్నా అప్పలరాజు స్థానిక ప్రాజెక్టు బాధితుల పక్షాన నిలబడ్డారని, పాలన చేస్తున్నవారు కార్పొరేట్ సేవలోనే తరిస్తున్నారని విదితమవుతుందని వివరించారు. గంజాయి, ఎర్రచందనం రేపిస్టులు, హ్యూమన్ ట్రాఫికింగ్ చేసేవారిని వదిలి నిజాయతీతో నిస్వార్థంగా ప్రజల కోసం పోరాడుతున్న అప్పలరాజుపై పీడీ చట్టం ప్రయోగించడం ప్రభుత్వ నైజాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. విశాఖలో సిఐటియు అఖిలభారత మహాసభ జరుగుతున్న నేపథ్యంలో అరెస్టు చేయడం దాన్ని మరింత రుజువు చేస్తోందని విమర్శించారు. తెలంగాణలో చట్టవిరుద్ధంగా పీడీ యాక్టు అనేక మందిపై ప్రయోగించడాన్ని తాజాగా సుప్రీంకోర్టు తప్పుబట్టిందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని పేర్కొన్నారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి భూ సేకరణకు అడ్డుపడేవారిపై పీడీ యాక్టు ప్రయోగించాలని ఆర్డరు జారీ చేశారని, దానితోనే కలెక్టర్ కనీసం ఆయనపై ఇప్పటి వరకున్న నేర చరిత్రను కూడా చదవకుండానే సంతకం పెట్టి ఆర్డర్ జారీ చేసినట్లు కనిపిస్తుందని పఏర్కొన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న అప్పలరాజుపై చట్టవిరుద్ధంగా బనాయించిన అక్రమ పీడీ చట్టం కేసును ఉపసంహరించి, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాతంత్రవాదులు, వామపక్ష, లౌకిక పార్టీలు, సంఘాలు ప్రభుత్వ చర్యను ఖండించాలని, అప్పలరాజుపై పీడీ యాక్టును ఉపసంహరించేలా ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేశారు.

మూకట్లో గడ్డి పెట్టుకుని నిరసన ప్రదర్శన చేస్తున్న పంచాయతీ కార్మికులు

వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి..?

- అనంతపురం కలెక్టరేట్ వద్ద గ్రామ పంచాయతీ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని అధికారులను గ్రామ పంచాయతీ కార్మికులు నిలదీశారు. పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు అనంతపురం కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలేదీక్షలు బుధవారం మూడవ రోజు కొనసాగాయి. నిరసనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులు అనంతపురం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మూకట్లో గడ్డి పెట్టుకుని సంఘమేష్ సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. కలెక్టరేట్ ప్రధాన గేటు ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు హెచ్.మధు అధ్యక్షత నిర్వహించిన ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ... కార్మికులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు వారి వద్దకు వచ్చారు. సాధ్యమైనంత త్వరలో పెండింగ్ వేతనాలు అన్నీ చెల్లించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లాఉపాధ్యక్షులు మన్నీల రామాంజనేయులు, నగర అధ్యక్షులు వెంకటనారాయణ, గ్రామ పంచాయతీల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి నెలా జీతంలో రూ.ఐదు వేలు విద్యార్థికి సాయం

- ఇప్పటంలో పర్యటించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- వృద్ధురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

ఇప్పటంలో నాగేశ్వరమ్మ తో మాట్లాడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్

ప్రతిపక్ష నేతగా పవన్ కల్యాణ్ గతంలో ఇప్పటం గ్రామంలో పర్యటించినప్పుడు ఓ వృద్ధురాలికి ఇచ్చిన మాటను, నేడు అధికారంలోకి వచ్చాక ఉప ముఖ్యమంత్రి హోదాలో నిలబెట్టుకున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో నివసిస్తున్న ఇండ్ల నాగేశ్వరమ్మ కుటుంబ సభ్యులతో కలసి బుధవారం మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో పలు ఇళ్లను కూల్చి వేశారు. ఆ సమయంలో పవన్ కల్యాణ్ గ్రామంలో పర్యటించి బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ సందర్భంగా ఇండ్ల నాగేశ్వరమ్మ అనే బాధితురాలు.. ఎన్నికల్లో గెలిచి పెద్ద పదవిలో ఉన్నపుడు మళ్లీ మా ఇంటికి రావాలని పవన్‌ను కోరారు. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి హోదాలో ఇప్పటం గ్రామంలోని నాగేశ్వరమ్మను కలిసి ఆమెకు రూ. 50 వేలు, ఆమె మనవడి చదువు నిమిత్తం లక్ష రూపాయల నగదును అందించారు. నాగేశ్వరమ్మ మనవడి విద్యాభ్యాసం కోసం ప్రతి నెలా తన వేతనం నుంచి రూ. ఐదు వేలు అందజేస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరమ్మ మాట్లాడుతూ పవన్ పర్యటనపై నాగేశ్వరమ్మ భావోద్వేగానికి లోనయ్యారు. "ఇచ్చిన మాట ప్రకారం పవన్ బాబు మా ఇంటికి రావడం చాలా సంతోషంగా ఉంది. మా ఇంటి పెద్ద కొడుకులా వచ్చి ఆప్యాయంగా పలకరించారు. నా ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మా కుటుంబానికి కొండంత అండగా ఉంటామని భరోసా ఇచ్చారు" అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, గంజి, చిరంజీవి, జనసేన తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, జనసేన తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ ఒంగోలు 2వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడడంలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్‌పి వి హర్షవర్ధన్‌రాజు అభినందించారు. బుధవారం కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.

ప్రకాశం జిల్లా, కొత్తపట్నం మండలం, ఈతముక్కల గ్రామానికి చెందిన తాబేటి కృపారావుకు మద్దిపాడు మండలం, రాచవారిపాలెం గ్రామానికి చెందిన సుభాషిణి (33)కి 14 ఏళ్ల క్రితం వివాహమైంది. అనంతరం కొద్దికాలం తరువాతకపారావు మద్యానికి బానిసై, పనికి వెళ్లకుండా భార్యపై అనుమానం పెంచుకొని ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తూ ఉండేవాడు. ఈ వేధింపులు తట్టుకోలేక సుభాషిని ఈతముక్కల గ్రామంలో తన అక్క సునీత వద్దకు వెళ్లి నివసించేవారు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకొని, నిందితుడి మాటలు నమ్మి సుభాషిని మళ్లీ భర్త వద్దకు వెళ్లారు.

2015 సంవత్సరం డిసెంబర్ 24న రాత్రి సుభాషినిని కృపారావు రోకలిబండతో కొట్టి హత్య చేశాడు. ఈ కేసులో నిందితుడికి బుధవారం నాడు ఒంగోలు 2వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పందిరి లలిత జీవిత ఖైదు, రూ.15 వేల జరిమానా విధించారు.

జగన్ కార్యక్రమాలు బుధవారం రద్దు

- నేడు క్రిస్మస్ వేడుకల్లో పాల్గోనున్న మాజీ సిఎం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్వరం రావడంతో డాక్టర్ల సలహాలు మేరకు బుధవారం కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. పులివెందులలో మూడు రోజుల పర్యటనలో భాగంగారెండవ రోజు ఇడుపులపాయలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని, పట్టణ పరిధిలోని వైసిపి శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాల్సి ఉంది. జ్వరం రావడంతో అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని పులివెందులలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకున్నారు. గురువారం క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని సిఎస్‌ఐ చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. అనంతరం ఆయన హెలికాప్టర్‌లో బెంగళూరుకు బయలుదేరి వెళతారు.

'బాహుబలి' విజయవంతం

- నింగిలోకి 'బ్లూ బర్డ్ బ్లాక్ 2' ఉపగ్రహం
- కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులు
- భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలు : ఇస్రో చైర్మన్

నింగిలోకి 'బ్లూ బర్డ్ బ్లాక్ 2' ఉపగ్రహం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో చరిత్ర సృష్టించింది. వాణిజ్య ప్రయోగాల్లో కీలక మైలురాయిని అందుకుంది. అమెరికాకు చెందిన 'బ్లూ బర్డ్ 2' భారీ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి విజయవంతంగా పంపింది. బుధవారం ఉదయం 8.55 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్‌విఎం3 ఎం6 రాకెట్ ద్వారా ఈ వాణిజ్య ఉపగ్రహాన్ని ప్రయోగించింది. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూ బర్డ్ బ్లాక్ 2ను రాకెట్ విజయవంతంగా మోసుకెళ్లింది. 15.30 నిమిషాల్లో మూడు దశల్లో రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన ఎఎస్‌టి స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. సుమారు 6,100 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం ఇస్రో ఇప్పటివరకు ప్రయోగించిన అత్యంత బరువైన వాణిజ్య పేలోడ్‌గా రికార్డు సృష్టించింది. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో షార్‌లో సంబరాలు చేసుకున్నారు.

కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులు

ఈ ప్రయోగం ప్రపంచ కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులకు బాటలు వేసింది. బ్లూ బర్డ్ బ్లాక్-2 ఉపగ్రహం ద్వారా 4జి/5జి సిగ్నల్స్ అందుతాయి. దీనివల్ల ఎటువంటి సిగ్నల్స్ లేని మారుమూల ప్రాంతాల్లో కూడా మొబైల్ సేవలు పొందే వీలుంటుంది. ఆర్బిట్‌లో అతి పెద్ద వాణిజ్య ఉపగ్రహంగా గుర్తింపు పొందిన దీని యాంటీనా విచ్చుకున్న తర్వాత ఏకంగా 223 చదరపు మీటర్ల వైశాల్యం కలిగి ఉంటుంది. ఈ విజయంతో అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష మార్కెట్లో భారత్ మరోసారి తన సత్తా చాటింది.

శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపిన ఇస్రో చైర్మన్

భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలు చేపడతామని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవ రహిత ప్రయోగాలు, నావిగేషన్, ఎయిర్ స్పేస్ స్టేషన్, వీనస్ ఆర్బిట్ ప్రయోగాలు, వాణిజ్య ఒప్పందాలు జరుగుతాయని తెలిపారు. ప్రయోగం విజయవంతం కావడానికి అహర్నిశలు కృషి చేసిన శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు.

మోసపూరిత ఏజెంట్లపై కఠిన చర్యలు

- కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ (అన్నమయ్య జిల్లా)

మోసపూరిత ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి ధీరజ్ కునుబిల్లితో కలిసి ఆయన బుధవారం పాస్‌పోర్ట్ ఫిర్యాదుల పరిష్కారం, వలసదారుల సౌకర్య కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమన్నారు. జిల్లా నుంచి ఉపాధి కోసం, ఉన్నత చదువుల కోసం గల్ఫ్ దేశాలకు, ఇతర విదేశాలకు వెళ్లే వారి సంఖ్య చాలా ఎక్కువైందని తెలిపారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియలో తలెత్తే సాంకేతిక సమస్యల వల్ల సామాన్యులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పారదర్శకమైన సేవలు అందించడమే కాకుండా, విదేశాల్లో ఇబ్బందులు పడే వలస కార్మికులకు ఈ కేంద్రం ఒక భరోసాగా నిలుస్తుందని తెలిపారు. జిల్లా ప్రజలు పాస్‌పోర్ట్ సమస్యల కోసం ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఈ ప్రత్యేక కేంద్రం ద్వారా పాస్‌పోర్ట్ దరఖాస్తుల పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరిస్తామన్నారు. ఏజెంట్ల చేతిలో మోసపోయిన వలసదారులు లేదా విదేశాల్లో చిక్కుకుపోయిన వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పర్యవేక్షించి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎం వెంకటాద్రి, రాయచోటి డిఎస్‌పి ఎంఆర్ కృష్ణమోహన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు పి రాజారమేష్, పి వెంకటేశ్వర్లు, పలువురు సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యంతో ఆకట్టుకున్న గిరిజనులు

అలరించిన పెసా మహోత్సవ్

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఐదవ షెడ్యూలులోని (ఏజీన్సీ) ప్రాంతంలో అమలు జరిగే పెసా చట్టంపై అవగాహన పెంపొందించేందుకు విశాఖ పోర్టు స్టేడియంలో తలపెట్టిన పెసా మహోత్సవ్ బుధవారమూ సందడిగా సాగింది. కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, ఎపి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్, కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ముక్తా శేఖర్, కమిషనర్ కృష్ణతేజ, ఎపి ఎస్‌ఐఆర్‌డి కమిషనర్ రేవు ముత్యాలరాజు, ఎకనామిక్ అడ్వైజర్ విజయకుమార్ బెహరా, విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎస్‌పి సింగ్ బఘేల్ వీడియో సందేశం ద్వారా మాట్లాడారు. చట్టం గొప్పతనాన్ని వివరించారు. బుధవారం ఉదయం నుంచి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు ఘనంగా సాగాయి. గిరిజన జీవన విధానం, సంప్రదాయాలు, ఐక్యతను ప్రతిబింబించేలా నృత్యాలు అలరించాయి. తెలంగాణకు చెందిన గుస్సాడి, రాజస్థాన్ గవరి, ఒడిశా థింసా నృత్యాలు, మహారాష్ట్ర తార్పావాద్ సంగీతం, గుస్సాడి థింసా నృత్యం, మధ్యప్రదేశ్ తథియా, బైగా కర్మ - శైలా నృత్యాలు, జార్ఖండ్ మర్దానా ఝుమైర్ నృత్యం, హిమాచల్ ప్రదేశ్ కిన్నౌరి కయాంగ్ నృత్యం, గుజరాత్ గిరిజన భజన మండలి ప్రదర్శనలు, తల్వార్ నృత్యం, ఛత్తీస్‌గఢ్ గౌర్ నృత్యం, ఆంధ్రప్రదేశ్ థింసా నృత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం కళాకారులకు అధికారులు జ్ఞాపికలు అందజేశారు. పెసా రన్, కబడ్డీ, ఆర్చరీ పోటీల విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.

.డయాఫ్రంవాల్ గ్యాప్ 2 ప్రాంతంలో పరిశీలిస్తున్న పిపిఎ బ ందం

'పోలవరం' పురోగతిపై ప్రాజెక్టు అథార్టీ సంతృప్తి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు పనుల తీరుపై పోలవరం ప్రాజెక్టు అథార్టీ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రాజెక్టు సిఇఒ యోగేష్ పైతంకర్ నేతృత్వంలో అథార్టీ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, పవర్ చీఫ్ ఇంజనీర్లు సివి సుబ్బయ్య, ఎం రమేష్‌కుమార్, డైరెక్టర్ కె శంకర్ బృందం బుధవారం పోలవరం ప్రాజెక్టులో పర్యటించింది. పునరావాస కాలనీలను సందర్శించి మౌలిక వసతులు పరిశీలించిన అనంతరం ప్రాజెక్టుకు చేరుకుంది. నూతన సిఇఒగా బాధ్యతలు స్వీకరించిన యోగేష్ పైతంకర్ తొలిసారి పోలవరం పర్యటనకు వచ్చారు. వారికి ఇంజనీరింగ్ చీఫ్ ఎన్ నరసింహమూర్తి, మేఘా ఆపరేటింగ్ చీఫ్ ఆఫీసర్ ఎఎన్‌వి సతీష్‌బాబు స్వాగతం పలికారు. బృందం సభ్యులు పోలవరం ప్రాజెక్టులో స్పిల్వే, గ్యాప్-1, 2 ప్రాంతాలను, ఎగువ, కాఫర్ డ్యామ్‌ల వద్ద బిట్రస్ డ్యామ్ నిర్మాణాన్ని, డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని, కాంక్రీటు నాణ్యతా పరిశీలన ల్యాబ్‌లను, జలవిద్యుత్ కేంద్ర నిర్మాణ పురోగతిని పరిశీలించారు. 2027లో గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పనులు వేగవంతం చేస్తున్నామని అధికారులు బృందానికి సతీష్‌బాబు, నరసింహమూర్తి వివరించారు. కేంద్ర ప్రభుత్వం పోలవరాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఎలాంటి జాప్యం లేకుండా నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సిఇఒ యోగేష్ పైతాన్కర్ సూచించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ కె శేషుబాబు, క్వాలిటీ కంట్రోల్ ఎస్‌ఇ తిరుమలరావు, ఇఇ కె బాలకృష్ణ, మేఘా జిఎం గంగాధర్, డిజిఎం మురళి పమ్మి, క్వాలిటీ కంట్రోల్ ఇఇలు నరసింహారావు, ప్రేమచంద్, డిఇలు నిర్మల, శ్రీకాంత్, విజయ్కుమార్, క్వాలిటీ కంట్రోల్ డిఇ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల వ్యాపారంలోకి భారతీ ఎంటర్ ప్రైజెస్

న్యూఢిల్లీ : ఎయిర్‌టెల్ మాతృసంస్థ భారతీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత సునీల్ మిట్టల్ కొత్తగా వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల వ్యాపారంలోకి ప్రవేశించారు. చైనాకు చెందిన హైయర్ గ్రూప్ అనుబంధ హైయర్ ఇండియాలో వాటాలను కొనుగోలు చేయడం ద్వారా ఆయన ఈ రంగంలోకి ప్రవేశించినట్లయ్యింది. హైయర్ ఇండియాలో వార్‌బర్గ్ పింకస్ కలిసి 49 శాతం వాటాను భారతీ ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. హైయర్ ఇండియా ఎసిలు, రిఫ్రిజరేటర్లు, టివిలు, వాషింగ్ మిషన్లు తదితర ఉత్పత్తులను విక్రయిస్తోంది. ఈ ఒప్పందం అనంతరం హైయర్ ఇండియాలో హైయర్ గ్రూప్‌నకు 49 శాతం వాటా ఉండనుంది. మిగిలిన 2 శాతం వాటా హైయర్ ఇండియా మేనేజ్‌మెంట్ టీమ్ వద్ద ఉంటుంది. మిగితా 49 శాతం వాటా వార్‌బర్గ్ పింకస్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ వద్ద ఉంటుంది. ఈ వాటాను ఎంత మొత్తానికి కొనుగోలు చేసిందనే విషయాన్ని ఆయా కంపెనీలు వెల్లడించలేదు.

గిరిజనులపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- వ్యకాస, రైతు, కౌలురైతు సంఘాల రాష్ట్ర నేతల డిమాండ్
- ధ్వంసం చేసిన పంటను పరిశీలన, బాధితులకు పరామర్శ

ధ్వంసం పంటను పరిశీలించి బాధితులను పరామర్శిస్తున్న రాష్ట్ర నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయగూడెం ఇనుమూరు గ్రామంలో గిరిజనులు వేసిన మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి, అడ్డొచ్చిన గిరిజనులపై దాడికి పాల్పడిన పోలీస్, రెవెన్యూ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల రాష్ట్ర నేతల బృందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇనుమూరు గ్రామంలో బాధితులను బుధవారం నేతలు కలిసి పరామర్శించారు. ధ్వంసం చేసిన మొక్కజొన్న పంటను ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ, కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు పరిశీలించారు. అనంతరం జరిగిన సభకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఐదో షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు చట్టానికి మించి భూమి ఎలా వస్తుందని ప్రశ్నించారు. గిరిజనులకు చట్టాలు, హక్కులు ఉన్నా అమలు చేయాల్సిన అధికారుల నిర్లక్ష్యం వల్లే భూ వివాదాలు వస్తున్నాయన్నారు. ఇనుమూరు గ్రామంలో కొన్ని రోజుల ముందు తహశీల్దార్, ఎస్‌ఐ సమక్షంలో భూ రికార్డులు పరిశీలించి, అర్ధాంతరంగా గిరిజనులు వేసిన పంటను ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. పంటలను ధ్వంసం చేయడం, అడ్డుపడిన గిరిజనులను కొట్టడం, మహిళల పట్ల విచక్షణారహితంగా ప్రవర్తించడం హేయమైన చర్యని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల హక్కులు, చట్టాలు, మానవ హక్కులు, మహిళా చట్టాలను ధిక్కరిస్తూ ఇష్టారాజ్యంగా ప్రవర్తించిన అధికారులకు పైనుంచి ఆదేశాలు ఎవరిచ్చారని ప్రశ్నించారు. మగ పోలీసులే గిరిజన మహిళలపై దాడి చేయొచ్చని ఏ చట్టం చెబుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ భూములకు ఆర్‌డిఒ, తహశీల్దార్‌లే తప్పుడు పద్దతిలో ప్రొటెక్షన్ ఆర్డర్‌లను ఇస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్నారన్నారు. గిరిజనులపై దాడిని ఖండిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకునేలా బాధితులకు అండగా రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులను కలుస్తామని, భూములను సాధించే వరకు పోరాటం కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తామా ముత్యాలమ్మ, పిల్లి రామకృష్ణ, సిఐటియు జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కారెం భాస్కర్, చంద్రు బుల్లెమ్మ, కారం ముత్యాలరావు, కుర్సం భీమరాజు, గుండి గంగరాజు, రైతుసంఘం జిల్లా నాయకులు, వ్యకాస జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మూడో నెలలోనూ నికర ఎఫ్‌డిఐల్లో పతనం

- బయటికి వెళ్లిన పెట్టుబడులే ఎక్కువ
- భారత్‌పై విదేశీ ఇన్వెస్టర్ల అనాసక్తి

ముంబయి : భారత ఆర్థిక వ్యవస్థపై విదేశీ పెట్టుబడిదారులు మొఖం చాటేస్తున్నారు. కొత్త పెట్టుబడులేమో కానీ. ఉన్న పెట్టుబడులను తరలించుకుపోతున్నారు. ఈ నేపథ్యంలోనే వరుసగా మూడో నెలలోనూ నికర ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) ప్రతికూలంగా నమోదయ్యాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గణాంకాల ప్రకారం.. విదేశాల నుంచి వచ్చిన పెట్టుబడుల కంటే.. భారత్ నుండి వెళ్లిన పెట్టుబడులు ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో నికర ఎఫ్‌డిఐలు మైనస్ 1.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.13,400 కోట్లు)గా నమోదయ్యాయి. పెట్టుబడుల రాక కంటే నిష్క్రమణలే ఎక్కువగా ఉండటం గమనార్హం. విదేశాల్లో భారత కంపెనీల పెట్టుబడులు పెరగడం విశేషం.

2025 అక్టోబర్‌లో మొత్తంగా భారత్‌లోకి 6.5 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలు వచ్చాయి. సెప్టెంబర్‌లో ఈ పెట్టుబడులు 6.6 బిలియన్లుగా ఉన్నాయి. 2024 అక్టోబర్‌లోని ఎఫ్‌డిఐలతో పోల్చితే గడిచిన అక్టోబర్‌లో 8.8 శాతంగా తగ్గుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది అక్టోబర్‌లో భారత కంపెనీలు విదేశాల్లో 3.1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాయి. ఇవి గతేడాదితో పోల్చితే 63.1 శాతం అదనంగా పెరిగాయి. 2025 అక్టోబర్‌లో విదేశీ కంపెనీలు 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను తీసుకెళ్లకుపోయాయి. భారత కంపెనీలు విదేశాల్లో పెట్టిన పెట్టుబడులు, విదేశీ కంపెనీలు తరలించుకుపోయిన పెట్టుబడుల మొత్తం కలిపి పోల్చితే భారత్‌లోకి వచ్చిన నికర విదేశీ పెట్టుబడులు 1.5 బిలియన్లు తక్కువగా నమోదయ్యాయి. గతేడాది అక్టోబర్‌లో ఈ మొత్తం మైనస్ 129 మిలియన్ డాలర్లుగా ఉంది.

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం విషయంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం కంటే, పెట్టిన పెట్టుబడులను ఉపసంహరించుకోవడానికే మొగ్గ చూపుతున్నారని ఆర్‌బిఐ తన బులిటెన్‌లో పేర్కొంది. భారతీయ కంపెనీలు ప్రధానంగా సింగపూర్, అమెరికా, యుఎఇ దేశాల్లో ఎక్కువగా పెట్టుబడులు పెట్టాయి. మొత్తం తరలిపోయిన పెట్టుబడుల్లో సగానికి పైగా ఈ మూడు దేశాలకే వెళ్లాయి. ఇందులో 90 శాతం పెట్టుబడులు ఫైనాన్షియల్, ఇన్సూరెన్స్, బిజినెస్ సర్వీసెస్, రిటైల్ ట్రేడ్, తయారీ రంగాల్లో ఉన్నాయి.

తీరాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఐఒటి బృందం సభ్యులు, ఎమ్మెల్యే శంకర్

ఎన్‌ఐఒటి బృందం విస్తృత పర్యటన

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

శ్రీకాకుళం రూరల్ గార మండలాల్లోని సముద్రతీర ప్రాంతాల్లో చెన్నైకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ బృందం బుధవారం పర్యటించింది. గార మండలం మొగదలపాడు గ్రామాన్ని సిఆర్‌జడ్ (కోస్టల్ రెగ్యులేటరీ జోన్) పరిధి నుంచి వేరు చేసి, రెవెన్యూ మ్యాపులో నమోదు చేసేందుకు ఎన్‌ఐఒటి బృందం సర్వే చేపట్టింది. హద్దుల నిర్ణయం కోసం రెవెన్యూ, సర్వే అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. మొగదలపాడులో దీర్ఘకాలంగా రెవెన్యూ మ్యాపులో లేకపోవడం వల్ల అభివృద్ధికి దూరమైందని బృందం సభ్యులకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ వివరించారు. వంశధార నది సముద్రంలో కలిసే చోట ఆక్రమణల వల్ల నది దిశ మారిందని, దీనివల్ల వాడపల్లి వంటి గ్రామాలు కోతకు గురవుతున్నాయని బృందం దృష్టికి తీసుకెళ్లారు. నదిని పాత ప్రవాహ దిశలోకి మళ్లించే ప్రణాళికలపై చర్చించారు. పెద్దగనగళ్ల పేటలో జెట్టీ నిర్మాణం, నాగావళి నది సముద్రంలో కలిసే చోట కోతను అరికట్టేందుకు అవసరమైన రక్షణ చర్యలపై కేంద్ర బృందం నిశితంగా పరిశీలించింది. నివేదికలను త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి అందజేసి, పనులు వేగవంతం చేస్తామని బృంద సభ్యులు హామీనిచ్చారు. బందరువాని పేట తీరంలో ప్రమాదాల నివారణకు బ్రేక్ వాల్ నిర్మాణం, కళింగపట్నం బీచ్‌లో రక్షణ గోడ ఏర్పాటుపై అధికారులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. పర్యటనలో ఆర్‌డిఒ సాయిప్రత్యూష, తహశీల్దార్ చక్రవర్తి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ఎన్‌ఐఒటి ప్రతినిధులు, అటవీశాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, ఇతర రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అమర జవాన్‌కు అంతిమ వీడ్కోలు

- మార్టేరు నుంచి ఆలమూరు వరకూ జనసంద్రం
- సంతాపంగా షాపులు బంద్

ప్రజాశక్తి - పెనుమంట్ర

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన అమర జవాన్ రాజశేఖర్ భౌతికకాయం బుధవారం స్వగ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. జవాన్ మృతికి సంతాపంగా ఆలమూరులో షాపులు మూసివేసి బంద్ పాటించారు. మార్టేరు నుంచి ఆలమూరు వరకూ వేల మంది రోడ్డుకిరువైపులా బారులు తీరి రాజశేఖర్ భౌతికకాయం ఉన్న సైనిక వాహనంపై పూల వర్షం కురిపించారు. దేశ రక్షణలో భాగంగా పశ్చిమబెంగాల్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో రఫ్టింగ్ బోట్ బోల్తా పడిన ఘటనలో జవాన్ రాజశేఖర్ అమరుడయ్యారు. అంతిమ యాత్ర ఖండవల్లి, పెనుగొండ, మార్టేరు, వెలగలేరు గ్రామాల మీదుగా సాగింది. ర్యాలీలో వేల మంది యువకులు, విద్యార్థులు బైకులపై త్రివర్ణ పతాకంతో రాజశేఖర్ అమర్ రహే నినాదాలు చేస్తూ సాగారు. ఆర్మీ అధికార లాంఛనాలతో రాజశేఖర్ దుస్తులు, జాతీయ జెండాను ఆయన తల్లిదండ్రులకు అందజేశారు. జవాన్ అంతిమయాత్రలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మండల, స్థానిక కూటమి నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, తోటి జవాన్లు, విశ్రాంత సైనిక ఉద్యోగులు, పలువురు అధికారులు, విద్యార్థులు, గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని పుష్పాంజలులతో నివాళులర్పించారు.

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

ఆర్మీ అధికారులు మాట్లాడుతూ మంచి నైపుణ్యం కలిగిన జవాన్‌ను కోల్పోయామని తెలిపారు. అనంతరం పోలీస్ లాంఛనాలతో, ఆర్మీ సంప్రదాయం ప్రకారం గాలిలో కాల్పులు జరిపి, సైనిక వందనం చేసి అంత్యక్రియలు నిర్వహించారు.

రియల్ ఎస్టేట్‌లో మందగమనం

- నివాస అమ్మకాల్లో తగ్గుదల
- ప్రాప్‌ఈక్విటీ వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలోని ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం అమ్మకాలు లేక మందగమనాన్ని ఎదుర్కొంటుంది. 2025 సంవత్సరం ముగింపులో భారతదేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో నివాస అమ్మకాలు భారీగా తగ్గాయని రియల్ ఎస్టేట్ డేటా విశ్లేషణ సంస్థ ప్రాప్‌ఈక్విటీ వెల్లడించింది. ఈ ఏడాది డిసెంబర్‌తో ముగియనున్న నాలుగో త్రైమాసికంలో ఇప్పటి వరకు మొత్తం 98,019 యూనిట్లు మాత్రమే అమ్మకాలయ్యాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 16 శాతం పతనం చోటు చేసుకుంది. 2021 మూడో త్రైమాసికం తర్వాత ఇదే కనిష్ట స్థాయి అమ్మకాలు కావడం గమనార్హం. మొత్తం నగరాల్లో నవీ ముంబయి, ఢిల్లీ ఎన్‌సిఆర్‌ల్లో కొంత సానుకూల వృద్ధి చోటు చేసుకుంది. మిగిలిన ఏడు ప్రధాన నగరాల్లో అమ్మకాలు ఏకంగా 31 శాతం మేర పతనమయ్యాయి. హైదరాబాద్‌లో నివాస అమ్మకాలు 19 శాతం క్షీణించి 11,323 యూనిట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 13,902 యూనిట్ల విక్రయాలు జరిగాయి. బెంగళూరులో విక్రయాలు 7 శాతం పడిపోయాయి. పూణెలో ఏకంగా 31 శాతం, చెన్నయ్‌లో 3 శాతం శాతం, కోల్‌కత్తాలో 16 శాతం చొప్పున తగ్గాయి. ప్రాప్‌ఈక్విటీ దేశంలోని 44 నగరాల్లోని 57వేల పైగా డెవలపర్ల నుంచి 1,70,000 ప్రాజెక్టులను విశ్లేషిస్తోంది.

రెండు కొత్త విమానయాన కంపెనీలకు అనుమతి

న్యూఢిల్లీ : దేశంలో మరో రెండు కొత్త విమానయాన సంస్థల కార్యకలాపాలకు పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చింది. అల్ హింద్ ఎయిర్, ఫ్లై ఎక్స్‌ప్రెస్ సంస్థలకు మంత్రిత్వ శాఖ నుంచి ఎన్‌ఒసి లభించింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మరో సంస్థ శంఖ్ ఎయిర్ ఇప్పటికే ఎన్‌ఒసి పొందింది. ఆ సంస్థ 2026లో కార్యకలాపాలను ప్రారంభించనుంది. భారత విమానయాన రంగంలో ప్రస్తుతం ఇండిగో, ఎయిరిండియాకు 90 శాతానికి పైగా వాటా ఉండటంతో ఏకచత్రాదిపత్యంతో అవి నిర్ణయించిన ధరలకే ప్రయాణించాల్సి వస్తోందనే విమర్శలున్నాయి.

ఎస్‌హెచ్‌జిలకు ఇండియన్ బ్యాంక్ ఆర్థిక మద్దతు



ప్రజాశక్తి - విజయవాడ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ విజయవాడ జోన్ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జి)కు ఆర్థిక సహాయం అందించింది. విజయవాడలో ఏర్పాటు చేసిన 'ఎస్‌హెచ్‌జి అవుట్ రీచ్ క్యాంపెయిన్"కు ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ వి చంద్రశేఖరన్, హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రణేష్ కుమార్, విజయవాడ జోనల్ జనరల్ మేనేజర్ ఎం రాజేష్, ఉన్నతాధికారులు గౌరి శంకర్, ఎఎన్ వి నాంచార రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు ఎస్‌హెచ్‌జిలకు చెక్కులను అందజేశారు. విజయవాడ జోనల్ మేనేజర్ ఎం. రాజేష్ మాట్లాడుతూ.. జోనల్‌లోని స్వయం సహాయక బృందాలకు ఆర్థిక సహాయం అందించడంలో ప్రత్యేకత కలిగిన 4 మైక్రోశాట్ బ్రాంచ్‌లు ఉన్నాయని తెలిపారు. ఇండియన్ బ్యాంక్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలలో సుమారు 5000 ఎస్‌హెచ్‌జిలకు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. తమ 43 శాఖలు వారి ఆర్థిక అవసరాలను తీర్చడానికి నిరంతరం పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఇండియన్ బ్యాంక్ రూ.1150 కోట్ల రుణాలను ఎస్‌హెచ్‌జిలకు మంజూరు చేసిందని తెలిపారు. మహిళా సాధికారత, వారి స్వయం సమృద్ధి కోసం ఇండియన్ బ్యాంక్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. చాలా మంది తమ చిన్న వ్యాపార అవసరాల కోసం అధిక వడ్డీ రేట్లకు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లి తమ జీవితాలను కష్టతరం చేసుకుంటున్నారని ఆయన అన్నారు. ఇండియన్ బ్యాంక్‌లో తక్కువ వడ్డీ రేటుకే రుణాలు పొందవచ్చని, ఇతర ఛార్జీల నుండి కూడా మినహాయింపు పొందవచ్చని ఆయన సూచించారు.

సంపాదకీయం

కార్పొరేట్ స్వామ్యం

మన దేశ ఎన్నికల వ్యవస్థలో రాజకీయ అధికారానికి డబ్బుకు మధ్య ఉన్న అనుబంధం కొత్త కాదు కానీ నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ హయాంలో ఈ బంధం కొత్త పుంతలు తొక్కింది. ఇది ఎంత వికృతంగా మారిందో, ఎంతగా వ్యవస్థాకృతమైందో ఇప్పుడు స్పష్టంగా బయటపడుతోంది. 2024 ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గోప్యతగా సాగిన రాజకీయ నిధుల (ఎలక్టోరల్ బాండ్స్) తీరును బట్టబయలు చేసింది. సొంత ప్రయోజనాల కోసం అధికారంలో ఉన్న పార్టీతో కుమ్మక్కు కావడం, లేదా వ్యవస్థలను ఎక్కడ ఉసిగొల్పుతుందోనన్న భయమో ఆ నిధుల వెల్లువకు కారణమని స్పష్టమైంది. అయితే ఆ తీర్పు తర్వాత పరిణామాలు చూస్తే నిధుల ప్రవాహం ఏమాత్రం తగ్గలేదని,

మార్గం మాత్రమే మారిందని అర్థమవుతోంది. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం 2024-25లో రాజకీయ పార్టీలకు వచ్చిన మొత్తం విరాళాల్లో 85 శాతం ఒక్క బిజెపికే దక్కాయి. గత ఏడాది ఇది 56 శాతమే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బిజెపికి ఆరువేల కోట్ల రూపాయలకు పైగా నిధులు లభించాయి. ఇది ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నిధులతో పోల్చుకుంటే దాదాపు 12 రెట్లు ఎక్కువ! మరికొన్ని పార్టీలకూ కొంత మొత్తం నిధులు సమకూరినా అవి అడుగు, బొడుగే! కార్పొరేట్ల నుండి ఏ రూపంలోనూ నిధులు స్వీకరించేది లేదని సిపిఎం ఇప్పటికే ప్రకటించి అమలు చేస్తున్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే, కార్పొరేట్ రంగమంతా తన పెట్టుబడులను అధికారపార్టీ వైపునకు మళ్ళించడమే ఇక్కడ ముఖ్యమైన అంశం. అలా ఎందుకు జరిగిందన్నదే కీలక ప్రశ్న!

2018 నుంచి 2024 వరకు కొనసాగిన ఎన్నికల బాండ్ల వ్యవస్థలోనూ బిజెపినే ప్రధాన లబ్ధిదారు. ఈ పథకం, కార్పొరేట్లకు పూర్తి గోప్యత కల్పించింది. భయం లేకుండా విరాళాలు ఇవ్వడం, తమకు కావాల్సిన పని చేయించుకోవడం ఇదే ఆ వ్యవస్థ యొక్క అసలు రూపం. సుప్రీం తీర్పుతో ఈ విధానం రద్దు అయినట్టు కనపడినప్పటికీ పరోక్షంగా అదే కొనసాగుతోంది. తేడా ఏమిటంటే, బాండ్లకు బదులుగా ఎన్నికల ట్రస్టుల ద్వారా విరాళాలు వెళ్తున్నాయి. పార్టీకి, విరాళమిచ్చే సంస్థకు మధ్య ఉన్న సంబంధాన్ని కొత్త మార్గం కూడా పూర్తిగా మూసివేయడం లేదు. ధన ప్రవాహాన్నీ, దాని గోప్యతను ఏమాత్రం మార్చలేదు. దీని అర్థం సుప్రీంకోర్టు ఒక తలుపు మూస్తే, కార్పొరేట్ రాజకీయాలు మరో తలుపును తెరుచుకున్నాయనే! ప్రూడెంట్, ప్రోగ్రెసివ్, ఎబి జనరల్ వంటి ఎన్నికల ట్రస్టుల వెనుక దేశంలోని అతి పెద్ద కార్పొరేట్ సంస్థలు ఉండటం ఈ వాస్తవాన్నే ఎత్తి చూపుతున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు నెలల్లోనే బిజెపికి విరాళాలు విపరీతంగా పెరగడమే దీనికి నిదర్శనం.

ఇక్కడ అసలు ప్రమాదం ప్రజాస్వామ్యానికి కలిగే నష్టం. ఒకే పార్టీ వద్ద అపారమైన ఆర్థిక వనరులు కేంద్రీకృతమైతే ఎన్నికలలో పోటీ సమానస్థాయిలో ఉండదు. ఏకపక్ష ప్రచారం సాగుతుంది. మీడియా కథనాలు సైతం వక్రీకరణకు గురవుతాయి. కాబట్టి ప్రజలు వాస్తవాలను తెలుసుకోలేరు. ఈ వికృత ధోరణిని మీడియాలో ఇప్పటికే చూస్తున్నాం. ఓటర్లను ప్రలోభపెట్టడం విపరీతంగా సాగుతుంది. ప్రభుత్వాల విధాన నిర్ణయాలు విరాళాలు ఇచ్చిన అస్మదీయుల ప్రయోజనాలకే ఉపయోగపడతాయి. చివరకు పరిపాలన తీరు ఆర్థిక లావాదేవీగా మారుతుంది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానపు అవలక్షణం 'నీకింత...నాకింత' సర్వసాధారణమౌతుంది. ప్రభుత్వం ప్రజలకు చేయాల్సిన సేవలు కూడా సరుకులుగా మారి సామాన్యులను వెక్కిరిస్తాయి. ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగపరమైన దిద్దుబాటు చర్య. కానీ, కార్పొరేట్ రాజకీయాలతో కలుషితమైన వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి అది మాత్రమే చాలదన్న విషయాన్ని తాజా పరిణామాలు తేల్చి చెబుతున్నాయి. ఇప్పటికైనా ఎన్నికల నిధుల విధానంపై పునరాలోచన చేయాలి. పూర్తి స్థాయి పారదర్శకతను తీసుకురావాలి. రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు విరాళాలివ్వడానికి బదులుగా, పార్టీల ఎన్నికల ఖర్చును అంతకు ముందరి ఎన్నికల్లో వారి ప్రజాబలాన్ని బట్టి ప్రభుత్వమే సమకూర్చడం, దామాషా ఎన్నికలు వంటి సంస్కరణలు రావాలి. ప్రజానుకూల ఎన్నికల సంస్కరణల కోసం పాలకులపై పౌరసమాజం ఒత్తిడి తీసుకురావాలి. లేనిపక్షంలో ప్రజాస్వామ్యం కార్పొరేట్ స్వామ్యంగా మారిపోతుంది.

సందర్భం

"**చాతుర్వర్ణ వ్యవస్థను విశ్వసించను. కుల వ్యత్యాసాలను అంగీకరించను. హిందూ సమాజానికి శాపంగా వున్న అంటరానితనాన్ని అంతం చేసేందుకు కృషి చేస్తాను. హిందువుల్లో ఆహారం, పానీయం విషయాల్లో ఎలాంటి నిషేధాలను పాటించను. ఆలయాలు, నీటి వనరులు, పాఠశాలలు వగైరా సదుపాయాల విషయంలో అస్పృశ్యులు అనబడే వారితో సహా అందరికీ సమాన హక్కులు వుంటాయని నమ్ముతున్నాను.**"

(1927 డిసెంబర్ 25న మహారాష్ట్ర లోని మహద్ గ్రామంలో వేలాదిమంది వలంటీర్ల సమక్షంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనుస్మృతి గ్రంథం ప్రతులను దహనం చేశారు. ఆ సందర్భంగా వారంతా చేసిన ప్రతిజ్ఞ)

విశ్లేషణ

ఇది వలస జీవుల గాథ

వలసల పెరుగుదల ప్రశ్నించడానికి వీలు లేని జన్మత: పౌరసత్వం అన్న భావనకే సవాలు విసురుతోంది. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం అమెరికాలో పుట్టిన ప్రతి ఒక్కరికీ పౌరసత్వం ఉంటుందనే దీర్ఘకాలిక విధానాన్ని ట్రంప్ పాలనా యంత్రాంగం సవరించాలని ప్రయత్నిస్తోంది. బిడ్డలను కనడం కోసం ఇటీవలి వరకు సుమారు 30 వేల మంది ప్రతి సంవత్సరం అమెరికాకు ప్రయాణించేవారు. దీనిని వ్యాపారంగా మార్చుకున్న టూర్ కంపెనీలూ ఉండేవి. 2015లో అమెరికాలో ప్రసవం కోసం వీసాలు పొందడం చట్టబద్ధమైంది. కానీ 2020లో ట్రంప్ అధికారం చేపట్టాక స్థానిక అస్థిత్వ రాజకీయాల్లో భాగంగా దీనిని ఉపసంహరించారు. భారత్‌లో కూడా పౌరసత్వ చట్టంలో మార్పు ద్వారా, అక్రమ వలసదారుడికి పుట్టిన పిల్లలకు జన్మత: పౌరసత్వాన్ని నిరాకరించారు.

పౌరసత్వం అనేది సాధారణంగా ఒక వ్యక్తి నిర్దిష్ట భూభాగంలో నివసించడంతో అనుసంధానించబడింది. పౌరుడు సాధారణంగా ఒక నిర్దిష్ట ప్రాంతంలో నివసిస్తూ ఉంటాడని భావిస్తారు. కానీ అంతర్జాతీయంగా గానీ, దేశం లోపల గానీ సరిహద్దులు దాటి ప్రజలు వలస వెళ్లడం వల్ల పౌరసత్వం-భూభాగం మధ్య ఉన్న ఈ అనుసంధానం సడలిపోతోంది. దీనితో పౌరసత్వం పట్ల ఉన్న మౌలిక అవగాహనలో గందరగోళం ఏర్పడుతోంది. ప్రభుత్వాలు గానీ, రాజకీయ పార్టీలు గానీ దీనిని పూర్తిగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేవు. ఫలితంగా, ప్రపంచవ్యాప్తంగా ఇటీవల వలసదారులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు, భారీగా నిర్బంధ బహిష్కరణలకు పూనుకోవడం, ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయడం వంటి ప్రక్రియలు ఊపందుకున్నాయి.

భారతదేశంలో, ఎన్నికల కమిషన్ (ఇసిఐ) ఓటర్ల జాబితాలపై ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపడుతోంది. ఈ ప్రక్రియను సవాల్ చెయ్యడంతో ఇసిఐ సుప్రీంకోర్టుకు ఇలా తెలిపింది: "వేగవంతమైన పట్టణీకరణ, విద్య, జీవనోపాధి తదితర అవసరాల కోసం ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరచూ వలస వెళ్లడం ఇప్పుడు అత్యంత సాధారణంగా మారింది. కొందరు ఓటర్లు ఒక చోట నమోదు చేసుకుని, తరువాత తమ పేర్లు అక్కడి ఓటర్ల జాబితా నుంచి తొలగించుకోకుండా మరోచోటకు మారి మళ్లీ అక్కడ నమోదు చేసుకుంటున్నారు. దీనివల్ల ఓటర్ల జాబితాలో పేర్లు పునరావృతం అయ్యే అవకాశాలు పెరిగాయి. అందువల్ల బీహార్‌తో ప్రారంభించిన ఎస్ఐఆర్ ను పాన్-ఇండియా స్థాయిలో నిర్వహించాల్సిన అవసరం ఉందని ఇసిఐ నిర్ణయించింది."



వర్గీస్ కె.జార్జ్

అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలనలో, ఫెడరల్ ఎన్నికల చట్టాలను అమలు చేయడానికి పూర్తి ఓటరు జాబితాలు అవసరమని వాదిస్తూ న్యాయ శాఖ దేశంలోని 50 రాష్ట్రాల నుంచి ఓటరు నమోదు డేటాబేస్‌లను ఇవ్వాలని కోరింది. ఈ ఆదేశాలను అనేక రాష్ట్రాలు ప్రతిఘటించాయి. ఇదే సమయంలో, అమెరికా పౌరసత్వానికి సంబంధించిన పాస్‌పోర్ట్ లేదా జనన సర్టిఫికెట్ వంటి పత్రాల ఆధారాలు తప్పనిసరి చేసేలా ఫెడరల్ ఎన్నికల విధానాలను మార్చాలని ట్రంప్ ఒక విస్తృత కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. దీని మూలంగా ఎన్నికల సమగ్రత, విశ్వసనీయత బలపడుతుందని అనుకూలురు వాదిస్తుండగా, విమర్శకులు మాత్రం రాష్ట్రాల స్వయంప్రతిపత్తి దెబ్బ తింటుందని, ఓటర్ల హక్కులు పరిమితం అవుతాయని హెచ్చరిస్తున్నారు. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తున్న విదేశీయులు (పౌరులు కానివారు) సుమారు 2.2-2.4 కోట్ల మంది ఉన్నారు. అక్రమ వలసదారుల సంఖ్య అంచనాల ప్రకారం మిలియన్లలో ఉంది. భారత్, అమెరికా రెండింటిలోనూ 'విదేశీ ఓటర్లు' రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారనే భావన బలంగా ప్రచారంలో పెట్టారు.

పెరుగుతున్న వలసలు

ప్రపంచ జనాభాలో అంతర్జాతీయ వలసదారుల శాతం దశాబ్దాలుగా పెద్దగా మారకపోయినా, వారి సంఖ్య మాత్రం వేగంగా పెరిగింది. 1960 నుంచి వలసదారుల శాతం సుమారు ఒక శాతం పాయింట్ మాత్రమే పెరిగిందని అంచనాలు చెబుతున్నాయి. కానీ స్వదేశం వెలుపల నివసించే వారి సంఖ్య 1990లో సుమారు 15.4 కోట్ల నుంచి 2024 మధ్య నాటికి 30 కోట్లకు పైగా పెరిగింది. అంటే కేవలం మూడు దశాబ్దాల్లో దాదాపు రెండింతలు, మొత్తం ప్రపంచ జనాభా వృద్ధి కంటే వేగంగా పెరిగింది.

పాశ్చాత్య దేశాల్లో స్థిరపడిన విదేశీయుల సంతానం వాటా పెరగడంతో స్థానికతవాదం పెరుగుతోంది. అమెరికా జనాభాలో విదేశాల్లో పుట్టినవారు సుమారు 14-15 శాతం ఉండగా, 2010లో ఇది సుమారు 13 శాతం మాత్రమే. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఈ మార్పు మరింత గణనీయంగా ఉంది. 2001లో సుమారు 8 శాతంగా ఉన్న విదేశాల్లో జన్మించిన వారి వాటా... 2021 నాటికి దాదాపు 16 శాతానికి పెరిగింది. పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటైన కెనడాలో ఈ శాతం సుమారు 22 శాతంగా ఉంది. ఆస్ట్రేలియాలో అయితే దాదాపు 31-32 శాతం జనాభా విదేశాల్లో పుట్టినవారే. 2025 నాటికి అభివృద్ధి చెందిన దేశాల్లో ఓటర్లకు ఎదురయ్యే ముఖ్యమైన మూడు అంశాల్లో వలస ఒకటిగా ఉంటుంది, అయితే దాని తీవ్రత కొంత తగ్గింది.

ప్రభుత్వాలు ప్రజల వలసలను నియంత్రించాలని భావిస్తున్నాయి. భారత్ 'మానవ వనరులను ఎగుమతి చేయాలని' (అంటే ఉద్యోగాల కోసం మరింత మందిని విదేశాలకు పంపాలని) ఆశిస్తోంది. యువ కార్మికుల సేవలు అవసరమైన ధనిక దేశాలు, వారు అక్కడే ఉండి పౌరసత్వం పొందకుండానే, కొన్నేళ్ల తర్వాత తిరిగి వెళ్లిపోవాలని కోరుకుంటున్నాయి. తిరిగి వచ్చే వలసదారులు కొత్త సామాజిక, రాజకీయ దృక్పథాలను తీసుకు వస్తారు. ఆతిథ్య దేశాల్లో వారు రాజకీయ హక్కులు లేని కార్మిక వర్గంగా, అమెరికా లోని హెచ్-1బి వీసా కార్మికుల మాదిరిగా, మారతారు. అయితే వారికి సమీప భవిష్యత్తులో పౌరసత్వం పొందే మార్గం ఉంటుంది. గల్ఫ్ సహకార మండలి (జిసిసి) దేశాలు, సింగపూర్‌లు కూడా రాజకీయ అస్థిత్వం లేని కార్మిక వర్గాన్ని సృష్టించాయి. అభివృద్ధి చెందిన దేశాలు కూడా తాత్కాలిక కార్మికుల విషయంలో ఇదే దిశగా ఆలోచిస్తున్నాయి.

సుమారు 3.54 కోట్ల మంది ఓవర్సీస్ ఇండియన్లు ఉన్నారు. వారిలో 1.58 కోట్ల మంది భారత పౌరులు, 1.96 కోట్ల మంది భారతీయ మూలాలు ఉన్న వారు. 2010లో చేసిన ప్రజా ప్రతినిధ్య (సవరణ) చట్టం ప్రకారం, విదేశాల్లో నివసిస్తున్న భారత పౌరులు తమ పాస్‌పోర్ట్‌లో పేర్కొన్న భారత నివాస చిరునామా దగ్గర ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. అయితే, వారు విదేశాల నుంచే ఓటు వేయడానికి అనుమతించాలంటూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ విచారణలో ఉంది. 2010 సవరణ ఒకవైపు ఓటు హక్కు ఇచ్చి, మరోవైపు దాన్ని వినియోగించడానికి భారతదేశంలో భౌతికంగా హాజరు కావాలని షరతు విధించడం ద్వారా ఎన్నారైలను అన్యాయానికి గురి చేస్తోందని పిటిషనర్ వాదిస్తున్నారు.

వలసలు, విధానాలు

భారత ప్రభుత్వ విధానాలు గ్రామాల నుంచి పట్టణాలకు, అలాగే కాశ్మీర్ వంటి నిర్దిష్ట ప్రాంతాలకు వలసలను ప్రోత్సహించాయి. 2020లో జమ్ము-కాశ్మీర్‌లో డొమిసైల్ నిబంధనలను సడలించి, 10 సంవత్సరాలు పోస్టింగ్ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, 15 సంవత్సరాలు నివసించిన వారు, ఏడేళ్లు చదివిన విద్యార్థులు వంటి స్థానికేతరులకు డొమిసైల్ హోదా కల్పించారు. తద్వారా వారికి ఉద్యోగాలు పొందే హక్కు, ఆస్తులు కొనుగోలు చేసుకునే హక్కులు లభించాయి. ఇది స్థానిక జనాభా పొందికను మార్చే ప్రయత్నమని విమర్శకులు వాదిస్తుండగా, ప్రభుత్వం అభివృద్ధి, సమగ్రత కోసమేనని చెబుతోంది.

దేశ సరిహద్దుల లోపల కూడా అంతర్గత సరిహద్దులు ఉన్నాయి. వాటిని దాటి వలసలు రాజకీయ, పాలనాపరమైన ప్రభావాలను చూపుతాయి. డొమిసైల్ చట్టాలు అనేక విద్యా, ఉద్యోగ అవకాశాలను ఆ రాష్ట్రం లేదా ప్రాంతానికి చెందిన వారికే పరిమితం చేస్తాయి. దేశంలో సాగుతున్న అంతర్గత వలసల కీలక ప్రభావం ఓటు హక్కుపై ఉంటుంది. ఓటు హక్కు సాధారణంగా ఒక పౌరుడు నివసించే పోలింగ్ బూత్‌కు అనుసంధానించబడింది. ఎస్ఐఆర్ అనేది ఎవరు ఓటు వేయగలరు అనే నిర్ణయం మాత్రమే కాదు. మరింత ముఖ్యంగా, ఎక్కడ ఓటు వేయగలరనే ప్రశ్నకు కూడా సమాధానం. వలసలను స్వీకరించే మహారాష్ట్ర, కేరళ వంటి రాష్ట్రాల్లో ఒక వ్యక్తి ఓటు వేయడం, వలసలను పంపించే బీహార్ వంటి రాష్ట్రంలో ఓటు వేయడంలా కాకుండా జాతీయ రాజకీయాలపై భిన్న ప్రభావాలను చూపుతుంది.

జనాభా కూర్పులో మార్పులు రాజకీయాలను ప్రభావితం చేస్తాయి. ముంబైలో ఇప్పుడు మరాఠీ మాట్లాడేవారు 40 శాతం కన్నా తక్కువగా ఉండగా, హిందీ మాట్లాడేవారు సుమారు 30 శాతం ఉన్నారు. శివసేన స్థానిక అస్థిత్వ రాజకీయాలు బలహీనపడ్డాయి. ఇప్పుడు రాజకీయ పార్టీలు తరచుగా హిందీ మాట్లాడే అభ్యర్థులను ఎన్నికల్లో నిలబెడుతున్నాయి. 2001లో భారత జనాభాలో 31 శాతం మంది వలసదారులు కాగా, 2011 నాటికి ఇది 38 శాతానికి పెరిగింది. వీరిలో మూడింట రెండు వంతులు మహిళలే. వీరి విషయంలో వివాహం ప్రధాన కారణంగా ఉన్నది. మిగిలిన మూడవ వంతు పురుషులు ప్రధానంగా ఆర్థిక కారణాల వల్ల దూరప్రాంతాలకు వలస వెళ్తారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత జరగనున్న 2027 జనగణన ఈ విస్తృత కదలికల పరిమాణాన్ని పట్టుకోనుంది.

వలస వెళ్లే ప్రజలు తమ దృక్పథాలు, విలువలు, కథలు, విశ్వాసాలను కూడా తీసుకువెళ్తారు. వైట్‌హౌస్ ఇప్పుడు దీపావళిని జరుపుకుంటోంది. ఇది 2003లో ప్రారంభమైన ఆచారం. వలసల ద్వారానే వేద సంప్రదాయాలు ఆర్యావర్త ప్రాంతం నుంచి తూర్పు, ద్వీపకల్ప ప్రాంతాలకు విస్తరించి, అక్కడ అప్పటికే వున్న కథలతో కలసి, తరువాత హిందూయిజం అని పిలవబడిన సాంస్కృతిక విశ్వాన్ని విస్తరించాయి. భాషలు కూడా వలసలతో పాటు కదులుతాయి. చరిత్రలో సాధారణంగా మహిళల కంటే పురుషులే ఎక్కువగా వలస వెళ్లారు. వలస వచ్చిన పురుషులు స్థానిక మహిళలను వివాహం చేసుకున్నారు. నేడు మనం మాట్లాడే భాషల్లో ఈ చరిత్ర ప్రతిబింబిస్తుంది అని పెగ్గీ మోహన్ తన ఫాదర్ టంగ్, మదర్‌ల్యాండ్‌లో వాదిస్తారు.

జన్మత: పౌరసత్వం

వలసల పెరుగుదల ప్రశ్నించడానికి వీలు లేని జన్మత: పౌరసత్వం అన్న భావనకే సవాలు విసురుతోంది. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం అమెరికాలో పుట్టిన ప్రతి ఒక్కరికీ పౌరసత్వం ఉంటుందనే దీర్ఘకాలిక విధానాన్ని ట్రంప్ పాలనా యంత్రాంగం సవరించాలని ప్రయత్నిస్తోంది. బిడ్డలను కనడం కోసం ఇటీవలి వరకు సుమారు 30 వేల మంది ప్రతి సంవత్సరం అమెరికాకు ప్రయాణించేవారు. దీనిని వ్యాపారంగా మార్చుకున్న టూర్ కంపెనీలూ ఉండేవి. 2015లో అమెరికాలో ప్రసవం కోసం వీసాలు పొందడం చట్టబద్ధమైంది. కానీ 2020లో ట్రంప్ అధికారం చేపట్టాక స్థానిక అస్థిత్వ రాజకీయాల్లో భాగంగా దీనిని ఉపసంహరించారు. భారత్‌లో కూడా పౌరసత్వ చట్టంలో మార్పు ద్వారా, అక్రమ వలసదారుడికి పుట్టిన పిల్లలకు జన్మత: పౌరసత్వాన్ని నిరాకరించారు. ప్రజలు కదలడం మానవ చరిత్రను కదిలిస్తుంది. ప్రజల కదలిక భారత రాజకీయాలను మళ్లీ రూపుదిద్దుతోంది. ఈ మార్పులు జనగణన, ఎస్ఐఆర్, ఆపై నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ద్వారా స్పష్టంగా కనిపించనున్నాయి. దాదాపు అర్ధ శతాబ్దం తర్వాత మొదటిసారి రాష్ట్రాల మధ్య లోక్‌సభ ప్రాతినిధ్యాన్ని పునర్వ్యవస్థీకరించనున్నది.

('హిందూ' సౌజన్యంతో)

అభిప్రాయం

ఈ దేశం చట్టాలతో నడవాలి

భయంతో కాదు, ద్వేషంతో కాదు, మూకలతో అయితే అసలు కాదు. ఒక పథకానికి మహాత్మా గాంధీ పేరు తీసేశారు. నాథూరామ్ గాడ్సే పేరు పెట్టారని వార్తలు వస్తున్నాయి. నిజం తెలియదు. కానీ ఇంకో రామ్ నారాయణ్‌ను ఏంచేశారు!

నేను ఇండియన్‌ను. నా పేరు ఇది...అని మొత్తుకుంటున్నా సరే! ఆ ఇద్దరు పిల్లల తండ్రి, వలస వచ్చిన కార్మికుడ్ని బంగ్లాదేశీ అని అనుమానంతో కొట్టి కేరళలో కొందరు చంపేశారు. నేరస్తులందర్నీ శిక్షించేంతవరకు ఆ మృత దేహాన్ని తీసుకోవటానికి కూడా భార్య నిరాకరించింది. కేరళలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ద్విపాత్రాభినయం చేస్తున్న శశి థరూర్ అనే విలాస పురుషుడు ఎంపీగా ఉన్న తిరువనంతపురం నియోజక వర్గానికి సంబంధించిన మేయర్ ఎన్నికల్లో మొన్న భారతీయ జనతా పార్టీ నెగ్గిన విషయం మీకు గుర్తుంది కదా.

ఇటీవలి కాలంలో మన సమాజంలో ఒక ప్రమాదకరమైన ధోరణి బలపడుతోంది. అది అనుమానాన్ని దేశభక్తిగా మార్చే ధోరణి. ఒక వ్యక్తి ఎవరో తెలుసుకోకుండానే, ఒక మాట విన్నంత మాత్రాన, ఒక ప్రచారం నమ్మినంత మాత్రాన చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ధర్మం కాదు. సంస్కృతి కాదు. ఇది అరాచకం.

ఆర్య సనాతన మనువాదం పేరుతో జరిగే కొన్ని ప్రచారాలు ప్రజల మనసుల్లో భయాన్ని నాటుతున్నాయి. ఆ భయం అనుమానంగా మారుతుంది. అనుమానం ద్వేషంగా మారుతుంది. ద్వేషం చివరికి హింసగా మారుతుంది. అక్కడే సమాజం చట్టాన్ని కోల్పోతుంది.

సత్యం ఏంటంటే... అక్రమ చొరబాటుదారుల సమస్య ఉంటే? బంగ్లాదేశీ లేదా రోహింగ్యాల అంశం ఉంటే? అది కేంద్ర ప్రభుత్వ బాధ్యత. సరిహద్దులు కాపాడాల్సింది ఎవరు? చట్టబద్ధంగా గుర్తింపు నిర్ధారించాల్సింది ఎవరు? డిపోర్టేషన్ చేయాల్సింది ఎవరు? ప్రభుత్వం. చట్టం. న్యాయ వ్యవస్థ.

మూకలు కాదు, వాట్సాప్ యూనివర్సిటీ కాదు, వీధుల్లో తిరిగే స్వయం నియమిత రక్షకులు కాదు. అక్రమ చొరబాటుదారులను పంపించాలి చట్ట ప్రకారం. దానికి మేమందరం మద్దతిస్తాం. తక్షణమే వాళ్ళని మన దేశం నుంచి గుర్తించి వెంటనే పంపించి వేయాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నాం. కానీ, ఆ అంశాన్ని రాజకీయ లాభం కోసం వాడకూడదు. ఓట్లు, పదవులు, పోస్టుల కోసం భయాన్ని రెచ్చగొట్టకూడదు. అమాయకుల ప్రాణాలను మూల్యంగా మార్చకూడదు.

'ఒక దేశంలో అనుమానం ఉంటే చంపేయొచ్చు' అనే పరిస్థితి వస్తే! అది శక్తివంతమైన దేశం కాదు. అది విఫలమైన సమాజం.

దేశాన్ని కాపాడేది ద్వేషం కాదు. చట్టం. భయం కాదు. న్యాయం. మూకలు కాదు. రాజ్యాంగం.

ఇది గుర్తుంచుకోకపోతే, ఈ రోజు ఇంకొకరు. రేపు మనలో ఎవరో ఒకరు. ఆ వ్యక్తి దళితుడు కూడా కావొచ్చు!

- చలసాని శ్రీనివాసరావు,
ప్రత్యేక హోదా సాధన కమిటీ అధ్యక్షులు.

❖

వ్యాఖ్య

జర్నలిజంపై మోడీ చావు దెబ్బ

ఇప్పటికే కుంచించుకుపోయిన స్వేచ్ఛాయుత జర్నలిజంపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లతో చావుదెబ్బ కొట్టింది. లేబర్‌కోడ్‌లు అమల్లోకి రావడంతో జర్నలిస్టుల, నాన్-జర్నలిస్టుల వేతన బోర్డు వ్యవస్థ రద్దయింది. వేతన సవరణలో ఇప్పటి దాకా ఏదో ఒక మేరకు పత్రికా సిబ్బందికి జాతీయ స్థాయిలో ఉమ్మడిగా బేరసారాలు ఆడే అవకాశం ఉండేది. వేతన బోర్డుల ముందు జర్నలిస్టులు, నాన్-జర్నలిస్టులు పెరిగిన ధరలను అనుసరించి తమ వేతనాలపై ప్రతిపాదనలు ఉంచేవారు. చాలా చర్చలు జరిగాక పత్రికల ఆదాయం, సర్కులేషన్ వగైరాలను బట్టి ఆ యా గ్రూపుల్లోని వివిధ కేటగిరీల వేతనాలపై సిఫారసులు ప్రకటించేది. ఆ సిఫారసులను అమలు చేయడంలో యాజమాన్యాలు జాప్యం చేసినా, టలాయించినా కార్మిక శాఖపై యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చి అమలు చేయించుకొనేవారు. జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టుల కోర్టులు వేజి బోర్డు సిఫార్సులకు అనుకూలంగా తీర్పులు చెప్పేవి. రాష్ట్ర స్థాయిలో వేజి బోర్డు సిఫారసులను అమలు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీలు ఉండేవి. కార్మికశాఖ జాయింట్ కమిషనర్ అధ్యక్షుడిగా యూనియన్ల యాజమాన్యాల ప్రతినిధులు అందులో సభ్యులుగా ఉండేవారు. బోర్డు సిఫారసులను అమలు చేయకుండా యాజమాన్యాలు ఎన్ని ఎత్తులకు, జిత్తులకు పాల్పడినా, చివరికి వాటిని అమలు చేయాల్సి వచ్చేది.



ఎస్. వినయకుమార్

మోడీ ప్రభుత్వం ఆ భద్రతను తొలగించింది. జర్నలిస్టులను, నాన్ జర్నలిస్టులను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు అప్పగించింది. దానితోపాటు యాజమాన్యాలు జర్నలిస్టులను, ఇతర సిబ్బందిని తమ ఇష్టం వచ్చినట్లు తొలగించడానికి వీలు లేకుండా వర్కింగ్ జర్నలిస్టు చట్టం, కార్మిక చట్టాలు అడ్డుపడేవి. అలా తొలగించబడిన జర్నలిస్టులను నాన్ జర్నలిస్టుల రక్షణకు జర్నలిస్టు సంఘాలు, ప్లాంట్ స్థాయి యూనియన్లు రంగంలోకి దిగేవి. అలా తొలగించిన వారిని యాజమాన్యాలు తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడమో లేదంటే చట్ట ప్రకారం తాము ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వడమో చేసేవి.

లేబర్‌కోడ్‌లతో మోడీ ప్రభుత్వం ఇప్పుడు అలాంటి అవకాశాలు లేకుండా చేసింది. తన అప్రజాస్వామిక నిర్ణయాలను, చర్యలను బలపరిచే మీడియా యాజమాన్యాలకు మేలు చేసింది. జర్నలిస్టులను నాన్ జర్నలిస్టులను బలిపశువులుగా అప్పగించింది.

వేతన బోర్డుల సిఫారసులను వమ్ము చేయడానికి పత్రికల యాజమాన్యాలు అనేక ఎత్తులు వేసేవి. "ఫేక్" కంపెనీలను సృష్టించి తమ సిబ్బందిని ఆ కంపెనీలకు బదిలీ చేసేవి. తమకు వార్తలు ఇవ్వడానికి విలేకరులు లేరని తమకు వేరే ఒక వార్తా సంస్థ వార్తలు ఇస్తోందని బుకాయించే ప్రపంచానికి సుద్దులు చేసే యాజమాన్యాలు తమ సిబ్బంది దగ్గరికి వచ్చేసరికి నిస్సంశయంగా బొంకులాడేవి. కొన్ని పత్రికలు అడ్వర్టైజ్‌మెంట్, సర్కులేషన్ వగైరా అన్ని విభాగాలకు ఫేక్ కంపెనీలను సృష్టించాయి. పైస్థాయి ఉద్యోగులను ఫేక్ కంపెనీలకు చైర్మన్లుగా, మేనేజింగ్ డైరెక్టర్లుగా చూపెట్టేవి. నిర్ణయాలు మాత్రం యాజమాన్యాలే చేస్తాయి. ఆ బినామీలకు కనీసం సమాచారం ఇచ్చేవి కావు. జర్నలిస్టు యూనియన్ల పోరాటం వల్ల తదపరి వేతన సంఘాలు ఈ అక్రమ పద్ధతులపై నియంత్రణలు విధించాయి. చట్టాలను ఉల్లంఘించడానికి పత్రికల యాజమాన్యాలు ఫేక్ కంపెనీలను సృష్టిస్తున్నాయి కనుక ఆయా పత్రికలకు వర్తించే గ్రూపులోని వేతనాలే ఆ ఫేక్ కంపెనీలకు వర్తిస్తాయని స్పష్టం చేశాయి.

కార్మిక కోడ్‌లు అమల్లోకి వచ్చాక యాజమాన్యాలకు ఏ దాపరికం అవసరం లేదు. జర్నలిస్టులను, నాన్ జర్నలిస్టులను నంజుకు తినొచ్చని కోడ్‌ల ద్వారా ప్రభుత్వం యాజమాన్యాలకు అనుమతి ఇచ్చింది. జర్నలిస్టుల వేతనాలకు, సర్వీసు కండిషన్లకు, పత్రికా స్వేచ్ఛకు సంబంధం ఏమిటీ అని సందేహం ఎవరికైనా కలగొచ్చు. జర్నలిజానికి కొన్ని విలువలు ఉన్నాయి. జర్నలిజం కాలేజీల్లో, శిక్షణా కేంద్రాల్లో వాటిని బోధిస్తారు. ఆ విలువలను అనుసరించి జర్నలిస్టులు తమ వృత్తి ధర్మం నేరవేర్చాలి. ఉద్యోగాల్లో చేరాక, పత్రిక విధానాన్ని బట్టి రాయాల్సి వచ్చినా మౌలిక విలువలకు హాని జరుగుతుంటే అంతరాత్మ అడ్డుపడుతుంది. ఆ అంతరాత్మపైనే మోడీ దెబ్బ వేశారు. జర్నలిస్టులు కూడా ఇతర ఉద్యోగుల వంటి వారేనని మోడీ చెప్పకనే చెప్పారు. ఆ మార్గంలోనే జర్నలిస్టుల రక్షణ కోసం నిలబడే చట్టాలకు నీళ్లొదిలారు.

చాలా ఏళ్లుగానే జర్నలిస్టులు ఉద్యోగ భద్రతను కోల్పోయారు. చట్టాలను లెక్క చేయని యాజమాన్యాల నిరంకుశ ధోరణి వల్ల పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు వీధుల పాలయ్యారు. కార్మికశాఖ చేతులెత్తేయడంతో యూనియన్లు నిర్వీర్యమయ్యాయి. మోడీ ప్రభుత్వంలో ధోరణి మరింత ఊపందుకొంది. 2014-2019 మధ్య మీడియా కార్పొరేటీకరణ పెద్ద స్థాయిలో సాగుతోంది. సీనియర్ జర్నలిస్టులు కూడా తమ తలలు ఎప్పుడు తెగిపడ్తాయోననే భయంతో బతుకుతున్నారు. పెద్ద పెద్ద మీడియా సంస్థలోని పేరు



మోసిన జర్నలిస్టుల తలలు ఎలా తెగిపడ్డాయో మనం చూశాం. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే తన తల కోట గుమ్మానికి వేలాడవచ్చు లేదా భారీగా పరువు నష్టం దావాలు పడవచ్చునని జర్నలిస్టులు భయపడ్తున్నారు. ఈ దశాబ్ద కాలంలో పత్రికా రంగంలో కాజువల్, కాంట్రాక్టు పద్ధతిలో జర్నలిస్టుల నియామకాలు పెరిగాయి. అలా ఉద్యోగంలో చేరిన జర్నలిస్టులకు చట్టపరమైన భద్రత ఏ మాత్రం లేకుండా పోయింది. స్వతంత్రంగా వ్యవహరించే జర్నలిస్టులకు ఉద్యోగ భద్రతనే కాదు, భౌతిక దాడుల నుండి కూడా రక్షణ లభించదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ వర్గాల్లో వెల్లడయ్యే అసమ్మతులను ప్రజలకు తెలియకుండా కప్పి పెట్టడానికి అవకాశం పెరిగింది.

జర్నలిస్టులు నిర్వహించిన పాత్రపై 1959లో సుప్రీంకోర్టు ఇలా వ్యాఖ్యానించింది. "ప్రజలు తమ భావప్రకట నా స్వేచ్ఛను ఉపయోగించుకోవడంలో స్వరతంతుల్లా పని చేసే జర్నలిస్టులు పాత్ర ఎంతో ప్రధానమైంది" అని పేర్కొంది. అలాంటి జర్నలిస్టులు స్వేచ్ఛగా పని చేయాలంటే వారికి ఉద్యోగ భద్రత కార్మిక చట్టాల ద్వారా హక్కులు కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా వారు దానికి బదులు రక్షణ కల్పించే ఆ చట్టాలను బలహీనం చేస్తే జర్నలిస్టులు వేధింపులకు గురవుతారు. దానివల్ల ప్రజాస్వామ్యానికే తీరని హాని జరుగుతుంది. వర్కింగ్ జర్నలిస్టు, అదర్ న్యూస్ పేపర్ ఎంప్లాయీస్ యాక్టు, అండ్ మిస్లేనియస్ యాక్టు 1955 ద్వారా వర్కింగ్ జర్నలిస్టులకు కొన్ని హక్కుల లభించేవి. ఇప్పుడు తెచ్చిన ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్, అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ ఓఎస్‌హెచ్ 2020 ద్వారా ఆ హక్కులను ప్రభుత్వం రద్దు చేసింది. హక్కుల క్రమబద్ధీకరణ పేర వర్కింగ్ జర్నలిస్టులకు ఇప్పుడున్న హక్కులకే ఎసరు పెట్టింది. లేబర్‌కోడ్ వల్ల జర్నలిస్టులను వర్కర్ 'కేటగిరి' లోకి మార్చి వారి హక్కులను ప్రభుత్వం మంగళం పాడింది. కొత్తగా అమల్లోకొచ్చిన కోడ్ ప్రకారం జర్నలిస్టులకు పాత పని గంటలే కొనసాగుతాయి. జర్నలిస్టులు నెలకు 144 గంటలు అంటే రోజుకు 6 గంటలు పని చేయాలి. బీట్ వారీగా రిపోర్టర్లకు పని అప్పగిస్తారు కనుక పని గంటలను నిర్ణయించడం ఆచరణ సాధ్యం కాదు. డెస్క్ జర్నలిస్టులను పేజీలకు బాధ్యుల్ని చేస్తున్నారు. కనుక వారు కూడా ఎక్కువ గంటలు పని చేయాల్సి వస్తుంది. కాగా కొత్త కోడ్ ప్రకారం జర్నలిస్టులను ప్రభుత్వం ఇతర ఉద్యోగులతో సమానం చేసింది.

రిట్రెంచ్‌మెంట్ సందర్భాల్లో కార్మికులకు ఉన్న హక్కులు జర్నలిస్టులకు వర్తిస్తాయి. ఇది వరకు ఎడిటర్‌ను తొలగించాలంటే ఆరు నెలల నోటీసు ఇవ్వాల్సి వచ్చేంది. ఆ మిగతా జర్నలిస్టులకు మూడు నెలల నోటీసు ఇవ్వాలి. కోడ్‌లు అమల్లోకి వచ్చాయి కనుక ఇప్పుడు సిబ్బంది సంఖ్య 300 మంది లోపు ఉన్న సంస్థల్లో ఇతర వర్కర్ల మాదిరిగా ఒక నెల నోటీసుతో జర్నలిస్టులు తొలగించవచ్చు. 300 మందికి పైగా పని చేసే సంస్థల్లో మూడు నెలల నోటీస్ ఇవ్వాలి. ఎడిటర్‌కు ఎలాంటి ప్రత్యేక రూలు ఏదీ లేదు. జర్నలిస్టులు కూడా కొత్త చట్టాల ప్రకారం వర్కర్‌కు సమానం కనుక వారు కనీస వేతనానికి వారు అర్హులు. దీనివల్ల బడా కార్పొరేట్ మీడియా సంస్థలు కూడా జర్నలిస్టులకు కనీస వేతనాలు అమలు చేయడానికి చట్ట ప్రకారం అవకాశముంది.

పాత చట్టం ప్రకారం సంస్థలోని సిబ్బంది సంఖ్యతో సంబంధం లేకుండా జర్నలిస్టులందరికీ గ్రాట్యుటీ వర్తించేది. ఇప్పుడు సిబ్బంది సంఖ్య 10 మందికి దాటితేనే గ్రాట్యుటీ ఉంటుంది. దానికి లోపు సిబ్బంది ఉండే సంస్థలకు గ్రాట్యుటీ వర్తించదు. అంటే మీడియా సంస్థల్లో పని చేసే సిబ్బందిని ఇతర సంస్థల పేర చూపెట్టి జర్నలిస్టులకు గ్రాట్యుటీని ఎగనామం పెట్టే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. 2014లో సుప్రీం కోర్టు ఎబిబి ప్రయివేట్ లిమిటెడ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో తీర్పు చెప్తూ 1955 చట్టం రాజ్యాంగాన్ని ఉల్లఘిస్తోందన్న యాజమాన్యం వాదనను కొట్టేసింది. "జర్నలిస్టుల హక్కులను పలచబారిస్తే దాని ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. అలా చేస్తే జర్నలిస్టులకు వ్యక్తిగతంగా జరిగే నష్టం కంటే సమాచారం పొందే ప్రజల హక్కుకు తీవ్ర భంగం వాటిల్లుతుంది. అది అనిశ్చితితో కూడిన ప్రమాదకరమైన పెట్టుబడిదారీ విధానానికి దారితీస్తుంది" అని హెచ్చరించింది. తన పదేళ్ల పాలన తర్వాత మోడీ 2014లో సుప్రీంకోర్టు అంచనా వేసిన అదే ప్రమాదాన్నే తెచ్చిపెట్టారు.

/ రచయిత 'ప్రజాశక్తి' పూర్వ సంపాదకులు,
సెల్ : 9989718311 /

ప్రజాశక్తి
www.prajasakti.com

హిడ్మా ఎన్‌కౌంటర్ పట్ల ప్రభుత్వానికి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

మావోయిస్టు నేతలు మడ్వి హిడ్మా, మడ్వి రాజే అలియాస్ రాజక్క, మరో నలుగురిది బూటకపు ఎన్‌కౌంటర్ అని దాఖలైన పిల్‌ను విచారించిన హైకోర్టు.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను వాయిదా వేస్తూ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా, మారేడుమిల్లి మండలం, కొండవాడ గ్రామంలో గత నవంబరు 18న జరిగిన వాళ్ల ఎన్‌కౌంటర్ ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని కోరుతూ పీపుల్స్ యూనిటీ ఫర్ సివిల్ లిబర్టీస్ హ్యూమన్ రైట్స్ ఫోరమ్ (పియుసిఎల్ఆర్ఎఫ్) జాతీయ అధ్యక్షులు జయ వింధ్యాల పిల్ దాఖలు చేశారు. మావోయిస్టు నేతలను అదుపులోకి తీసుకొని మూడురోజుల తర్వాత ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చారని పిటిషనర్ న్యాయవాది వాదించారు.

తిరుక్షేత్రాల రక్షణ సమితి పిల్ డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి

తిరుపతి మండలం, పేరూరు పరిధిలో టిటిడికి చెందిన భూమిని పర్యాటకశాఖ ద్వారా (పరస్పర మార్పిడి విధానంలో) ఒబెరాయ్ గ్రూపు హోటల్స్‌కు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ తిరుక్షేత్రాల రక్షణ సమితి దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఎంతో విలువైన భూమిని తక్కువ విలువ ఉన్న పర్యాటకశాఖ భూమితో టిటిడి పరస్పర మార్పిడి చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలని సీనియర్ న్యాయవాది కెఎస్ మూర్తి వాదించారు. టిటిడి నుండి తీసుకున్న భూమిని పర్యాటకశాఖ హోటల్ నిర్మాణం కోసం ఒబెరాయ్ గ్రూపునకు కేటాయింపును రద్దు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. పరస్పరం మార్పిడి చేసుకున్నాక భూమిని పర్యాటకశాఖ థర్డ్ పార్టీకి అప్పగించిందని చెప్పింది. పిల్‌ను కొట్టేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది.

నోటిఫికేషన్ చెల్లదన్న పిల్‌పై తీర్పు రిజర్వు

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతి పరిధిలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు టెండర్ నోటిఫికేషన్ చెల్లదంటూ దాఖలైన పిల్‌ను విచారించిన హైకోర్టు.. తీర్పును రిజర్వు చేసింది. ఎల్-1గా ఎంపికైన బిఎస్ఆర్ సంస్థతో పాటు మొత్తం మూడు సంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయని చెప్పింది. ఇందులో తప్పు ఎక్కడ ఉందని పిటిషనర్‌ను ప్రశ్నించింది. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది. ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలంటూ న్యాయవాది కనితి దీపక్ పిల్ వేశారు. నచ్చిన వారిని ఎంపిక చేసేలా టెండర్ రూల్స్ ఉన్నాయని, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వేసే అనుభవం దేశంలో ఆరు కంపెనీలకే ఉందని పిటిషనర్ వాదన. వెంటనే కోర్టు అడ్డుకోకపోతే ప్రభుత్వానికి రూ.400 కోట్లకు పైగా నష్టం వస్తుందన్నారు. పిటిషనర్ కనీస అవగాహన లేకుండా పిల్ వేశారని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతివాదన చేశారు. టెండర్ పొందాక అనుభవం ఉన్న కంపెనీలతో సబ్ కాంట్రాక్టు ఇచ్చేందుకు టెండర్ రూల్స్‌లో ఉందని గుర్తు చేశారు. పిల్‌ను కొట్టేయాలని కోరారు.

ఉద్యమ నేతపై పిడి చట్టం

(మొదటి పేజీ తరువాయి)

అప్పలరాజు ఏడు పర్యాయాలు అరెస్టు అయినట్టు పేర్కొన్నారు. హత్యాయత్నం, అక్రమ సమూహం, అక్రమ ప్రవేశం వంటి కేసులు అతనిపై నమోదై ఉన్నట్టు తెలిపారు. ఆయనపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి అంటే 2013 మేలో నమోదైన కేసు మొదలు తాజాగా రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమించిన కేసు వరకూ 19 కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు. 1986 సెక్షన్ 3 (1) (2) ఆర్/డబ్ల్యు 2 (జి) కింద చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం నుంచి తుది ఉత్తర్వులు విడుదలయ్యే వరకూ అప్పలరాజును కేంద్ర కారాగారంలో ఉంచాలని ఆదేశించారు.

సిపిఎం ఖండన

అప్పలరాజుపై ప్రభుత్వ, పోలీసు చర్యను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం ఓ ప్రకటనలో ఖండించారు. ఉమ్మడి విశాఖపట్నం, ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న అప్పలరాజును చట్టవిరుద్ధంగా నిర్బంధించడం దారుణమని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తుతున్నారన్న విమర్శలు ఇప్పటికే ఉన్నాయని పేర్కొన్నారు. అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్టును తక్షణం రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అనకాపల్లిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డిమాండ్ చేశారు. అప్పలరాజును విశాఖ కేంద్ర కారాగారం వద్ద లోకనాథం పరామర్శించారు. ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో అప్పలరాజు కుటుంబ సభ్యులను బుధవారం రాత్రి సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణతో కలిసి లోకనాథం పరామర్శించి ధైర్యం చెప్పారు.

అనకాపల్లి జిల్లాలో నిరసనల వెల్లువ

అప్పలరాజుపై అక్రమంగా పీడీ యాక్టు పెట్టి అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. సిపిఎం ఆధ్వర్యంలో అనకాపల్లి బాటా సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులోనూ, దేవరాపల్లి, కశింకోట మండల కేంద్రాల్లోనూ, నర్సీపట్నంలోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

పీడీ చట్టం - పూర్వాపరాలు

రాష్ట్రంలో నిర్బంధ చట్టాల అమలు ఇలా ...

గంజాయి గూండాల నుండి రౌడీషీటర్ల వరకు రాష్ట్రంలో ఒకవైపు చెలరేగిపోతున్నా ఏమాత్రం పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే సిపిఎం నేత అప్పలరాజుపై పిడి యాక్టు బనాయించి అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో గత దశాబ్ద కాలంలో రాష్ట్రంలో నిర్బంధ చట్టాల అమలు తీరుపై క్లుప్తంగా : రాష్ట్రంలో రెండు రకాల నిర్బంధ చట్టాలు అమలులో ఉన్నాయి. వీటిలో మొదటిది, ఆంధ్రప్రదేశ్ ప్రమాదకర కార్యకలాపాల నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ డేంజరస్ యాక్టివిటీస్ యాక్ట్ - పిడి యాక్ట్) దీనిని గూండా చట్టంగా కూడా పిలుస్తారు. 1986లో అమలులోకి వచ్చింది. ఈ చట్టం పరిధి విస్తృతంగా ఉంది. దొంగలు, మాదకద్రవ్య నేరస్తులు, గూండాలు, అక్రమ వ్యాపారాలు నిర్వహించేవారు, భూకబ్జాదారుల నుండి నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల విక్రేతలు ఆహార పదార్థాల కల్తీదారులు ఈ చట్ట పరిధిలోకి వస్తారు. అదే విధంగా నకిలీ పత్రాల తయారీదారులు, నిత్యావసర వస్తువులకు సంబంధించి నేరాలు చేసేవారు, అటవీ నేరస్తులు, జూదగాళ్లు, లైంగిక నేరస్తులు, అక్రమంగా పేలుడు పదార్థాలు తయారు చేసేవారు. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్న వారు, సైబర్ నేరస్తులు, వైట్ కాలర్, ఆర్థిక నేరస్తులను కూడా ఈ చట్టం పరిధిలోకి తీసుకువచ్చారు. రెండవది 1980వసంవత్సరం నాటి జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఎ). దీనిని కూడా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించింది.

గత పదేళ్ల కాలాన్ని రాష్ట్రంలో రెండు రాజకీయ దశలుగా విభజించవచ్చు. సమైక్యరాష్ట్ర విభజన అనంతర కాలం (2014-2019). మొదటిది. 2014 జూన్ 2న సమైక్యరాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయింది. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైంది. కొన్ని నెలల పాటు ఎపి పిడి చట్టం రెండు రాష్ట్రాలకు వర్తించింది. ఆ తరువాత తెలంగాణ తన సొంత చట్టాన్ని రూపొందించుకుంది. ఈ కాలంలో దీనిని చట్ట నిర్వచనానికి మించి అనేక కేసుల్లో వినియోగించారు. భూవివాదాలు, చిన్నచిన్న నేరాలతో పాటు ముఖ్యంగా రాజకీయ ప్రత్యర్థులకు సంబంధించిన కేసులకూ ఈ చట్టాన్ని వర్తింపజేశారు. అనేక సందర్భాలలో హైకోర్టు, సుప్రీంకోర్టులు జోక్యం చేసుకోవాల్సివచ్చింది. ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తాయి. కొన్ని సందర్భాలలో న్యాయమూర్తులు సైతం ఇటువంటి వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కొనసాగింది. ఈ కాలంలో నిర్బంధ చట్టాల వినియోగం గణనీయంగా పెరిగింది. జాతీయ స్థాయిలోనూ ఇది తీవ్ర చర్చకు దారి తీసింది. ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం గూండా చట్టం కింద రాష్ట్రంలోనే ఎక్కువ కేసులు నమోదయ్యాయి. 2019-24 మధ్య వేల సంఖ్యలో నిర్బంధ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైసిపి ప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రతిపక్షాలపై విస్తృతంగా ప్రయోగిస్తోందన్న విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియా నేరాల విషయంలోనూ గూండా చట్టంలోని "సైబర్ క్రైమ్ నేరస్తులు" అనే పదాన్ని పెద్దఎత్తున వినియోగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫేస్‌బుక్, యూ ట్యూబ్‌లలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు పెట్టారు.

న్యాయవ్యవస్థ జోక్యం

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.కె మిశ్రా (అనంతర కాలంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి) నేత త్వంలోని ధర్మాసనం నిర్బంధ చట్టాల అమలుపై అనేక కీలక తీర్పులు వెలువరించింది. గోపాల కృష్ణన్ అలియాస్ నకుల్ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో గూండా చట్టాన్ని 'కఠినమైన, దారుణమైన చట్టం'గా పేర్కొంది. చట్ట దుర్వినియోగం ఆందోళనకరంగా మారిందని వ్యాఖ్యానించింది. సాధారణ నేరాలను ఐపిసి, సిఆర్‌పిసి విచారించవచ్చని, దానికి భిన్నంగా గూండా చట్టాన్ని వాడటం చట్టాన్ని దుర్వినియోగం చేయటమేనని పేర్కొంది. మరో కేసులో, విచారణ లేకుండానే వ్యక్తిని శాశ్వత నిర్బంధంలో ఉంచే సాధనంగా ఈ చట్టాన్ని వాడుతున్నారని కోర్టు వ్యాఖ్యానించింది. సోషల్ మీడియా పోస్టులు ఎంత అభ్యంతరకరంగా ఉన్నా, అవి సాధారణ ప్రజా శాంతికి తీవ్రముప్పుగా పరిగణించలేమని పేర్కొంది. ఐటి చట్టం, ఐపిసి వంటి సాధారణ చట్టాలే ఈ నేరాలకు సరిపోతాయని పేర్కొంది.

ఈ కాలంలో హైకోర్టు వందల సంఖ్యలో నిర్బంధ ఉత్తర్వులను రద్దు చేసింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన చర్యలను కోర్టుల్లో సమర్థించుకుంది. సైబర్ బుల్లీయింగ్, తప్పుడు వార్తలు, పరువు నష్టం కలిగించే ప్రచారాలను అరికట్టాల్సిన అవసరం ఉందని, అవి హింసకు దారితీయవచ్చని వాదించింది. మొత్తం మీద రాష్ట్రంలో గత దశాబ్ద కాలంలో నిర్బంధ చట్టాల అమలు పెరిగింది. దీనిని న్యాయస్థానాలు కొంత మేర అడ్డుకునే ప్రయత్నం చేశాయి. తాజాగా తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా ఉద్యమకారునిపై పిడి చట్టాన్ని బనాయించింది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

వ్యవసాయ వినియోగదారుల విభజన సరికాదు

- ఇఇఇఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్త

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన మూడో డిస్కంను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజినీర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఇఐ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్త డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దత్త మాట్లాడుతూ... వ్యవసాయ, ఇతర సబ్సిడీ వినియోగదారులను వేరు చేసి, తెలంగాణ రాష్ట్రం మొత్తాన్ని కవర్ చేసేలా మూడవ డిస్కమ్ ఏర్పాటు చేయాలని 17 డిసెంబర్ 2025న ప్రభుత్వం జారీ చేసిన జిఓ 44ను వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు. ఇటీవల విడుదలైన ముసాయిదా విద్యుత్ (సవరణ) బిల్లు 2025 నేపథ్యంలో, గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేసేందుకు పన్నుతున్న కుట్రలో భాగమేనని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ, ఇతర సబ్సిడీ వినియోగదారులను వేరు చేయడం వల్ల ప్రభుత్వ విద్యుత్ సంస్థలు విచ్ఛిన్నం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవాలను పక్కన పెట్టి కేంద్రం నిర్ణయాలకు అనుగుణంగా తెలంగాణ విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసే యత్నాలను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో 44ను వెంటనే ఉపసంహరించుకుని, మూడవ డిస్కమ్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో తెలంగాణ యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఈశ్వర్‌రావు, నలువాల స్వామి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, ఆర్.సుధాభాస్కర్ పాల్గొన్నారు.

హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బోడమాచ్య తండా గ్రామంలో భూక్యా వీరన్న (45) అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. అతడిని హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని స్థానికులు ఆరోపించారు. వీరన్న మృతికి ప్రతీకారంగా బుధవారం ఉదయం తండావాసులు ఆందోళనకు దిగారు. అనుమానితులుగా భావిస్తూ ఆర్ఎంపి భరత్, బోడ బాలు ఇళ్ల ముట్టడికి వెళ్లారు. ఈ క్రమంలో ఆర్ఎంపి బైక్, ఓ షాపును తగులబెట్టారు. బాలు ఇంటిని ధ్వంసం చేస్తుండగా పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను అడ్డుకున్నారు. దాంతో తండా వాసులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. అనుమానితులతో పాటు మృతుని భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బోడమాచ్య తండాలో భారీగా పోలీసులు మోహరించారు.

స్వర్ణాంధ్రకు 10 సూత్రాలే కీలకం

- సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు ప్రాధాన్యత అంశాలివే
- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ సేవలను వేగంగా అందించడంలో భాగంగా ప్రభుత్వ శాఖలు ఇండికేటర్లను సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధన కోసం రూపొందించిన 10 సూత్రాలు, 10 మిషన్లుగా నిర్దేశించుకుని పనిచేయాలని అధికారులకు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో స్వర్ణాంధ్ర లక్ష్యాలు, 10 సూత్రాల అమలుపై ఆయా శాఖల నోడల్ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పన, ఆయా ప్రభుత్వ శాఖలు మెరుగైన పనితీరు కోసం ముఖ్యమైన ఇండికేటర్లను గుర్తించి వాటికనుగుణంగా పనిచేయాలన్నారు. జీరో పావర్టీ మిషన్లో భాగంగా పి-4 విధానాన్ని ముందుకు తీసుకెళ్లడంతోపాటు వాటి అమలును విజన్ మానిటరింగ్ యూనిట్ల ద్వారా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలో ఉన్న దాదాపు 30 లక్షల మంది బిపిఎల్ కుటుంబాలకు ఎంత ప్రయోజనం కలిగిందో అంచనా వేయాలని సూచించారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఓ విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. నైపుణ్యాలు, ఉద్యోగ కల్పన అనేది అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన తొలి ప్రాధాన్యతగా పేర్కొన్నారు. 10 సూత్రాలకు సంబంధించిన అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కీలక మిషన్ నీటి భద్రత అంశంపైనా ప్రధానంగా దృష్టి పెట్టాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలూ సస్యశ్యామలంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సిఎం వెల్లడించారు. సాంకేతికతను వినియోగించుకుని సాగు వ్యయం తగ్గేలా చూడాలన్నారు.

ఇండికేటర్ల ఆధారంగా లక్ష్యాలు

రాష్ట్రంలో రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించేలా లాజిస్టిక్స్ రంగాన్ని తీర్చిదిద్దాలని సిఎం స్పష్టం చేశారు. రోడ్డు, రైలు, అంతర్గత జల రవాణా, సి కార్గో, ఎయిర్ కార్గో వంటి అంశాలతోపాటు కోల్డ్ చైన్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు లాజిస్టిక్స్ మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. విద్యుత్, ఇంధన వ్యయాలను తగ్గించే అంశంపైనా దృష్టి పెట్టాలన్నారు. ఉత్పత్తిదారు, వినియోగదారు అనే విధానంలో ఆలోచన చేయాలని సూచించారు. రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యత అనేది కీలకమైన అంశమని ప్రాజెక్టు పర్సెప్షన్‌తోపాటు మేడ్ ఇన్ ఆంధ్రా బ్రాండ్‌ను ప్రపంచ వ్యాప్తం చేసేలా స్పష్టమైన విధానం ఉండాలన్నారు. అరకు కాఫీని పెద్దయెత్తున బ్రాండ్ చేయగలిగామని పేర్కొన్నారు. ట్రేసబిలిటి, సర్టిఫికేషన్ జరిగితే మన వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత నిర్ధారణ అవుతుందన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించాలన్నారు. గాలి, నీటి నాణ్యతల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో ఆర్గానిక్ కూరగాయలను ఉత్పత్తి చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. పౌర సేవలు సులభంగా ప్రజలకు అందేలా ప్రభుత్వ శాఖలన్నీ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, ఆర్‌టిజిఎస్ ద్వారా సమాచారాన్ని సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యాశాఖ వినియోగంలోకి తెచ్చిన క్వికర్ యాప్ వంటి వినూత్న ఆవిష్కరణలు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సిఎస్ విజయానంద్, ఆయా శాఖల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ అండతోనే ప్రొటెక్షన్ ఆర్డర్లు!

- ఇనుమూరు గిరిజనుల పట్ల అధికారుల తీరు తీవ్ర వివాదాస్పదం
- రికార్డుల వెరిఫికేషన్ లేకుండా ఆన్‌లైన్ ఆధారంగా ఆదేశాలు
- హైకోర్టులో కొనసాగుతున్న కేసును పట్టించుకోని వైనం
- గిరిజనేతర భూస్వాములకు ప్రధాన రాజకీయ పార్టీ నాయకుల మద్దతు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం ఇనుమూరు గ్రామంలో గిరిజనుల సాగులో ఉన్న భూములపై రాజకీయ అండతో గిరిజనేతర భూస్వాములు వివాదాలు సృష్టిస్తున్నారు. వారికి అధికారులు కొమ్ముకాస్తూ నిబంధనలకు విరుద్ధంగా ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇవ్వడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏజెన్సీ చట్టాలను ఏ మాత్రమూ పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమైంది. అంతర్వేదిగూడెం రెవెన్యూ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామం ఇనుమూరులో 42 ఎకరాల భూమిని తరతరాలుగా ఎన్నో ఏళ్లుగా అక్కడి గిరిజనులు సాగు చేసుకుంటున్నారు. ఈ భూముపై కన్నేసిన గిరిజనేతర భూస్వామి వాటిని స్వాధీనం చేసుకోవడానికి కుట్ర చేశారు. దీంతో, వారికి, గిరిజనులకు మధ్య వివాదం నెలకొంది. 2004లో ఎస్‌డిసి (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్) కోర్టు ఆ భూములు గిరిజనులకే చెందుతాయంటూ తీర్పు ఇచ్చింది. తర్వాత 2022లో మళ్లీ అదే కోర్టు గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా ఆర్డర్ ఇవ్వడంతో వివాదాస్పదమైంది. రాజకీయ అండదండలతో గిరిజనేతర భూస్వాముల కొమ్ముకాశారని అప్పట్లో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై హైకోర్టుకు వెళ్లారు. విచారణ కొనసాగుతున్న సమయంలో గిరిజనేతర భూస్వామికి అండగా అధికారులు నిలిచి పంటను ధ్వంసం చేయడం వెనుక రాజకీయ అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. బుట్టాయగూడెం మండలం దొరమామిడి గ్రామానికి చెందిన ఎంద్రప్రగడ సత్యనారాయణ, ఆయన కుటుంబ స్వస్థలం పూర్వం గోపాలపురం మండలం చిట్యాల గ్రామం. దొరమామిడి వచ్చి స్థిరపడిన ఈ కుటుంబం ఇనుమూరులోని భూములను ఆన్‌లైన్‌లో తమపేరున మార్చుకున్నట్లు గిరిజనులు చెబుతున్నారు. అడంగల్ రికార్డుల్లో ప్రభుత్వ భూమి అని ఉందని, ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమకు పట్టాలివ్వాలని గిరిజనులు అధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చారు. సత్యనారాయణ కుటుంబానికి టిడిపి, వైసిపి, జనసేన పార్టీల నాయకుల మద్దతు ఉందని, ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆయనకు కొమ్ముకాస్తోందని ఆవేదన చెందుతున్నారు. రాజకీయ అండతోనే అధికారులు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చారని, నిబంధనలను ఉల్లంఘించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరతరాలుగా ఈ భూములు తమ సాగులో ఉన్నాయని, తమకు అన్యాయం చేయడం తగదని అంటున్నారు. మొక్కజొన్న పంటలను ధ్వంసం చేయడం, ఈ సందర్భంగా తమపై దౌర్జన్యకాండ సాగించడం అత్యంత దారుణమని, ఇరుపక్షాలను పిలిచి మాట్లాడాల్సి ఉండగా అధికారులు అటువంటివేమీ చేయకుండా పంటను నాశనం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సమస్య కోర్టు పరిధిలో ఉన్నప్పుడు అధికారులు జోక్యం చేసుకోవడం తగదని అంటున్నారు. నిబంధనల ప్రకారం ఏజెన్సీలో భూములకు సంబంధించిన వివాదాల్లో ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చే అధికారం జిల్లా కలెక్టర్‌కు మాత్రమే ఉంటుంది. అయితే, బుట్టాయగూడెం మండలానికి సంబంధించిన భూవివాదాల్లో తహశీల్దార్లు, ఆర్‌డిఒలు సైతం ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇనుమూరు ఘటనలో ప్రధాన రాజకీయ పార్టీలు అధికారులకు మద్దతుగా మాట్లాడడం పట్ల గిరిజనులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తమ సాగు భూములకు హక్కులు కల్పించాలని వారు కోరుతున్నారు.

గిరిజన మహిళలపై దౌర్జన్యం తగదు

- ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజన మహిళలపై దౌర్జన్యం చేసిన ఎస్ఐ దుర్గామహేష్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లోత రామారావు, కిల్లో సురేంద్ర, సహాయ కార్యదర్శి ఎ అశోక్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇనుమూరులో ఆదివాసీ గిరిజనులు సాగుచేసుకుంటున్న పంటలను ఎస్ఐ ట్రాక్టర్‌తో ధ్వంసం చేస్తుండగా, వారు అడ్డుకోవడంతో ఎస్ఐ విచక్షణా రహితంగా దాడులు చేశారన్నారు. ఆదివాసీలు హక్కులు కాపాడాల్సిన పోలీసులు, రెవెన్యూ అధికారులు భూ స్వాములు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదివాసీ గిరిజనులపై దాడి చేసిన ఎస్ఐ దుర్గా మహేష్, తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు డిజిపి హరీష్‌కుమార్ గుప్తాకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, కె ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఫిర్యాదు చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

25న ఐద్వా 14వ మహాసభ

- 26 నుంచి 28 వరకు ప్రతినిధుల మహాసభ
- తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐద్వా 14వ జాతీయ మహాసభ సందర్భంగా జనవరి 25న హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగ సభకు మహిళా లోకం తరలిరావాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మొదటిసారి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఐద్వా ఆల్ ఇండియా మహాసభ జరుగుతుందని తెలిపారు. జనవరి 25న ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభకు మహిళలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. నాలుగు రోజులపాటు హైదరాబాద్‌లో జరిగే ఈ మహాసభలో దేశవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందిస్తామన్నారు. మహిళల హక్కులు, విద్య, బాల్య వివాహాల నిషేధం, ఆస్తి హక్కు చట్టం, వరకట్న వేధింపుల నిరోధానికి ఐపిసి 498 (ఏ) సెక్షన్, కేంద్ర, రాష్ట్ర మహిళా కమిషన్, గృహ హింస నిరోధక చట్టం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు వంటి అనేక సమస్యలపై దేశవ్యాప్తంగా ఐద్వా అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 12 ఏళ్ల కాలంలో మహిళలు, మైనార్టీలు, దళితులు, అట్టడుగు వర్గాలకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై, యువతులపై వేధింపులు, హత్యలు, లైంగికదాడులు పెరిగాయని తెలిపారు.

1000 మంది ప్రతినిధుల రాక

జనవరి 25 నుంచి 28 వరకు జరిగే ఐద్వా జాతీయ మహాసభకు దేశవ్యాప్తంగా 1000 మంది మహిళా ఉద్యమ ప్రతినిధులు హాజరవుతారని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి తెలిపారు. ఐద్వా జాతీయ నాయకులు బృందాకరత్, ఆల్ ఇండియా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీమతి టీచర్, మరియం దావలె, జాతీయ నాయకులు ఎస్ పుణ్యవతి, సుధా సుందర రామన్ పాల్గొంటారని చెప్పారు. ఐద్వా జాతీయ మహాసభ విజయవంతం కోసం రాష్ట్రవ్యాప్తంగా సెమినార్‌లు, సదస్సులు, ఫొటో ఎగ్జిబిషన్, కళాజాతాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభ విజయవంతానికి ప్రజలంతా హార్థికంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కెఎన్ ఆశాలత, రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల వినోద, జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి, జిల్లా కోశాధికారి మేకనబోయిన సైదమ్మ, రైతు సంఘం జిల్లా నాయకులు కొప్పుల రజిత తదితరులు ఉన్నారు.

గిరిజనులపై దాడి చేసిన ఎస్ఐ, తహశీల్దారుపై చర్యలు

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, ఇనుమూరు గ్రామంలో గిరిజనులపై దాడి చేయడం, వారి పంటలను ధ్వంసం చేసి, అసభ్య పదజాలంతో దూషిస్తూ లాఠీచార్జి చేసిన స్థానిక ఎస్ఐ, తహశీల్దారుపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళగిరిలోని డిజిపికి బుధవారం వినతిపత్రాన్ని అందజేసినట్లు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు తెలిపారు. ఇనుమూరులో అనేకేళ్లుగా వారసత్వంగా కొంత మంది గిరిజనులు ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూములకు పట్టాలివ్వాలని రెవెన్యూ అధికారులను ఎంతోకాలంగా కోరుతున్నట్లు చెప్పారు. గిరిజనుల సాగులో ఉన్న భూములు గిరిజనేతర భూస్వాములైన యాంద్ర ప్రగడ సత్యనారాయణ, రామాంజనేయులు దొంగ పత్రాలు సృష్టించి అధికారుల అండతో గిరిజనులు సాగుచేసుకున్న మొక్కజొన్న పంటను తహశీల్దారు, ఎస్ఐ దగ్గరుండి ట్రాక్టర్లతో ధ్వంసం చేశారని తెలిపారు. 1/70 చట్టాన్ని ఉల్లంఘించిన రెవెన్యూ, పోలీసు అధికారులు, గిరిజనేతరులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

అప్పలరాజు అక్రమ అరెస్టుపై ఖండన

రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై తీవ్రమైన నేరాలు మోపి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. రైతులు, కార్మికుల పక్షాన నిజాయతీగా పోరాడుతున్న అప్పలరాజుపై అక్రమ కేసులు మోపడం దారుణమని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం బల్క్‌డ్రగ్ పరిశ్రమ, పారిశ్రామిక కారిడార్ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ.. స్థానిక మత్స్యకారులు, రైతులు సాగిస్తున్న న్యాయమైన పోరాటానికి అప్పలరాజు మద్దతుగా ఉంటున్నారని తెలిపారు. వారికి అండగా నిలవడమే నేరంగా భావించి పోలీసులు అక్రమ కేసులు బనాయించి అప్పలరాజును అరెస్ట్ చేసి జైలుకు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామా లేక నిరంకుశ పాలనలో ఉన్నామా అన్న సందేహం కలుగుతుందన్నారు. తక్షణమే పోలీసులు పెట్టిన అన్ని కేసులూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలు, నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పెద్దయెత్తున ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

పోలవరం అంచనా 62 వేల కోట్లు !

- త్వరలోనే సమగ్ర నివేదిక
- కేంద్రానికి లేఖలో ప్రస్తావించిన సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.62,000 కోట్లకు చేరుతోంది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు ఈ ప్రతిపాదనలతో కూడిన లేఖ సమర్పించినట్లు తెలిసింది. అయితే రెండవ దశగా చెబుతున్నదానికి రూ.32 వేల కోట్లకు సంబంధించిన ఖర్చు ఎలా అనే అంశాలపై త్వరలో సమగ్ర నివేదిక ఇస్తామని చెప్పినట్లు సమాచారం. ప్రాజెక్టు కోసం పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా ఇప్పటి వరకూ రూ.23,600 కోట్లు ఇచ్చింది. ఇంకా రూ.6600 కోట్ల వరకూ ఇవ్వాల్సి ఉంది. 2005లో రూ.10 వేల కోట్లతో ప్రతిపాదించిన ప్రాజెక్టు అంచనాలను 2010,. 2013, 2017లో సవరించారు. తాజాగా మరోసారి సవరించాలని నిర్ణయించారు. దీంతో అన్ని సవరణలతో కలిసి ప్రాజెక్టు విలువ ప్రస్తుతం రూ.62 వేల కోట్లుకు చేరింది. అదే సమయంలో పునరావాసం మాత్రం 26 శాతం మాత్రమే పూర్తయింది. అయితే అంచనాల్లో ప్రాజెక్టు పనులు పూర్తవుతున్నట్లు కనిపించినా ఆచరణలో కీలకమైన పునరావాసం పనులు నామమాత్రంగా జరుగుతున్నాయి. దాదాపు గిరిజనులను ఆ ప్రాంతం నుండి పూర్తిగా తరిమేస్తున్నారు. ప్రాజెక్టు పనులకు సంబంధించిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ 2009 అంచనాలనే పరిగణనలోకి తీసుకుంది. 2018లో ప్రాజెక్టు అంచనాలను సవరించి రూ.55 వేల కోట్లకు ప్రతిపాదించారు. టిడిపి ప్రభుత్వం తామే ప్రాజెక్టు నిర్మిస్తామని కేంద్రానికి తెలిపి పనులు మొదలుపెట్టింది.

అయితే ప్రాజెక్టును 41,15 మీటర్లకు నిర్మించాలా, 45.17 మీటర్లకు నిర్మించాలనే అంశంపై అప్పటి తెలుగుదేశం, అనంతరం వైసిపి, ప్రస్తుత తెలుగు దేశం కూటమి ప్రభుత్వాలు కేంద్రానికి వేర్వేరు రూపాల్లో వివరాలు సమర్పించాయి. అధికారంలో ఉన్నప్పుడు 41.15 మీటర్లకు నిర్మిస్తామని చెప్పడం అధికారంలో లేకపోతే దాన్ని వ్యతిరేకించడం లేదా పరస్పరం నిందించుకోవడం టిడిపి, వైసిపి నాయకులకు ఆనవాయితీగా వస్తోంది. అయితే ప్రాజెక్టు ఎత్తు విషయంలో నిరంతరం వాదులాడుకున్న పాలకులు పునరావాసం విషయంలో మాత్రం గిరిజనుల పట్ల ఒకే విధంగా వ్యవహరించారు. ఇప్పుడు కొత్తగా తెలుగుదేశం పాలకులు ప్రాజెక్టు రెండోదశకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించారు. ప్రాథమిక అంచనాలు కేంద్రానికి సమర్పించారని, పూర్తి నివేదిక తయారుచేసి ఇవ్వాల్సి ఉందని తెలిసింది. కేంద్రానికి లేఖ ఇచ్చిన ప్రభుత్వం దాని బహిర్గతం చేయకపోవడం ఇప్పుడు చర్చనీయాంశం అయింది. దీనిపై అధికారులను సంప్రదించగా ప్రాథమిక అంచనాలు మాత్రమే ఇచ్చామని, పూర్తి నివేదిక వచ్చిన తరువాత అన్ని వివరాలూ వెల్లడించే అవకాశం ఉందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం, నీరు నింపడం ఎంత ఎత్తు అన్న సంగతి ఎలావున్నా పునరావాసం మాత్రం ఒకే దశగా 45.17 మీటర్లకు లెక్కగట్టి పూర్తి చేయాలన్నది బాధితులు ముక్తకంఠంతో చెబుతున్నారు.

సుప్రీంకు ఉన్నావో అత్యాచార బాధితురాలు

కుల్‌దీప్ సింగ్ సెనెగర్

న్యూఢిల్లీ : ఉన్నావో అత్యాచార కేసులో మాజీ బిజెపి నేత కుల్‌దీప్ సింగ్ సెనెగర్ శిక్షను సస్పెండ్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టుకు వెళ్తానని బాధితురాలు తెలిపింది. హైకోర్టు తీసుకున్న నిర్ణయం తమ కుటుంబం పాలిట 'మృత్యువు' వంటిదని వ్యాఖ్యానించారు. డబ్బున్నవారు గెలుస్తారు, డబ్బు లేనివారు ఓడిపోతారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కేసుల్లో దోషులకు బెయిల్ లభిస్తుంటే ఇక ఈ దేశంలో మహిళలకు రక్షణ ఎక్కడిదని ఆమె ప్రశ్నించారు. తాజా ఆదేశాలను నిరసిస్తూ మండి హౌస్‌కు సమీపంలో నిరసన చేయడానికి ఆమె తన తల్లితో కలిసి వచ్చారు.

2019 డిసెంబరులో ట్రయల్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ సెనెగర్ పెట్టుకున్న పిటిషన్ పరిష్కారమయ్యేవరకు ఆయన శిక్షను నిలుపుచేసి, జైలు నుండి విడుదల చేయాలని ఢిల్లీ హైకోర్టు మంగళవారం పేర్కొంది. అయితే బాధితురాలి తండ్రి కస్టడీ హత్య కేసులో ఇప్పటికే పదేళ్ళ జైలు శిక్షను అనుభవిస్తున్నారు. అయినా అత్యాచార కేసులో ఢిల్లీ హైకోర్టు శిక్షను సస్పెండ్ చేయడం గమనార్హం..

ఆదివాసీ నేత సలా మరాండి జైలు నుండి విడుదల

- అక్రమ కేసులు బనాయించిన బిజెపి

భువనేశ్వర్ : ఆదివాసీ నేత, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ ఒడిషా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలా మరాండి జైలు నుండి విడుదలయ్యారు. ఒడిషాలోని బిజెపి ప్రభుత్వం అక్రమ కేసులను బనాయించి నెల రోజుల పాటు ఆయన్ను జైల్లో నిర్బంధించింది. సోమవారం ఆయన జైలు నుంచి విడదలయ్యారు. నిర్వాసితులైన సాలియా సాహి ప్రాంత ఆదివాసీల హక్కులు, వారి భూమి పట్టాల కోసం జరుగుతున్న పోరాటానికి మరాండి నాయకత్వం వహిస్తున్నారు. బిజెపి ప్రభుత్వం సాలియా సాహి మురికివాడల ప్రజలకు సరైన పునరావాసం కల్పించకుండా వారిని వేదిస్తుంది. దీనిపై మరాండి ఆదివాసులను ఐక్యం చేసి పోరాటం కొనసాగిస్తున్నారు. దీంతో ఆయనపై అక్రమ కేసులను ఒడిషా ప్రభుత్వం బనాయించింది. జైలు నుంచి విడుదలైన మరాండిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సురేష్ పాణిగ్రాహి, ఆదివాసీ నాయకులు, మురికి వాడల ప్రజలు, పార్టీ కార్యకర్తలు స్వాగతం పలికారు.. విడుదలైన తరువాత మరాండి సిపిఎం రాష్ట్ర కార్యాలయానికి ప్రదర్శనగా చేరుకున్నారు. ప్రముఖ గిరిజన నాయకుడు బిర్సా ముండాకు, కామ్రేడ్ సిబాజీ పట్నాయక్ స్మారక చిహ్నాల వద్ద పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు..

40శాతం కాలుష్యం రవాణా రంగం నుండే : నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ : దేశ రాజధాని నగరంలో తీవ్రంగా నెలకొన్న వాయు కాలుష్యం పట్ల కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో 40శాతం కాలుష్యానికి రవాణా రంగమే కారణమంటూ ఆయన అంగీకరించారు. ఇక్కడ రెండు రోజులున్నందుకే కలుషితమైన గాలి కారణంగా తనకు అనేక ఇన్ఫెక్షన్లు వచ్చాయని చెప్పారు. ఢిల్లీలో ఒక పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిజమైన జాతీయవాదం ఎక్కడైనా వుందంటే అది దిగుమతులు తగ్గించడం, ఎగుమతులు పెంచడంలోనే వుంటుందన్నారు. శిలాజ ఇంధనాల దిగుమతులపై ఏటా రూ.22లక్షల కోట్లు ఖర్చు పెట్టేకన్నా ప్రత్యామ్నాయ, జీవ ఇంధనాలపై మరింతగా ఆధారపడాలని సూచించారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు పెడుతూ మన దేశాన్ని మనమే కలుషితం చేసుకుంటున్నామన్నారు. ఈ విషయంపై ఆలోచించి, స్వావలంబనను సాధించలేమా అని ప్రశ్నించారు.

ఎర్రకోట బాంబు పేలుడు కేసు నిందితులకు కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : ఎర్రకోట బాంబు పేలుడు కేసులోని ఏడుగురు నిందితులకు ఢిల్లీ కోర్టు జ్యూడిషియల్ కస్టడీని మరో 15 రోజులు పొడిగించింది. అదీల్ రాథర్, ముజమ్మిల్ గనై, షాహీన్ సయీద్, మౌల్వి ఇర్ఫాన్ అహ్మద్ వాగే, జాసిర్ బిలాల్ వాని, అమర్ రషీద్ అలీ, సోయబ్‌లకు కస్టడీని బుధవారం నుంచి మరో 15 రోజులకు అంటే జనవరి 8 వరకూ పాటియాలా హౌస్ కోర్టు పొడిగించింది. గతంలో వీరికి విధించిన కస్టడీ గడువు బుధవారంతో ముగియడంతో వీరిని ఎన్ఐఎ అధికారులు అదనపు సెషన్స్ జడ్జి ప్రశాంత్ వర్మ ముందు హాజరుపర్చారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. మీడియాను విచారణకు హాజరుకాకుండా నిషేధించారు. ఎర్రకోట సమీపంలో నవంబర్ 10న హుండ్యాయ్ ఐ20 అనే కారుతో జరిపిన ఆత్మహుతి దాడిలో 15 మంది మరణించగా, 20 మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి పై ఏడుగురి నిందితుల్ని వివిధ సందర్భంలో ఎన్ఐఎ అరెస్టు చేసింది. వీరిలో ముగ్గరు వైద్యులు కూడా ఉన్నారు.

మోడీతో భేటీ తప్పుడు సంకేతాలివ్వదా?

స్పీకర్ టీ పార్టీకి ప్రియాంక గాంధీ వెళ్లడంపై జాన్ బ్రిట్టాస్

న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టాన్ని విధ్వంసం చేసిన కొద్ది గంటల వ్యవధిలోనే స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేసిన తేనీటి విందుకు కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ హాజరు కావడాన్ని సిపిఎం రాజ్యసభా పక్షనేత జాన్ బ్రిట్టాస్ ప్రశ్నించారు. ఈ టీ పార్టీకి ఆమె హాజరు కావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిసిన అనంతరం లాంఛనప్రాయంగా జరిగే ఈ టీ పార్టీకి ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. కోట్లాదిమంది శ్రామికులకు లబ్ధి చేకూర్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పార్లమెంట్‌లో రద్దు చేసిన నేపథ్యంలో ఆ తేనీటి విందుకు కొంతమంది కాంగ్రెస్ నేతలు హాజరు కావాలనుకోవడం సరికాదని బ్రిట్టాస్ వ్యాఖ్యానించారు. వారు హాజరు కావడం, కీలకమైన చట్టాల విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరును నిరసిస్తూ ప్రతిపక్షం సమిష్టిగా తీసుకున్న వైఖరిని దెబ్బ తీసిందన్నారు. ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతుందన్నారు. ప్రతిపక్షాల ప్రతిఘటనా వైఖరిని బలహీనపరుస్తుందన్నారు.

ఢిల్లీలో విలేకర్లతో మాట్లాడుతూ ఆయన, ఇలాంటి సందర్భాల్లో నిరసనలు తెలియచేస్తూ గతంలో ప్రతిపక్షాలు అటువంటి సమావేశాలను బహిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. గతేడాది శీతాకాల సమావేశాల సమయంలో, అలాగే అంబేద్కర్‌కు వ్యతిరేకంగా హోం మంత్రి అమిత్ షా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలకు నిరసనగా సహా నాలుగుసార్లు ఇటువంటి సమావేశాలను బహిష్కరించిన ఉదాహరణలను ఆయన పేర్కొన్నారు.

(ఫైల్ ఫొటో)

విదేశీ పర్యటనలను ప్రశంసించిన ప్రియాంక..

ప్రధాని జరిపిన విదేశీ పర్యటనల గురించి మోడీతో ప్రియాంక మాట్లాడారని "మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని, ఆయన పేరును కూడా లేకుండా చేస్తూ రెండోసారి మహాత్ముడిని చంపిన తర్వాత, పరస్పరం అభినందనలు తెలియచేసుకుంటూ ప్రధాని చేసిన విదేశీ పర్యటనలను ప్రశంసించడం ద్వారా భారతదేశంలోని పేదలకు వారు ఏం సందేశం పంపుతున్నారు?" అని బ్రిట్టాస్ ప్రశ్నించారు.

ఎంజిఎన్ఆర్ఇజిఎను రద్దు చేసి, డిమాండ్ ఆధారిత వ్యవస్థను తలక్రిందులు చేయడమే కాకుండా మహాత్మాగాంధీ పేరును తొలగించినందుకు ప్రతిపక్షం తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తోందన్నారు. గురువారం పార్లమెంట్ వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) (విబి-జి ఆర్ఎఎం జి)ని ఆమోదించింది. ఈ పరిస్థితులను చూసి కాంగ్రెస్ నాయకులు కూడా ఇబ్బంది పడ్డారని అన్నారు. ప్రియాంక గాంధీ వాద్రా కనీసం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు కూడా కాదని, ఆమె ఏ హోదాలో ఈ సమావేశానికి హాజరయ్యారని బ్రిట్టాస్ ప్రశ్నించారు. ఇతర పార్టీ నేతలను కూడా ఆమె తప్పుదారి పట్టించారన్నారు. ప్రియాంక గాంధీ తన నియోజకవర్గం వాయనాడ్‌కు సంబంధించిన సమస్యలను వేటినీ కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఇక ఇప్పుడు కరెన్సీ నోట్లపై మహాత్మా గాంధీ చిత్రాన్ని మార్చడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని ఆయన విమర్శించారు. ఈ అంశంపై ఇప్పటికే ఉన్నత స్థాయి సమావేశం జరిగిందన్నారు.

అయితే ఈ తేనీటి సమావేశాన్ని బహిష్కరించాలని ఇండియా బ్లాక్ నుండి లాంఛనంగా ఎలాంటి పిలుపు లేదన్న విషయాన్ని ప్రస్తావించగా, అనేకమంది నేతలు సమావేశానికి రాలేదు, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ లేదా డిఎంకె లేదా టిఎంసి నేతలు ఎవరైనా రావడం మీరు చూశారా? అని బ్రిట్టాస్ విలేకర్లను ప్రశ్నించారు.

జాతీయ స్థాయి పోటీలకు ట్రైన్ టాయిలెట్ వద్ద నిలబడి ప్రయాణం

- ఒడిషాలో యువ రెజ్లర్ల కష్టాలు
- వెల్లువెత్తుతున్న విమర్శలు

టాయిలెట్ వద్ద ప్రయాణిస్తున్న క్రీడాకారులు

భువనేశ్వర్ : ఒడిషాలో బిజెపి ప్రభుత్వ పాలనలో క్రీడాకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి వెళ్లిన రెజ్లర్లకు మోహన్ చరణ్ మాంఝీ ప్రభుత్వం కనీసం రవాణా సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయలేకపోయింది. దీంతో సుమారు 1520 కిలోమీటర్ల దూరం ట్రైన్ టాయిలెట్ల ముందు నిలబడి గంటల తరబడి ప్రయాణం చేయాల్సి వచ్చింది. తిరుగు ప్రయాణంలోనూ రెజ్లర్లు ఈ విధంగానే ప్రయాణం చేశారు. ఇందులో ఎనిమిది మంది బాలికలు ఉన్నారు. ఈ ప్రయాణానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఈ ఘటనపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలిస్తే, ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్‌లోని బల్లియాలో 69వ జాతీయ స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి.

ఈ ఛాంపియన్‌షిప్‌లో ఎనిమిది బాలికలతో సహా మొత్తం 18 మంది పాఠశాల విద్యార్థులు ఒడిషా నుంచి పాల్గొన్నారు. అయితే వీరికి సంబంధించిన అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేదు. దీంతో నందంకనన్ ఎక్స్‌ప్రెస్‌లో టాయిలెట్లకు సమీపంలో కూర్చిన ప్రయాణం చేసి అక్కడకు వెళ్లారు. తిరిగి ప్రయాణంలోనూ అదే విధంగా ప్రయాణం చేశారు. చలితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లగేజీలపై రెజ్లర్లు కూర్చిన ప్రయాణం చేస్తున్న వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. దీనికి గురించి పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక రెజ్లర్ మాట్లాడుతూ 'ప్రాథమిక సౌకర్యాలు కూడా కల్పించకుండా మేం ఉత్తమ ప్రదర్శన చేస్తామని ఎలా ఆశిస్తారు? సరైన గౌరవం లేకుండా మేం ప్రయాణించాల్సి వచ్చింది. టాయిలెట్ల దగ్గర దుర్వాసన వచ్చింది. అలాగే ప్రతీ స్టేషన్ వద్ద రైలు ఆగినప్పుడు ప్రయాణీకులు దిగడానికి, ఎక్కడానికి కోసం మేం మా లగేజీలతో సహా కదలాల్సి వచ్చింది. మేం గేమ్స్‌పై సరైన దృష్టి పెట్టలేకపోయాం' అని తెలిపారు. విమర్శలు వెల్లువెత్తుతుండటంతో సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నుంచి పాఠశాల, మాస్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ వివరణ కోరింది.

శివసేన (యుబిటి), ఎంఎన్ఎస్ పొత్తు

ముంబయి : వచ్చే నెలలో జరగనున్న ముంబయి మున్సిపల్ ఎన్నికల్లో కోసం శివసేన(యుబిటి), మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్ఎస్) పొత్తును ప్రకటించాయి. ఈ విషయాన్ని ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే ప్రకటించారు. ప్రస్తుతం పొత్తు ముంబయి ఎన్నికలకు సంబంధించిందని, నాసిక్ ఎన్నికలకు కూడా త్వరలోనే ఇలాంటి ప్రకటన ఉంటుందని చెప్పారు. అయితే రెండు పార్టీల మధ్య సీట్ల పంపకాల గురించి వివరాలను వెల్లడించలేదు. కాగా, వరసకు అన్నదమ్ములైన ఉద్ధవ్ థాకరే, రాజ్ ధాకరేలు కలుసుకోవడం దాదాపు 20 ఏళ్ల తరువాత ఇదే మొదటిసారి. ఈ పార్టీల మధ్య పొత్తు గురించి కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఈ పొత్తు గురించి ఉద్ధవ్ థాకరే మాట్లాడుతూ 'అంతా కలిసి ఉండటానికే మేం ఏకమయ్యాము' అని తెలిపారు. సంజయ్ రౌత్ మాట్లాడుతూ మహారాష్ట్ర చరిత్రలో ఒక చారిత్రాత్మక దినంగా అభివర్ణించారు. ఈ సమావేశానికి ముందు శివాజీ పార్క్‌లోని బాల్ థాకరే స్మారక చిహ్నం వద్ద ఇరు నాయకులు నివాళిలర్పించారు. తరువాత ఒకేవాహనంలో సమావేశానికి చేరుకున్నారు. ఈ పత్రికా సమావేశానికి ఉద్ధవ్ భార్య రష్మి, కుమారుడు ఆదిత్య, రాజ్ భార్య షర్మిల, కుమారుడు అమిత్ కూడా హాజరయ్యారు. జనవరి 15న ముంబయి మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి..

రష్యాలో బాంబు పేలుడు : ముగ్గురు మృతి

మాస్కో : రష్యాలో వరుస కారు బాంబుల పేలుడు ఘటనలు జరుగుతున్నాయి. తాజాగా బుధవారం తెల్లవారుజమున దేశ రాజధాని మాస్కోలో బాంబు పేలింది. ఈ ఘటనలో ఇద్దరు ట్రాఫిక్ పోలీసు అధికారులతో సహా ముగ్గురు మృతి చెందారు. మాస్కో నగరంలోని ఎలెటస్కయ వీధిలో పోలీసు కారు దగ్గర ఇద్దరు పోలీసు అధికారులు అనుమానాస్పద వ్యక్తిని చూసారని, ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు అతని దగ్గరికి పోలీసులు వచ్చినప్పుడు పేలుడు జరిగిందని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఇద్దరు పోలీసులు అధికారులు తీవ్ర గాయాలతో మృతి చెందారు. సమీపంలో నిలబడి ఉన్న మరొక వ్యక్తి కూడా మృతి చెందారు. సోమవారం మాస్కోలో జరిగిన కారు బాంబు దాడిలో సీనియర్ రష్యన్ జనరల్ మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఘటన జరిగిన ప్రదేశానికి సమీపంలోనే మరో పేలుడు జరిగటం గమనార్హం..

బుధవారం జరిగిన పేలుడులో మృతి చెందిన అధికారులను మాస్కో స్టేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరేట్ పోలీసు లెఫ్టినెంట్లు ఇలియా క్లిమనోవ్ (24), మాగ్జిమ్ గోర్బునోవ్ (25)గా అధికారులు గుర్తించారు. వీరు అక్టోబర్ 2023, ఫిబ్రవరి 2022లో పోలీసు దళంలో చేరారు. గోర్బునోవ్‌కు భార్య, తొమ్మిది నెలల కూతురు ఉన్నారు. మృతి చెందిన ఇద్దరు అధికారుల కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని ప్రభుత్వం హామీనిచ్చింది. ఇక మూడో వ్యక్తి అనుమానిత బాంబర్ ఎవరనేది ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తున్నారు. అతని డిఎన్ఎ పరీక్షల ద్వారా ఎవరనేది నిర్ధారించడానికి ఫోరెన్సిక్ నిపుణుల బృందం ప్రయత్నిస్తోంది. అలాగే పేలుడు జరిగిన ప్రాంతానికి సమీపంలో సిసిటివి కెమెరాలు పుటేజిని పరిశీలిస్తున్నారు.అయితే అనుమానితుడ్ని ఉక్రెయిన్ సీక్రెట్ సర్వీసెస్‌తో సంబంధం ఉండొచ్చని రష్యా ప్రభుత్వ శ్రేణులు భావిస్తున్నాయి....

ఎలెటస్కయలో కారు బాంబు పేలిన ప్రాంతం

ట్రంప్‌నకు మరో ఎదురు దెబ్బ

- చికాగోలో సైనిక మోహరింపును అడ్డుకున్న సుప్రీం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు సుప్రీంకోర్టు మరో షాక్ ఇచ్చింది. అక్రమ వలసదారులను ఏరివేసేందుకు చికాగోకు ఇల్లినాయిస్ నేషనల్ గార్డ్ దళాలను పంపాలన్న ట్రంప్ ప్రయత్నాలకు దిగువ కోర్టు ఇప్పటికే అడ్డుకట్ట వేసింది. దీనిని సవాలు చేస్తూ ట్రంప్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా అక్కడ కూడా చుక్కెదురైంది. దిగువ కోర్టు ఆదేశాలను నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

చికాగోలో చట్టాలను అమలు చేసేందుకు సైన్యాన్ని ఎందుకు అనుమతించాలో వివరించడంలో దేశాధ్యక్షుడు విఫలమయ్యారని వ్యాఖ్యానించింది. 6-3 మెజారిటీతో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో...చికాగోకు 300 మంది ఇల్లినాయిస్ నేషనల్ గార్డ్ సభ్యులను పంపేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు అడ్డుకట్టపడింది. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంలో ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లకు సాయపడేందుకు వీరిని పంపాలని ప్రభుత్వం భావించింది.

అక్రమ వలసదారుల ఏరివేత పేరుతో ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో దళాలను మోహరించింది. భవిష్యత్తులో మరికొన్ని రాష్ట్రాలకు కూడా దళాలను పంపాలని అనుకుంటోంది. ఈ చర్యలలోని చట్టబద్ధతను కూడా సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అయితే మరోవైపు, ప్రభుత్వ సిబ్బందికి రక్షణ కల్పించడానికి, ఇమిగ్రేషన్ చట్టాలను అమలు చేయడానికి ట్రంప్ అమలు చేస్తున్న ఎజెండాకు సుప్రీంకోర్టు తీర్పు వ్యతిరేకం కాదని అధ్యక్షభవనం ఒక ప్రకటనలో తెలియజేసింది. కాగా సుప్రీంకోర్టు రూలింగ్‌పై డెమొక్రాట్లు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్రం మార్గదర్శకాల ప్రకారమే...

(మొదటి పేజీ తరువాయి)

బిడ్డర్లు కోరితే అంగీకరించినట్లు ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు.

సంజీవని ప్రాజెక్టుపై సమీక్ష

కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన సంజీవని ప్రాజెక్టు అమలుపైనా అధికారులతో సిఎం చర్చించారు. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును అమలు చేసేలా అధికారులకు పలు సూచనలు చేశారు. కుప్పంలో ఎదురైన అవరోధానలను అధిగమిస్తూ వాటికి పరిష్కారం చూపేలా చిత్తూరు జిల్లాలో అమలు చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ రికార్డులు ఇచ్చేలా రూపొందించిన ఈ ప్రాజెక్టును ఎప్పటికప్పుడు ఆధునీకరించేలా చూసుకుంటూ ముందుకెళ్లాలన్నారు.

గాజా వాసులను వెంటాడుతున్న మృత్యువు

- వైద్య సరఫరాలను అడ్డుకుంటున్న ఇజ్రాయిల్

గాజా : ఇప్పటికే అనేక కష్టాలను ఎదుర్కొంటున్న గాజావాసులను కొత్త ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. వైద్య సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్న గాజా వాసుల విషయంలో ఇజ్రాయిల్ మరింత అమానుషంగా వ్యవహరిస్తోంది. వారిని మృత్యుముఖంలోకి నెడుతోంది. గాజాలో ఆరోగ్య వ్యవస్థ ఇప్పటికే కుదేలయింది. తాజాగా ఇజ్రాయిల్ చర్యలతో ఏ క్షణాన అయినా కుప్పకూలిపోయే ప్రమాదం తలెత్తింది. గాజాలోకి వైద్య పరికరాలు, మందులు ప్రవేశించకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటుండడంతో వేలాది మంది రోగులను మృత్యువు వెంటాడుతోంది. గాజాలోని ఆస్పత్రులలో పరిస్థితి దారుణంగా, భయానకంగా ఉన్నదని ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ మునీర్ అల్-బర్ష్ తెలిపారు. అత్యవసర వైద్య సరఫరాలను ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని, ఫలితంగా కీలక కేసులకు వైద్యులు చికిత్స అందించలేకపోతున్నారని చెప్పారు. అయితే, అత్యవసర మందులు, వైద్య పరికరాలను గాజాలోకి ఇజ్రాయిల్ సైన్యం అనుమతించకపోవడంతో రోగుల ప్రాణాలు కాపాడేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయని గాజా వైద్యులు చాలా కాలంగా చెబుతూనే ఉన్నారు. అక్టోబరులో కాల్పుల విరమణ అమలులోకి వచ్చినప్పటికీ హమాస్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తోంది. వైద్య సహాయక వాహనాలను గాజాలోకి ప్రవేశించనివ్వడం లేదు. దీంతో మందులు, వైద్య సరఫరాల కొరత తీవ్రంగా ఉన్నదని, ముఖ్యంగా శస్త్రచికిత్సలు చేసేందుకు అవసరమైన సామగ్రి అందుబాటులో లేదని వైద్యులు చెబుతున్నారు. దీనికితోడు కరెంటు కష్టాలు, జనరేటర్ల కొరత వెంటాడుతోందని వారు తెలిపారు.

30 సంవత్సరాల క్రితం పాలస్తీనా అథారిటీ ఏర్పడిన తర్వాత ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఎన్నడూ ఎదురవలేదని మునీర్ అల్-బర్ష్ చెప్పారు. రెండు సంవత్సరాలకు పైగా కొనసాగిన యుద్ధంలో దాదాపు గాజా ఆస్పత్రులన్నింటి పైన దాడులు జరిగాయి. ఫలితంగా వైద్య సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. 34 ఆస్పత్రులు సహా 125 ఆరోగ్య కేంద్రాలకు నష్టం వాటిల్లింది. 1,700 మంది ఆరోగ్య కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారు. 95 మంది పాలస్తీనా వైద్యులు, సిబ్బంది ఇజ్రాయిల్ వద్ద బందీలుగా ఉన్నారు. ఇజ్రాయిల్ దాడులలో గాయపడిన వేలాది మంది బాధితులు విదేశాలలో చికిత్స పొందేందుకు అనుమతి కోసం నిరీక్షిస్తున్నారు. చికిత్స అందకపోవడంతో సుమారు నాలుగు వేల మంది గ్లుకోమా రోగులు శాశ్వతంగా కంటిచూపును కోల్పోయే ప్రమాదం తలెత్తింది. విదేశాలలో చికిత్స కోసం అనుమతి పొందేందుకు దరఖాస్తు చేసుకున్న 1,156 మంది రోగులు అది రాకముందే ప్రాణాలు కోల్పోయారు. అలాగే, గూడును కోల్పోయి తాత్కాలిక శిబిరాలలో తలదాచుకుంటున్న 40 వేల మంది గర్భిణుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఐదు సంవత్సరాల లోపు వయసున్న మూడు లక్షల మందికి పైగా పిల్లలు పోషకాహారలోపంతో బాధపడుతున్నారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం

- తొమ్మిది మంది మృతి

కడల్లూరు : తమిళనాడులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. కడల్లూరు జిల్లాలోని తిట్టకుడి సమీపంలోని రామనాథం గ్రామంలో ప్రమాదం జరిగింది. తిరుచిరాపల్లి నుంచి చెన్నైకు జాతీయరహదారిపై వెళుతున్న తమిళనాడు ఆర్‌టిసి బస్సు టైరు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఒక్కసారిగా పేలిపోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. టైరు పేలిపోవడంతో అదపు తప్పిన బస్సు జాతీయ రహదారికి అవతలి వైపునకు దూసుకునివెళ్లి ఎదురుగా వస్తున్న రెండు కార్లను ఢీకొంది. దీంతో రెండు కార్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు, సహాయ బృందాలు తక్షణ చర్యలను ప్రారంభించాయి. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాయి.

కేరళలో వలస కార్మికుడి హత్యను ఖండించిన ఎఐకెఎస్

- విద్వేష రాజకీయాలను వ్యతిరేకించాలని పిలుపు

న్యూఢిల్లీ : చత్తీస్‌ఘడ్‌కు చెందిన రామ్ నారాయణ్ బాఘెల్ అనే వలస కార్మికుడిని కేరళలోని పాలక్కాడ్‌లో అమానవీయంగా హత్యచేయడాన్ని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) తీవ్రంగా ఖండించింది. ఆ వలస కార్మికుడిని అక్రమ బంగ్లాదేశీగా పేర్కొంటూ ఆర్ఎస్ఎస్-బిజెపి గూండాల నేతృత్వంలోనే ఈ దాడి జరిగిందని స్పష్టమైందని ఎఐకెఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ ధావలె, విజూకృష్ణన్‌లు విమర్శించారు. ఈ మేరకు వారు బుదవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వంత రాష్ట్రంలో తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం, అక్కడ డబుల్ ఇంజన్ బిజెపి ప్రభుత్వ వైఫల్యం వల్లనే బాఘెల్ పని వెతుకుంటూ కేరళకు రావాలి వచ్చిందని వారు విమర్శించారు. ఈ హత్యకు కారకులైన వారిని అరెస్టు చేసేందుకు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుందని తెలిపారు. అలాగే బాధిత కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారాన్ని కూడా అందచేసిందన్నారు. మోడీ ప్రభుత్వం కూడా కోటి రూపాయిలు నష్టపరిహారాన్ని ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ దాడికి పాల్పడిన వారు బిజెపి, ఆర్ఎస్ఎస్ మద్దతుదారులని, వారిపై అనేక కేసులు నమోదయ్యాయన్నారు. మతోన్మాదంతో చీలికలు సృష్టించడం ద్వారా ఎన్నికల ప్రయోజనాల కోసం బంగ్లాదేశీ చొరబాటుదారులంటూ మోడీ సర్కార్ సాగించిన విద్వేష ప్రచారమే ఈ పరిస్థితులకు దారి తీసిందని వారు విమర్శించారు. బిజెపి, సంఘ పరివార్‌లు సాగించే ఈ విద్వేష రాజకీయాలు, మతోన్మాద విభజనలకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజా, వర్గ ఉద్యమాలకు ఎఐకెఎస్ పిలుపునిచ్చింది.

అమెరికాలో 30 మంది భారతీయుల అరెస్టు

కాలిఫోర్నియా : అమెరికాలోని కాలిఫోర్నియాలో 30 మంది భారతీయుల్ని అరెస్టు చేశారు. ఇమిగ్రేషన్ చెక్ పోస్టుల వద్ద జరిగిన తనిఖీల్లో మొత్తంగా 49 మంది తగిన ప్రతాలు లేని వలసదారులు అరెస్టయ్యారు. వీరిలో 30 మంది భారతీయలు ఉన్నారు. వీరిని బోర్డర్ పెట్రోల్ ఏజెంట్లు అరెస్టు చేసినట్లు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సిబిపి) వెల్లడించింది. సరైన ప్రతాలు లేని వలసదారుల్లో కొందరు కమర్షియల్ ట్రక్ డ్రైవింగ్ లైసెన్స్‌లతో సెమీ ట్రక్కులను నడుపుతుండగా.. మరికొందరు అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

అమెరికాలో ఇటీవల సెమీ ట్రక్కుల కారణంగా జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోవడంతో అక్కడి ప్రభుత్వం విదేశీ ట్రక్కు డ్రైవర్లకు వర్క్ వీసాలు, కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీని ఇప్పటికే నిలిపివేసింది. ఈ క్రమంలో కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌లతో సెమీ ట్రక్కులను నడుపుతున్న వారిపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా నవంబర్ 23 నుంచి డిసెంబర్ 12 మధ్య బోర్డర్ ప్రొటెక్షన్ ఏజెంట్లు నిర్వహించిన ఆపరేషన్‌లో ట్రక్కులు నడుపుతున్న 42 మంది వలసదారులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో 30 మంది భారత్‌కు చెందిన వారు కాగా.. మిగిలిన వారంతా చైనా, మెక్సికో, రష్యా, తుర్కియే తదితర దేశస్థులని అధికారులు పేర్కొన్నారు. కాలిఫోర్నియాలో చేపట్టిన ఆపరేషన్ 'హైవే సెంటినెల్'లో మరో ఏడుగురు వలసదారులను అరెస్టు చేసినట్లు తెలిపారు. అమెరికా రహదారులను రక్షించడం, వాణిజ్య రవాణా రంగంలో నిబంధనలను సమర్థవంతంగా ఆమలు చేయడం లక్ష్యంగా ఈ ఆపరేషన్ యొక్క ఉద్దేశ్యమని సిబిపి ఒక ప్రకటనలో తెలిపింది. అరెస్టయిన వ్యక్తులు ఇక ఎప్పుడూ సెమీట్రక్కులను నడపకూడదంటూ అదేశాలు జారీ చేసింది.

హెచ్-1బి వీసాల జారీలో మార్పులు

- లాటరీలకు చెల్లుచీటీ
- నైపుణ్యం, వేతన ఆధారిత ఎంపిక

వాషింగ్టన్ : హెచ్-1బి వీసా కార్యక్రమంలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రధానమైన మార్పులు చేసింది. రాండమ్ లాటరీ పద్ధతికి స్వస్తి చెప్పి నూతన ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియలో అధిక నైపుణ్యం కలిగిన, ఎక్కువ వేతనం పొందుతున్న ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తారు. కొత్త నిబంధనలు వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 27న అమలులోకి వస్తాయి. ఇవి 2027 ఆర్థిక సంవత్సరపు హెచ్-1బి వీసా పరిమితి రిజిస్ట్రేషన్ సీజన్‌కు వర్తిస్తాయి. అమెరికా ఉద్యోగుల వేతనాలు, పని పరిస్థితులు, ఉద్యోగ అవకాశాలను పరిరక్షించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ శాఖ తెలిపింది. ఈ నిర్ణయంతో భారతీయ నిపుణులపై ప్రభావం పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. అమెరికాలో హెచ్-1బి వీసాలు కలిగిన వారిలో భారతీయుల సంఖ్య భారీగా ఉంటుందన్న సంగతి తెలిసిందే. అధిక నైపుణ్యం కలిగిన, ఎక్కువ వేతనాలు పొందుతున్న వారికి ప్రాధాన్యత ఇవ్వడానికి వీసా నిబంధనలను సవరించడం జరిగిందని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ శాఖ వివరించింది. ప్రస్తుతం అమలులో ఉన్న లాటరీ పద్ధతిని కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, స్వదేశానికి చెందిన ఉద్యోగులతో పోలిస్తే తక్కువ వేతనాలతో విదేశీ ఉద్యోగులను నియమించుకుంటున్నాయని యూఎస్ సిటిజన్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ప్రతినిధి మాథ్యూ ట్రజెస్సర్ తెలిపారు. కాగా హెచ్-1బి వీసాలపై ప్రస్తుతం అమలులో ఉన్న వార్షిక పరిమితి (65,000)లో ఎలాంటి మార్పు ఉండదు. అమెరికా సంస్థల నుంచి అదనపు డిగ్రీలు పొందిన దరఖాస్తుదారులకు మరో 20,000 వీసాలు ఇస్తున్నారు.

హెచ్-1బి వీసా ఫీజు పెంపును సమర్థించిన జడ్జి

నూతన హెచ్-1బి వీసా దరఖాస్తు ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని వాషింగ్టన్ డిసిలోని జిల్లా జడ్జి బెరిల్ హోవెల్ సమర్థించారు. అది విధానపరమైన నిర్ణయమని, వలసలను నియంత్రించేందుకు తనకున్న అధికారాలను ట్రంప్ వినియోగించుకున్నారని తెలిపారు. ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అమెరికాకు చెందిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఆయన తోసిపుచ్చారు. ట్రంప్ పెంచిన ఫీజు ఇమ్మిగ్రేషన్ చట్టానికి విరుద్ధంగా ఉన్నదని, దీనివల్ల అనేక కంపెనీలు, ఆస్పత్రులు, ఇతర యాజమాన్య సంస్థలు ఉద్యోగాలు, సేవల్లో కోత పెడతాయని పిటిషనర్ వాదించారు. వివిధ దేశాలకు చెందిన నిపుణులను ఆకర్షించేందుకు హెచ్-1బి వీసా కార్యక్రమం అమెరికాకు ఉపకరిస్తున్న విషయం తెలిసిందే. అమెజాన్, టిసీయస్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, గూగుల్ వంటి ప్రముఖ సంస్థలలో హెచ్-1బి వీసాదారులు పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నారు.

రూ.12,015 కోట్లతో ఢిల్లీ మెట్రో విస్తరణ

- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మెట్రో రైలు విస్తరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం కేంద్ర మంత్రి వర్గం సమావేశమయింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ ఢిల్లీ మెట్రో ఫేజ్ 5 (ఎ) విస్తరణకు ఆమోదం తెలిపిందని, ఇందుకోసం రూ.12,015 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 13 కొత్త స్టేషన్లను కలుపుతూ 16 కిలోమీటర్ల మేరకు ఈ విస్తరణ పనులు చేపడతామన్నారు. దీంతో రాబోయే మూడేళ్లలో ఈ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ 400 కిలోమీటర్ల మార్క్‌ను చేరనుందని పేర్కొన్నారు. ఫేజ్ 5 (ఎ)లో భాగంగా 16 కిలోమీటర్ల మేర మూడు నూతన కారిడార్లను ఢిల్లీ మెట్రో కార్పొరేషన్ (డిఎంఆర్‌సి) నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో 33,000 టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చని, రాబోయే మూడేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని అంచనా వేస్తున్నామని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద అర్బన్ రైల్ నెట్‌వర్క్‌గా నిలుస్తుందని చెప్పారు.

నిషేధం ఉన్నా 'బర్లీ' సాగుకు మొగ్గు

- టాస్క్‌ఫోర్సు దాడులను వెరువని పొగాకు రైతులు
- తెల్లబర్లీకి కంపెనీల బాండ్లు?

బర్లీ పొగాకు సాగును అడ్డుకుంటున్న టాస్క్‌ఫోర్సు బృందలు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రైతులకు చేయూత ఇవ్వాల్సిన ప్రభుత్వమే పంటల సాగుపై నిషేధాజ్ఞలు విధిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వులను కాదని సాగు చేస్తే ఈ పైర్లను అధికారులు ధ్వంసం చేసే వరకు వెళ్తోంది. రైతుల నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో అధికారులు వెనక్కి తగ్గారు. తాము నిషేధించిన బర్లీ పొగాకును సాగు చేయవద్దంటూ యంత్రాలతో ధ్వంసం చేసినా రైతులు వెనుకంజ వేయకుండా ఈ ఏడాది కూడా నల్లబర్లీ, తెల్లబర్లీ సాగుకు ఉద్యుక్తులయ్యారు. తాము సాగు చేసిన పంటల్లో ప్రభుత్వం కొన్నింటినే కొనుగోలు చేస్తోందని, అదీకూడా పరిమితంగానే కొంటోందని, అలాంటప్పుడు తాము ఏ పంట వేసుకోవాలో ప్రభుత్వం ఎలా నిర్దేశిస్తుందని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది బర్లీ పొగాకును నిషేధిస్తూ ప్రభుత్వం ఇటీవల జిఒ నెంబరు 740 జారీ చేసింది. అయినా, గుంటూరు జిల్లా పెదనందిపాడు, ప్రత్తిపాడు మండలాల్లో రైతులు బర్లీ పొగాకు వేశారు. అధికారులు వెళ్లి ఆ పైర్లను ధ్వంసం చేశారు. నాటుతున్న పొగాకు మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. పెదనందిపాడు మండలంలో వరగాని, గోగులమూడి గ్రామాల్లో నల్లబర్లీ పొగాకు నాటుతుండగా రెవెన్యూ, పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన కూడిన టాస్క్‌ఫోర్సు బృందం రైతుల నుంచి మొక్కలను స్వాధీనం చేసుకుంది. జిఒను అతిక్రమించి నల్లబర్లీ పొగాకు సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తెల్లబర్లీ పొగాకు వేసుకుంటే కచ్చితంగా బాండ్ చూపించి నాటుకోవాలని తహశీల్దార్ హేమ ప్రియ రైతులకు తేల్చి చెప్పారు. రైతులందరూ ప్రభుత్వానికి సహకరించి నల్లబర్లీ సాగును మానుకొని ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, శనగ వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం సూచించారు.

జిఒ నంబర్ 740ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి ఎం పద్మావతి హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. నల్లబర్లీ పొగాకు సాగు చేస్తున్న వారి పేర్లను టాస్క్‌ఫోర్సు బృందానికి పంపేందుకు గ్రామ స్థాయి అధికారులతో నిఘా బృందాలను ఏర్పాటు చేశారు. అయినా, కొంతమంది రైతులు నల్లబర్లీ, తెల్లబర్లీ పొగాకు సాగుకు సిద్ధమయ్యారు.

గత ఏడాది జరిగిన సాగులో ఈ ఏడాది ఇప్పటి వరకు పది శాతం వరకు జరిగినట్టు చెబుతున్నారు. ఎంత విస్తీర్ణంలో సాగు అయిందో తాము నమోదు చేయడం లేదని అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన పంటను నమోదు చేయాల్సిన అవసరం లేదంటున్నారు. గుంటూరు జిల్లాలో గత సీజన్‌లో 14,390 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశారు. 1.50 లక్షల టన్నులు పొగాకు ఉత్పత్తి అయినట్టు అంచనా. 3,280 మంది రైతులు ప్రైవేటు వ్యాపారులకు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోగా, ఇంకా 40 వేల టన్నుల పొగాకు రైతుల వద్ద నిల్వ ఉంది. గత ఏడాది ప్రభుత్వం రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు మొత్తం కొంటామని చెప్పినా పరిమితంగానే కొనుగోలు చేసింది. ఈ పరిస్థితుల్లో రాబోయే సీజన్‌లో తమకు మంచి ధరలు వస్తాయన్న ఆశతో కొద్దిమంది రైతులు బర్లీ పొగాకు సాగుకు సిద్ధమయ్యాయి. తెల్లబర్లీ పొగాకు కొనుగోలుకు కొంతమంది రైతులకు పొగాకు కంపెనీల వారు బాండ్లు ఇచ్చినట్లు తెలిసింది. నల్లబర్లీకి ఇంకా కంపెనీలు బాండ్లు ఇవ్వలేదని చెబుతున్నారు.

రైతులకు శుభవార్త

వ్యవసాయ శాఖ, సహకార శాఖ మరియు రైతు సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వ ఆదేశంS.O.2900 (E), తేది: 24-10-2015 ప్రకారం, మేము క్రింది 100% వాటర్ సాల్యూబుల్ మిశ్రమ ఎరువులను ద్రవ మరియు పొడి గ్రాన్యులర్ రూపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో విక్రయించడానికి సిద్ధంగా ఉన్నాము.

ఎరువుల జాబితా

Sl.No.	Type of Fertilizers	Nutrient percent
1	N:P:K	19:19:19
2	N:P:K	20:20:20
3	N:P:K	13:40:13
4	N:P:K	00:52:34
5	N:P:K	28:28:00

ఈ ఎరువులు పంటల అభివృద్ధికి మరియు దిగుబడులు పెరగడానికి రైతులకు సహాయపడతాయి.

Manufactured and Marketed By:
M/s INNOVATIVE NUTRIENT RESEARCH LABORATORIES Pvt. Ltd.
Sale point in Andhra Pradesh at D.No.103-64/3, Etkur, Revenue Ward-60, GUNTUR - 522017
Email: inrlpvtltd@gmail.com Mobile: 8500580562

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

MANAPPURAM HOME FINANCE LTD.
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్ : U65923K12010PIC039179 యూనిట్ నం.301- 315, 3వ అంతస్తు, ఎ వింగ్, కనకియ వాల్ స్ట్రీట్, అందేరి-కుర్ల రోడ్, అందేరి తూర్పు, ముంబై-400093.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు అయిన మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("యంఎహెచ్ఎఫ్ఐయన్") అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9 తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ రుణగ్రహీతలను మరియు సహ-రుణగ్రహీతలను పిలుస్తు నోటీసులో పేర్కొన్న మొత్తం సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా మొత్తాన్ని చెల్లించవలసిందిగా డిమాండ్ నోటీసు జారీచేయబడింది. రుణగ్రహీత మొత్తాన్ని చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్ లోని రూల్ 9 తో చదువుతూ సదరు చట్టం లోని సెక్షన్ 13 (4) క్రింద అతను/ఆమెకి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారుడు ఇందులో దిగువ వివరించిన ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమైనది. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదని జరిపే ఏవేని లావాదేవీలు మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు లోబడి ఉంటాయని తెలియపరుచుచున్నాము.

క్ర. సం	రుణగ్రహీత మరియు సహా-రుణగ్రహీతల పేరు/ లోన్ అకౌంట్ నం./ శాఖ	సృష్టించబడిన వడ్డీ విషయంలో సెక్యుర్డ్ అస్సెట్ వివరణ	డిమాండ్ నోటీసు పంపిన తేది మరియు మొత్తం బకాయి	స్వాధీనతా తేది
1	వాసం సుష్మ, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, బొల్లిపోగు కొండలరావు/ NHL00310010264 / విజయవాడ	పిన్-521227, ఎన్‌టిఆర్ జిల్లా, తిరువూరు సబ్ రిజిస్ట్రీ, ఎ కొండూరు మండలం, పోలిశెట్టిపాడు గ్రామం, ఆర్.ఎస్. నెం. 106/1బి, ఇంటి నెం. 5-85, మూల్యాంకనం నం. 485, నివాస స్థలం 121 చ.గ.లు., దానిలో కలిగి ఉన్న ఆర్.సి.సి డాబా, ఉన్న హద్దులు : తూర్పు : జొన్నలగడ్డ భాస్కరరావు ఇల్లు మరియు సైట్, పడమర : రోడ్డు, దక్షిణం: సిసి రోడ్డు, ఉత్తరం : జొన్నలగడ్డ లాజరు ఇల్లు మరియు సైట్.	02-09-2025 & Rs.495434/-	22-12-2025
2	షేక్ రాఫియా, షేక్ ఉమర్ వలి/ MHL00310047046/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్, పిన్-521235, ఎన్.టి.ఆర్ జిల్లా, తిరువూరు సబ్ రిజిస్ట్రీ, తిరువూరు మండలం, తిరువూరు నగర పంచాయితీ, పాత తిరువూరు, ఆర్.ఎస్.నం.185/1, డో.నం.8-164/1, మూల్యాంకనం నం.1146001009, పరిధి 60.5 చ.గ.లు. రెసిడెన్షియల్ సైట్ కలిగి ఉన్న ఆర్‌సిసి డాబా. తూర్పు : షేక్.జైనులబుద్దీన్ ఇల్లు మరియు సైట్, పడమర : సిమెంటు రోడ్డు, దక్షిణం: సిమెంటు రోడ్డు, ఉత్తరం: షేక్ హుస్సేన్ ఇల్లు మరియు సైట్.	08-09-2025 & Rs.487965/-	22-12-2025
3	కొచెర్ల బాబూరావు, కొచర్ల శోభారాణి/ NLAP0031007640/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్-521235, కృష్ణా జిల్లా, తిరువూరు సబ్ రిజిస్ట్రీ, తిరువూరు మండలం, తిరువూరు నగర పంచాయితీ ప్రాంతం, రాజుపేట గ్రామం, ఆర్.ఎస్.నం.127/6, డో.నం.15-371, మూల్యాంకనం నం.1146006016, పరిధి 193.6 చ.గ.లు. తూర్పు: డొంక, పడమర : పెరుమాళ్ల తిరుపతయ్య మరియు ఇతరుల ఇల్లు, దక్షిణం : డొంక, ఉత్తరం : కొచ్చర్ల బాబు ఇల్లు.	11-09-2025 & Rs.413045/-	22-12-2025
4	పులివర్తి ఝాన్సీరాణి, పులవర్తి బాలరాజు/ MHL00310012416/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పిన్-521230, ఎన్‌టిఆర్ జిల్లా, మైలవరం సబ్ రిజిస్ట్రీ మైలవరం మండలం పుల్లూరు గ్రామ పంచాయితీ ప్రాంతం పుల్లూరు గ్రామం, ఆర్.ఎస్.నం.865/8 మూల్యాంకనం నం.1788, డో.నం.9-16ఎ రెసిడెన్షియల్ సైట్ పరిధి 103.4 చ.గ.లు. ఆర్‌సిసి డాబా ఇల్లు. తూర్పు : పులివర్తి అశోక్ కుమార్ ఆస్తి, పడమర : పంచాయతీ రోడ్డు, దక్షిణం : పాకలపాటి కిరణ్ ఇల్లు, ఉత్తరం : కొత్త శ్రీహరి ఇల్లు.	12-09-2025 & Rs.488068/-	22-12-2025

ప్రదేశం : కృష్ణ, తేది : 25.12.2025 సం/- అధీకృత అధికారి , మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్

IDFC FIRST Bank
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)
సిఐఎన్ : L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం : కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హర్రింగ్‌టన్ రోడ్, చెట్‌పట్, చెన్నై-600031.
టెలి: +91 44 4564 4000 ఫ్యాక్స్: +91 44 4564 4022.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు

ఏదైతే, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ **(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)** నుంచి దిగువ తెలిపిన రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు దిగువ తెలియపరిచిన సెక్యూర్డ్ లోన్స్‌ను తీసుకొని ఉన్నారు. రుణగ్రహీతలు మరియు సహ రుణగ్రహీతలు వారు వారి యొక్క ఆస్తులను తనఖా పెట్టి లోన్‌ను తీసుకున్నారు. వారు వారి యొక్క లోన్ అగ్రిమెంట ప్రకారం ఉన్న నియమాలు మరియు నిభందనలు పాటించడంలో విఫలమైనారు మరియు వారి యొక్క లోన్‌ను ఆర్‌బిఐ గైడ్ లైన్స్ ప్రకారం ఎన్‌పిఏ లుగా వర్గీకరించబడినాయి. వారు సదరు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)** బ్యాంకు వారికి బకాయి ఉన్న మొత్తంను నోటీసులో జారీ చేయబడిన విధంగా దిగువ టేబుల్‌లో వివరింపబడ్డాయి మరియు బకాయిల మీద తదుపరి వడ్డీ కూడా ఉంటుంది మరియు అదే కాంట్రాక్టువల్ రేటు ప్రకారం తెలిపిన తేదీలలో ఆమోదించబడతాయి.

క్ర సం	లోను అకౌంట్ నెం	లోను రకం	రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతల పేరు	సెక్షన్ 13(2) నోటీసు తేది	సెక్షన్ 13(2) నోటీసు ప్రకారం బకాయి మొత్తం
1	10866835	హోమ్ ఫైనాన్స్ ఎల్ఎపి	1. దారపు వరప్రసాద్, 2. స్నేహ మొబైల్స్ అండ్ గిఫ్ట్ ఆర్టికల్స్, 3. సుష్మ దారపు	08.11.2025	INR 14,09,820.49/-

ఆస్తి చిరునామా : ఆంధ్రప్రదేశ్-522503, గుంటూరు జిల్లా, మంగళగిరి, డో.నం.229, డో.నం.5-178/బి2 వద్ద, ప్లాట్ నం. వార్డు నం.5 లో సైట్ మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ పరిధి 121 చ.గ.లు. (101.64 చ.మీ.లు.) మరియు **హద్దులు :** తూర్పు : అక్కల సుజాత ఆస్తి- 33 అ.లు., పడమర : పట్టెం రాజేశ్వరరావు ఆస్తి-33 అ.లు., ఉత్తరం : బండారు శైలజ ఆస్తి-33 అ.లు., దక్షిణం : బజారు-33 అ.లు

మీకు తెలియజేయవలసినది ఏమనగా **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)** కు బకాయిలను చెల్లిచవలసిందిగా మరియు టేబుల్ లో చూపించిన దాని ప్రకారం కాంట్రాక్టువల్ రేటు ప్రకారం దాని యొక్క తేదీలతో పాటుగా ఇతర ఖర్చులు, చార్జీలు మరియు ఇతరమైనవి ఈ నోటీసు ప్రచురించిన 60 రోజులలోగా చెల్లించవలెను., ఒకవేళ మీరు గనుక చెల్లించడంలో విఫలమైతే, దిగువసంతకాదారు SARFAESI చట్టం యొక్క సెక్షన్ 14 మరియు సెక్షన్ 13(4) ప్రకారం **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)** బ్యాంకు వారు వారి యొక్క ప్రక్రియ మొదలుపెడతారు. కనుక మీరు సెక్షన్ 13(13) ప్రకారం మీరు మీ యొక్క సెక్యూర్డ్ ఆస్తులను అమ్మడం/లీసు కు ఇవ్వడం గానీ లేదా ఇతర పనులు చేయదానికి మీకు అనుమతి లేదు.

సం/-
అధికృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)
తేది : 25.12.2025
ప్రదేశం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

MANAPPURAM HOME FINANCE LTD.
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్ : U65923K12010PIC039179, యూనిట్ నం.301 నుండి 315, ఎ వింగ్, కనకియ వాల్ స్ట్రీట్, అందేరి-కుర్ల రోడ్, అందేరి తూర్పు, ముంబై- 400093.

డిమాండ్ నోటీసు

ఏదైతే, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై "ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్"గా పిలువబడుతుంది) యొక్క అధీకృత అధికారి IV/470A (పాతది)W/638A (కొత్తది) మణప్పురం హౌస్ వలపడ్ త్రిస్సూర్, కేరళ 680567 మా నమోదిత కార్యాలయం ఉంది మరియు వివిధ ప్రదేశాలలో దీని శాఖా కార్యాలయాలు ఉన్నాయి, కంపెనీల యాక్ట్ 1956 క్రింద నమోదు చేయబడిన కంపెనీ మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (ఇకపై యాక్ట్ గా సూచించబడుతుంది) యొక్క సెక్షన్ 2 యొక్క సబ్ సెక్షన్ (1) యొక్క క్లాజ్ (ఎమ్) యొక్క సబ్ క్లాజ్ (4) అర్థం ఆర్థిక సంస్థ నం.ఎన్.ఓ.3466 (ఇ)తో చదువుతూ నిర్మాణం మరియు / లేదా నివాస యూనిట్ కొనుగోలు కోసం అడ్వాన్సింగ్ లోన్ వ్యాపారాన్ని నిర్వహిస్తోంది మరియు దిగువ కాలమ్ నం. 2లో పేర్కొన్న విధంగా రుణగ్రహీత / సహ రుణగ్రహీతలు ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ నుండి రుణం పొందినట్లు పేర్కొన్న చార్ట్ తేది 18 డిసెంబర్, 2015న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ ద్వారా జారీ చేయబడింది మరియు ఏదైతే సెక్యూర్డ్ క్రెడిటార్ గా ఉన్న ఎమ్ఎహెచ్ఓఎఫ్ఎన్ సర్ఫేసి యాక్ట్ క్రింద, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 2తో చదువుతూ సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తంతో పాటు దానిపై తదుపరి వడ్డీతో చెల్లించమని రుణగ్రహీత/సహ రుణగ్రహీతలను పిలుస్తూ డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. అయితే వివిధ కారణాల వల్ల కొందరికి నోటీసులు అందజేయలేదు. దానితో పాటు క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల సమాచారం యొక్క ప్రయోజనాల కొరకు ఈ పబ్లిక్ నోటీసు ద్వారా పేర్కొన్న రుణగ్రహీతలకు తెలియజేయబడుతోంది.

క్ర సం	రుణగ్రహీత/సహా-రుణగ్రహీతల పేరు/ఎల్ఎఎన్/శాఖ	సృష్టించబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	ఎన్‌పిఎ తేది	నోటీసు పంపిన తేది మరియు బకాయి మొత్తం
1	పాల రవి బాబు, పాల సుదర్శిని, పాల మహేష్/ NLAP0031007010/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్, పిన్-521151, కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, వనకురు గ్రామ పంచాయితీ ప్రాంతం, వనకురు గ్రామం, ఆర్.ఎస్.నం.428, డో.నం.8-102, మూల్యాంకనం నం.1204 పరిధి 116.6 చ.గ.లు., తూర్పు : పంచాయితీ రోడ్డు, పడమర : రామవరపు పాప ఆస్తి, దక్షిణం : పాల సర్వేశ్వరరావు ఆస్తి, ఉత్తరం: పంచాయితీ రోడ్డు.	18-11-2025	27-11-2025 & Rs.855577/-
2	ముళ్లపూడి మార్తమ్మ, ముళ్లపూడి ప్రసాద్, ముళ్లపూడి సురేష్/ MHL00310013335/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్, పిన్-521201, ఏలూరు జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రీ, నూజివీడు మండలం ముక్కొల్లుపాడు గ్రామ పంచాయితీ ప్రాంతం, ముక్కొల్లుపాడు గ్రామం, ఆర్.ఎస్.నం.77, డో.నం.3-195, మూల్యాంకనం నం.595 పరిధి 290.4 చ.గ.లు. తూర్పు : రోడ్డు, పడమర : గుడ్డేటి నాగేశ్వరరావు ఇల్లు, దక్షిణం: రోడ్డు, ఉత్తరం : ముళ్లపూడి బాబూరావు ఇల్లు.	19-11-2025	27-11-2025 & Rs.507712/-
3	వల్లూరు రమేష్, వల్లూరు సంతోష్ కుమారి, వల్లూరు ప్రవీణ్, బండరపల్లి రమేష్/ NLAP0031012882/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్, పిన్-521163, కృష్ణాజిల్లా, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రీ, తోట్లవల్లూరు మండలం, తోట్లవల్లూరు గ్రామ పంచాయితీ ప్రాంతం, ఉత్తర వల్లూరు, ఉత్తర వల్లూరు, ఆర్.ఎస్.నం.170/7, డో.నం.4-500, మూల్యాంకనం నం.604 పరిధి 174 చ.గ.లు. తూర్పు : వల్లూరు సుధీర్ ఆస్తి, పడమర : బజారు, దక్షిణం : వల్లూరు డానియేల్ ఆస్తి, ఉత్తరం : వల్లూరు రమేష్ ఆస్తి.	21-11-2025	28-11-2025 & Rs.1030645/-
4	కంబాల లక్ష్మీ తిరుపతమ్మ, కంబాల కోటేశ్వరరావు/ NHL00310013035/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్, పిన్-521235, ఎన్.టి.ఆర్.జిల్లా, తిరువూరు సబ్ రిజిస్ట్రీ తిరువూరు మండలం, తిరువూరు నగర పంచాయితీ ప్రాంతం, నడిం తిరువూరు రెవెన్యూ గ్రామం, ఆర్.ఎస్.నం.112/1, డో.నం.9-366-1, మూల్యాంకనం నం.1146008217, రెసిడెన్షియల్ సైట్ పరిధి 121 చ.గ.లు. తూర్పు : నగర పంచాయితీ రోడ్డు, పడమర : వెల్లంకి సురేంద్రబాబు గారు మొదలైనవారి సైట్, దక్షిణం : వెల్లంకి సురేంద్రబాబు గారు మొదలైనివారి సైట్, ఉత్తరం : కిన్నెర తిరుపతమ్మ ఇల్లు, సైట్.	21-11-2025	28-11-2025 & Rs.513895/-
5	జుజ్జువరపు రాజ, జుజ్జువరపు శ్రావణి, కలపాల నాగబాబు/ NHL00310019725/ విజయవాడ	ఆర్.ఎస్.నం.209/1, డో.నం.2-60, మూల్యాంకనం నం.260, పరిధి 121 చ.గ.లు. సుంకొల్లు గ్రామం మరియు పంచాయితీ, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్-521201. తూర్పు : పంచాయితీ రోడ్డు, పడమర : పంచాయితీ రోడ్డు, దక్షిణం: కమ్యూనిటీ హాల్, ఉత్తరం : సీలం నాగరాజు ఇంటి సైట్.	21-11-2025	28-11-2025 & Rs.955751/-

గమనిక, ఈ నోటీసును ప్రచురించిన 60 రోజులలోపు సంబంధిత రుణగ్రహీత / సహ-రుణగ్రహీతకు వ్యతిరేకంగా ఇక్కడ చూపిన మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా వారిని పిలుస్తూ పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వడమైనది. సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత తదుపరి వడ్డీతో పాటు మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, పైన వివరించిన విధంగా చట్టం మరియు ఇక్కడ రూపొందించిన నియమాల క్రింద సూచించబడిన ఇతర పద్ధతులలో నోటీసు సర్వీస్ కొరకు ఆస్తులపై సెక్యూరిటీ ఇంట్రస్ట్ అమలు చేయడం కోసం ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ సెక్షన్ 13(4) ని తీసుకోవలసి ఉంటుంది. సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(8) లో వివరించిన విధంగా విక్రయం, బహిరంగ వేలం లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా బదిలీ చేయడానికి నోటీసును ప్రచురించే తేదీకి ముందు ఏ సమయంలోనైనా ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ ద్వారా అయ్యే ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు చెల్లించాల్సిన మొత్తం మొత్తాన్ని చెల్లించిన తర్వాత పేర్కొన్న తనఖా రీడీమ్ చేయబడుతుందని మీరు గమనించాలి.
సర్ఫేసి యాక్ట్ యొక్క సెక్షన్ 13 (13) ప్రకారం, మీరు సెక్యూర్డ్ అసెట్స్‌ను ఏ పద్ధతిలోనైనా అమ్మకం, లీజు లేదా మరే ఇతర పద్ధతిలో బదిలీ చేయకుండా మరియు/లేదా వ్యవహరించకుండా నిరోధించబడ్డారని గుర్తుంచుకోగలరు.

తేది : 25.12.2025, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

కొనకంచి బ్రాంచి
కొనకంచి రోడ్డు, పెనుగంచిప్రోలు మండలం, ఎన్.టి.ఆర్ జిల్లా, ఏపి-521178.

ఈ వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 & 9 నిబంధనతో పాటు చదవబడిన సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 కింద స్థిరాస్తుల అమ్మకానికి ఈ-వేలం అమ్మకపు నోటీసు.

ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **కొనకంచి బ్రాంచి** కు తనఖా/ఛార్జ్ చేయబడిన, దిగువ వివరించబడిన స్థిరాస్తులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి నిర్మాణాత్మకంగా/భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. దిగువ స్థిరాస్తులను ఈ-వేలం అమ్మకం **"ఎక్కడ ఏది ఉన్నదో, అది ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి రావలసిన దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఖర్చులు/ ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారిచే ఈ-వేలం అమ్మకం ద్వారా **ది.09-01-2026**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది: ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు.

ఈ వేలం తేది మరియు సమయం: 09-01-2026, మ॥ 12.00 గం. నుండి సా॥ 05.00 గం. వరకు (10 ని॥ల అపరిమిత స్వీయ పొడిగింపులతో)

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: ఋణగ్రహీత: శ్రీ అంగడాల నరసింహారావు, తండ్రి: అంగడాల దశరధరామయ్య, హెచ్.నెం: 5-940, ఆర్.ఎస్.నెం. 364/2, యాదవ బజార్, నవాబుపేట, పెనుగంచిప్రోలు మండలం, ఎన్.టి.ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్-521185. **హామీదారు: శ్రీ మర్రి కొండలరావు,** తండ్రి: వలరాజు, హెచ్.నెం. 3-91, 09వ వార్డు, నవాబుపేట, పెనుగంచిప్రోలు మండలం, ఎన్.టి.ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్-521178.

గుడివాడ మున్సిపాలిటీ, సత్యనారాయణపురం, ఆర్.ఎస్. నెం. 134/2 లోని డి. నెం. 16/141-1, 16/142, అసెస్‌మెంట్ నెం. 1526720261 (పాతది), క్రొత్త అసెస్‌మెంట్ నెం. 10680161513 లో గల మొత్తం 783.1/2 చదరపు గజాల స్థలంలో 1/28 వ భాగం అనగా 28.33 చదరపు గజాలు స్థలం చంటి అపార్ట్‌మెంట్స్ ఫేజ్-1 లోని, మొదటి అంతస్తులోని ఫ్లింత్ ఏరియా: 754 చదరపు అడుగులు, మరియు పార్కింగ్ ఏరియా 161 చదరపు అడుగులు గల ఫ్లాట్ నెం. ఎస్ 1 ఆస్తికి హద్దులు: **తూర్పు:** ఖాళీ స్థలము, **దక్షిణం:** ఫ్లాట్ నెం. ఎస్2, **పడమర:** నాదెళ్ళ పద్మ గారి ఫ్లాట్ నెం. ఎస్ 3 & కామన్ కారిడార్, **ఉత్తరం:** ఖాళీ స్థలం.

రిజర్వు ధర (రూ.) : రూ. 9,54,000/-, ధరావత్తు ధర (రూ.) : రూ. 95,000/-, బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://baanknet.com మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్: https://www.unionbankofindia.bank.in/auction-property/view-auction-property.aspx నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబరెన్స్ లేవు. [illegible] 8897008810, మెయిల్ ఐడి: ubin0555347@unionbankofindia.bank.in లలో సంప్రదించవలెను.

తేది: 19.12.2025 ప్రదేశం: గుడివాడ — అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు: చోళ క్రెస్ట్, సి 54 మరియు 55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600 032
బ్రాంచ్ ... శంకర్‌పురం, గుడివాడ, కృష్ణ జిల్లా (ఎపి)-521301. బ్రాంచ్ ... జ్ సర్కిల్ విజయవాడ-520008.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం 2002 లోని నియమం 13(2) కింద జారీ చేయబడిన డిమాండ్ నోటీసు.

[illegible]

	రుణ ఖాతా సంఖ్య మరియు రుణగ్రహీతల పేరు మరియు చిరునామా	రుణ మొత్తం	మొత్తం బకాయి
1	Loan A/C No.HE01DIV00000095852 Demand Notice Dt.15.12.2025: [illegible]	Rs. 75,00,000/-	15.12.2025 నాటికి దానిపై వడ్డీతో సహా రూ. 76,19,273/-
2	Loan A/C Nos.HE01VIJ00000042431 & HE01VIJ00000077057 Demand Notice Dt.15.12.2025: [illegible]	Rs. 23,00,000/- 6,50,000/-	15.12.2025 నాటికి దానిపై వడ్డీతో సహా రూ. 28,69,984/-

[illegible]

తేది: 25.12.2025 స్థలం: [illegible] — సం/- అధీకృత అధికారి, మెస్సర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్.లక్ష్మణరావు, చిత్రంలో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, డిబిఎఫ్ వ్యవస్థాపకులు కె.వినయ్ కుమార్

పిపిపికి స్వస్తి పలకాలి

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు
- తొమ్మిదిన విజయవాడలో సామూహిక నిరసన దీక్ష
- ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ

ప్రజాశక్తి- గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడం పట్ల రాజకీయ పార్టీలు, పౌర సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున నిరసన తెలియజేయడం ద్వారా ప్రజాభిప్రాయాన్ని గుర్తించి టెండర్లలో ప్రైవేట్ విద్యా సంస్థలు పాల్గొనకపోవడాన్ని స్వాగతిస్తున్నామని ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్లు మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, డిబిఎఫ్ వ్యవస్థాపకులు కె.వినయ్ కుమార్ అన్నారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి మరోసారి ప్రభుత్వం టెండర్లను పిలువ వద్దని డిమాండ్ చేశారు. బుధవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ టెండర్ల గడువును రెండుసార్లు పొడిగించి, టెండర్ల నిబంధనలను సరళం చేసి ప్రైవేట్ వైద్య సంస్థల వైద్యులకు, సిబ్బందికి మొదటి రెండు సంవత్సరాలు జీతభత్యాలను ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించినా, బడా ప్రైవేట్ వైద్య కళాశాలల యాజమాన్యాలు ప్రజాభిప్రాయాన్ని గమనించి, రాజకీయ వ్యతిరేకతను గమనించి, కోటికిపైగా ప్రజలు సంతకాలు చేయడం గుర్తించి, టెండర్లలో పాల్గొనకపోవడం హర్షణీయమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ మెడికల్ కళాశాలల పిపిపి పద్ధతికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. ఆదోని మెడికల్ కళాశాలలకు కిమ్స్ వైద్య సంస్థ ఒక్కటే బిడ్డింగ్‌లో పాల్గొందని, ఆ సంస్థ కూడా ఉపసంహరించుకోవాలని కోరారు. సింగిల్ బిడ్‌ను ఆమోదించవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 66 ఏళ్లపాటు ప్రభుత్వ వైద్య కళాశాలలను, ప్రభుత్వ ఆస్పత్రులను ప్రైవేట్ యాజమాన్యం చేతుల్లో ఉంచాలని భావించడం దారుణమన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్యవిద్య పేదలకు అందుబాటులో ఉంటుందని, రిజర్వేషన్లు అమలవుతాయని, పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం లభిస్తుందని వివరించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేట్‌పరం చేయాలనే ఆలోచనలను వ్యతిరేకించే అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి యువజన సంఘాలు, ప్రజా సంఘాలతో విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జనవరి తొమ్మిదిన సామూహిక నిరసన దీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి యువతి డ్రగ్స్ దందా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ చిక్కడపల్లి ప్రాంతంలో డ్రగ్స్ నెట్ వర్క్ గుట్టు రట్టయింది. బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి డ్రగ్స్ దందా నడుపుతున్న యువతితోపాటు మరో ఇద్దరిని చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి దాదాపు రూ. నాలుగు లక్షల మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. చిక్కడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ ప్రాంతానికి చెందిన సుష్మిత హైదరాబాద్ నగరంలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తోంది. లగ్జరీ జీవన శైలికి అలవాటు పడిన ఆమె తన బాయ్ ఫ్రెండ్ ఇమాన్యుయల్‌తో కలిసి యువతను టార్గెట్ చేసుకొని డ్రగ్స్ విక్రయిస్తోంది. చిక్కడపల్లి పరిధిలో గుట్టుగా సాగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి ప్రియురాలు, ప్రియుడితోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఎండిఎంఎ డ్రగ్స్, ఎల్ఎస్‌డి బాటిల్స్, ఒజి కుష్ వంటి ఖరీదైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్ విలువ సుమారు రూ.నాలుగు లక్షల వరకు ఉండొచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు.

డ్రగ్స్ సరఫరా వెనుక మరెంత మంది ఉన్నారు, ఈ నెట్‌వర్క్ ఎంతవరకు విస్తరించిందన్న దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. నగరంలో విద్యార్థులు, ఐటి ఉద్యోగులే లక్ష్యంగా ఈ డ్రగ్స్ విక్రయాలు జరిగినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వాట్సప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా యాప్‌లను ఉపయోగించి కస్టమర్లను సంప్రదించడం, హోమ్ డెలివరీ తరహాలో డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా ఐటీ ఉద్యోగులు, కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా డీలింగ్ కొనసాగించినట్టు విచారణలో వెల్లడైంది. డ్రగ్స్ కొనుగోలు, అమ్మకాల లావాదేవీలను డిజిటల్ పేమెంట్స్ ద్వారా నిర్వహిస్తూ, పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారని అధికారులు తెలిపారు. నిందితులకు డ్రగ్స్ సరఫరా చేసిన ప్రధాన డీలర్లు ఎవరు, నగరానికి మత్తుపదార్థాలు ఎలా చేరుతున్నాయన్న అంశాలపై విచారణ చేపట్టారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

పాస్టర్లకు గౌరవ వేతనం విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాస్టర్లకు గౌరవ వేతనం బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. 8,418 మంది పాస్టర్లకు నెలకు రూ.5 వేలు చొప్పున గౌరవ వేతనాన్ని రూ.50.50 కోట్లను వారి ఖాతాలకు బుధవారం జమ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది. ఇటీవల నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో 24వ తేదీన గౌరవ వేతనం బకాయిలను పాస్టర్ల ఖాతాలకు జమ చేస్తామని సిఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందుకనుగుణంగా అధికారులు నిధులు విడుదల చేశారు.

కెనడాలో భారత మహిళ హత్య

టొరంటో : కెనడాలో ఒక భారతీయ మహిళ దారుణ హత్యకు గురైంది. టొరంటోలోని ఒక నివాసంలో హిమాన్షి ఖురానా (30) హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు హత్య కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం కెనడా వ్యాప్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. టొరంటో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19న రాత్రి 10.41 గంటలకు స్ట్రాచన్ అవెన్యూ-వెల్లింగ్టన్ స్ట్రీట్ వెస్ట్ ప్రాంతం నుంచి ఒక మిస్సింగ్ ఫిర్యాదు అందింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు.. కాల్ వచ్చిన ప్రాంతానికి సమీపంలోనే ఖురానా చివరిసారిగా కనిపించినట్లుగా పోలీసులు నిర్ధారించారు. మరుసటి రోజు ఉదయం 6.30 గంటల సమయంలో అదే ప్రాంతంలోని ఓ నివాసంలో ఆమె మృతదేహం కనిపించింది. దీంతో హత్య కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. టొరంటోకు చెందిన అబ్దుల్ గఫూర్ (32) హంతకుడిగా అనుమానిస్తున్నారు. ఖురానాతో గఫూర్‌కు ముందు నుంచే పరిచయం ఉన్నట్లుగా పోలీసులు వెల్లడించారు.

ఈ ఘటనపై కెనాలోని భారత దౌత్య కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. " భారత యువతి హిమాన్షి ఖురానా హత్యకు గురవ్వడం చాలా బాధాకరం. ఆమె కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి" అని ఎక్స్‌లో సంతాపం తెలిపింది. బాధిత కుటుంబానికి అవసరమైన సాయం అందిస్తున్నామని పేర్కొంది.

ఎయిర్ ప్యూరిఫయర్‌పై జిఎస్‌టి తగ్గించండి

- ప్రభుత్వాన్ని కోరిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : ఢిల్లీ, దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో తీవ్ర వాయు కాలుష్యం ఉన్నా.. ఎయిర్ ప్యూరిఫయర్లపై జిఎస్‌టి తగ్గించకపోవడం పట్ల ఢిల్లీ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. వాయు నాణ్యతను దృష్టిలో పెట్టుకుని, దానిని ఎమర్జెన్సీగా భావించి ఎయిర్ ప్యూరిఫయర్లపై పన్నులు వీలైనంత తగ్గించాలని ప్రభుత్వాన్ని కోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గేదెలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. ఎయిర్ ప్యూరిఫయర్లను మెడికల్ డివైస్‌లుగాభావించి, వాటిపై ఉన్న 18 శాతం జిఎస్‌టి 5 శాతానికి చేర్చాలని కోర్టులో పిల్ వేశారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన గాలి కావాలని, కానీ అధికారులు నాణ్యమైన గాలిని అందివ్వలేకపోతున్నట్లు పేర్కొన్నది. ప్రతి రోజు మనిషి సగటున 21వేల సార్లు శ్వాస పీల్చుకుంటారని అంటే అన్ని సార్లు వాయువు పీల్చిన దాని వల్ల ఎంత హాని జరుగుతుందో అంచనా వేసుకోవాలన్నారు. కపిల్ మదన్ అనే వ్యక్తి ఈ పిటిషన్ వేశారు. తీవ్ర సంక్షోభం వేళ ఎయిర్ ప్యూరిఫయర్లను లగ్జరీ ఐటమ్‌లుగా భావించవద్దు కోరారు.

Home First Finance Company India Limited

homefirst — We'll take you home
CIN: L65990MH2010PLC240703
Website: homefirstindia.com Phone No.: 18003000 8425
Email ID: loanfirst@homefirstindia.com

స్వాధీనతా నోటీసు

రెఫ్ : సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 యొక్క సబ్ రూల్ (1) కింద స్వాధీనతా నోటీసు.

ఏదైతే, హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు, క్రింద ఇవ్వబడిన దాని సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసుకు అనుగుణంగా, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క యాక్ట్ నం.54) కింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(2) క్రింద అతని అందించబడిన అధికారాలను ఉపయోగిస్తూ సంబంధిత నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోపట మిగిలిన బకాయిలు చెల్లించమని పేరు క్రింద మిమ్మల్ని/రుణగ్రహీతలను కోరడమైనది.
మీరు/రుణగ్రహీతలు, ఏది ఏమైనా నిర్ణీత సమయంలోపట మిగిలిన బకాయిలు చెల్లించుటలో విఫలం చెందినారు, కావునా హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ వారు అధ్యాయనం చేసి మరియు అక్కడ క్రింద రూల్స్‌తో చదువుతూ SARFAESI చట్టం, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) నిబంధనల క్రింద నిర్ణయించే హక్కులు కలిగి ఉండి, ఇక్కడ దిగువ పేర్కొన్న సెక్యుర్డ్ అసెట్స్ స్వాధీనం చేసుకోవడమైనది:

క్ర సం.	ఖాతా, రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/హామీదారుల పేరు	తనఖా ఆస్తి వివరణ	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు తేది నాటికి మొత్తం బకాయిలు (రూ.లో)	స్వాధీనతా తేది
1	సుంకర గోపయ్య, సుంకర కోటమ్మ	ఇల్లు- డో.నం.48-1, అప్పుడు 48-1ఎ, గనికపూడి గ్రామం గ్రామ పంచాయతీ, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522015. హద్దులు : తూర్పు : బజారు 33 ½ లిం.లు., దక్షిణం: ఆయుధం కోటయ్య ఆస్తి 92 లిం.లు., పడమర : పంచాయతీ రోడ్డు 33 ½ లిం.లు., ఉత్తరం: పంచాయతీ రోడ్డు 92 లిం.లు.	05-03-2025	27,70,899	19-12-2025

రుణగ్రహీత మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీత/హామీదారుడు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతను అధికారాలు అధ్యాయనం చేస్తూ ఇక్కడ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా పైన సూచించిన ఆస్తులు/సెక్యుర్డ్ అస్సెట్స్ ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు పూర్తి మొత్తం చెల్లింపు వరకు తదుపరి వడ్డీతో ఆస్తులు/సెక్యుర్డ్ అస్సెట్స్ ఎదురుగా పైన పేర్కొన్న మొత్తం హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను. సెక్యుర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలు అహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించవలెను.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ — సం/- అధికృత అధికారి
తేది: 25.12.2025 — హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola — Enter a better life
కార్పొరేట్ ఆఫీసు: చోళాక్రెస్ట్, సి54 & 55, సూపర్ బి-4, తిరువికా ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, తమిళనాడు

ఇ-వేలం అమ్మకపు ప్రకటన (ఇ-బిడ్డింగ్ ద్వారా మాత్రమే అమ్మకం)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) మరియు 9(1) క్రింద జారీచేసిన స్థిరా సెక్యూడ్ అసెట్స్ యొక్క అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి సాధారణంగా మరియు కాలమ్ (ఏ)లో సూచించిన ప్రత్యేకంగా రుణగ్రహీతకు/హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా ఏమనగా కాలమ్ (సి)లో వివరించిన దిగువ స్థిరాస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్ తనఖాపెట్టబడినవి/చార్జ్ చేయబడినవి వాటిని హౌసింగ్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ సెక్యూర్డు క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి ద్వారా కాలమ్ (డి) వివరించినట్లు నిర్మాణాత్మకంగా స్వాధీనంలోకి తీసుకున్నారు. అవి దిగువ పేర్కొన్న వివరాల ప్రకారం 'ఎక్కడ ఎలా ఉన్నది & అక్కడ అలాగే" మరియు "ఏదైతో ఎలా ఉందో అలాగే" ప్రాతిపదికన విక్రయించబడును.
ఇందుమూలంగా సంబంధిత రుణగ్రహీత(లు)/తాకట్టుదారులు (మరణించారు)/ చట్టబద్ధ వారసులు, చట్టబద్ధ ప్రతినిధుల (తెలిసిన లేదా తెలియని), ఎగ్జిక్యూటర్స్, అడ్మినిస్ట్రేటర్స్, వారసులు మరియు సంబంధిత రుణగ్రహీత(లు)/ తాకట్టుదారులు (మరణించారు) యొక్క అసైన్స్‌లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని 8(6) క్రింద కాలమ్ (ఏ)లో సూచించినట్లుగా ఉంటుంది. అమ్మకంలోని వివరణాత్మక నియమ & నిబంధనల కొరకు దయచేసి చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, సెక్యూర్డు క్రెడిటార్స్ యొక్క వెబ్‌సైట్ అనగా https://www.cholamandalam.com & www.auctionfocus.inలో కల్పించిన లింక్‌ను రిఫర్ చేయండి.

క్ర. సం.	[A] రుణ ఖాతా నెంబరు/ రుణగ్రహీత(లు)/ తనఖాదారు(ల)/హామీదారుల పేరు	[B] రికవరీ చేయబడు బాకీపడిన బకాయిలు (సెక్యూర్డు డెట్స్)	[C] స్థిరాస్తి/ సెక్యూర్డు అసెట్ యొక్క వివరణ	[D] స్వాధీనతా రకం	[E & F] రిజర్వు ధర (రూ.లో) / ధరావత్తు (రూ.లో)	[G] వేలం తేది & సమయం
1.	రుణ ఖాతా నెం.లు: HL04RAS000028856 1) శ్రీ/శ్రీమతి తూమూలూరి సురేష్ 2) శ్రీ/శ్రీమతి జ్యోతి తూమూలూరి చిరునామా: డోర్ నెం.5-10-36/17, నాగార్జుననగర్, వాటర్ ట్యాంక్ దగ్గర, సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్-522403. ఇక్కడ కుడా: 86-సి/ 6-45, మింజుమల్లే, బల్లావరం ముప్పాళ్ల, గుంటూరు-522403, ఆంధ్రప్రదేశ్, టెంపుల్ దగ్గర, టెంపుల్ దగ్గర, సత్తెనపల్లి-522403.	16.05.2025 నాటికి బకాయిలు రూ.20,22,812/- (రూపాయలు ఇరవై రెండు లక్షల ఇరవైరెండు వేల ఎనిమిది వందల పన్నెండు మాత్రమే)	గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, సత్తెనపల్లి ఉప-జిల్లా, ముప్పాళ్ల మండలం, బొల్లవరం గ్రామం, డి.నెం.86-సి, వార్డు నెం.2, డోర్ నెం.6-45, అసెస్‌మెంట్ నెం.340, విస్తీర్ణం 581 చ.గ.లు, 1400చ.అ.ల ఆర్‌సిసి ఇల్లు అందులోని అన్ని ఫిక్సర్లు మరియు ఫిట్టింగులతో కూడిన ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: బజార్, దక్షిణం: బజార్, పడమర: బజార్, ఉత్తరం: అక్కల వెంకటరావమ్మ మరియు అంజిరెడ్డి ఆస్తి, అన్ని ఈస్‌మెంట్ హక్కులతో.	నిర్మాణాత్మక స్వాధీనం	రూ.21,50,000/- (రూపాయలు ఇరవైఒక లక్షల యాభైవేలు మాత్రమే) / రూ.2,15,000/- (రూపాయలు రెండులక్షల పదిహేను వేలు మాత్రమే)	13.01.2026 మ.02.00 గంటల నుండి సా.04.00 గంటల వరకు (టెండర్ డాక్యుమెంట్ ప్రకారం 5 నిమిషాల చొప్పున ఆటోమేటెడ్ పొడిగింపులతో),

తనిఖీచేయు తేది & సమయం: 10.01.2026న ఉ.11.00 గం.ల నుండి సా.4.00గం.లు — కనీస బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/-
బిడ్/ ధరావత్తు/ పాల్గొనడానికి అభ్యర్థన లేఖ సమర్పించడానికి చివరి తేదీ: 12.01.2026న సా.05.00గం.ల వరకు

• రుణ ఒప్పందం, యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చులు, ఛార్జీలు మొదలైన వాటితో వర్తించే తదుపరి వడ్డీతో పాటు చెల్లింపు తేదీ మరియు / లేదా దాని అమలు తేదీ వరకు.
ఆస్తి తనిఖీకి సంబంధించిన ఏదైనా సహాయం కోసం లేదా బిడ్ డాక్యుమెంట్ పొందడం కోసం మరియు ఏవైనా ఇతర సందేహాల కోసం, దయచేసి చోళ మండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీకి చెందిన అధికారులైన శ్రీ.పరిమి శ్రీధర్, అతని మొబైల్ నెం.7337482233, ఇ-మెయిల్ ఐడి: Parimisv @chola.murugappa.com /శ్రీ. బి.గంగాధరం 8885615656, శ్రీమతి కోమల్ శర్మ, 8870464652 పై సంప్రదించండి. చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ మరియు ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌కి చెందిన అధీకృత అధికారికి సంబంధించిన అత్యుత్తమ జ్ఞానం మరియు సమాచారం మేరకు పై స్థిరాస్తులు/ సెక్యూర్డు అసెట్స్‌కు సంబంధించి రుణభారాలు లేవు.

సం/-
తేది: 24-12-2025 — అధీకృత అధికారి
ప్రదేశం: నరసరావుపేట, ఆంధ్రప్రదేశ్ — చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola — Enter a better life
కార్పొరేట్ ఆఫీసు: చోళాక్రెస్ట్, సి54 & 55, సూపర్ బి-4, తిరువికా ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, తమిళనాడు

ఇ-వేలం అమ్మకపు ప్రకటన (ఇ-బిడ్డింగ్ ద్వారా మాత్రమే అమ్మకం)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) మరియు 9(1) క్రింద జారీచేసిన స్థిరా సెక్యూడ్ అసెట్స్ యొక్క అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి సాధారణంగా మరియు కాలమ్ (ఏ)లో సూచించిన ప్రత్యేకంగా రుణగ్రహీతకు/హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా ఏమనగా కాలమ్ (సి)లో వివరించిన దిగువ స్థిరాస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్ తనఖాపెట్టబడినవి/చార్జ్ చేయబడినవి వాటిని హౌసింగ్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ సెక్యూర్డు క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి ద్వారా కాలమ్ (డి) వివరించినట్లు నిర్మాణాత్మకంగా స్వాధీనంలోకి తీసుకున్నారు. అవి దిగువ పేర్కొన్న వివరాల ప్రకారం 'ఎక్కడ ఎలా ఉన్నది & అక్కడ అలాగే" మరియు "ఏదైతో ఎలా ఉందో అలాగే" ప్రాతిపదికన విక్రయించబడును.
ఇందుమూలంగా సంబంధిత రుణగ్రహీత(లు)/తాకట్టుదారులు (మరణించారు)/ చట్టబద్ధ వారసులు, చట్టబద్ధ ప్రతినిధుల (తెలిసిన లేదా తెలియని), ఎగ్జిక్యూటర్స్, అడ్మినిస్ట్రేటర్స్, వారసులు మరియు సంబంధిత రుణగ్రహీత(లు)/ తాకట్టుదారులు (మరణించారు) యొక్క అసైన్స్‌లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని 8(6) క్రింద కాలమ్ (ఏ)లో సూచించినట్లుగా ఉంటుంది. అమ్మకంలోని వివరణాత్మక నియమ & నిబంధనల కొరకు దయచేసి చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, సెక్యూర్డు క్రెడిటార్స్ యొక్క వెబ్‌సైట్ అనగా https://www.cholamandalam.com & www.auctionfocus.inలో కల్పించిన లింక్‌ను రిఫర్ చేయండి.

క్ర. సం.	[A] రుణ ఖాతా నెంబరు/ రుణగ్రహీత(లు)/ తనఖాదారు(ల)/హామీదారుల పేరు	[B] రికవరీ చేయబడు బాకీపడిన బకాయిలు (సెక్యూర్డు డెట్స్)	[C] స్థిరాస్తి/ సెక్యూర్డు అసెట్ యొక్క వివరణ	[D] స్వాధీనతా రకం	[E & F] రిజర్వు ధర (రూ.లో) / ధరావత్తు (రూ.లో)	[G] వేలం తేది & సమయం
1.	రుణ ఖాతా నెం.లు: LAP1VJI000054338 1) శ్రీ/శ్రీమతి సాయికిరణ్ పట్టెల 2) శ్రీ/శ్రీమతి రాజకుమారి పట్టెల చిరునామా: 7-16/1, కంచిచెర్ల, శివాలయం దగ్గర, క్రిష్ణా, ఆంధ్రప్రదేశ్- 521180. ఇక్కడ కుడా: ఆర్ఎస్ నెం. డోర్ నెం.7-16 దగ్గర, శివాలయం స్ట్రీట్, వార్డు నెం.7, కంచికచెర్ల గ్రామం, కంచికచెర్ల మండలం, క్రిష్ణా జిల్లా-521180, ఆంధ్రప్రదేశ్, శివాలయం, క్రిష్ణా-521180.	16.04.2025 నాటికి బకాయిలు రూ.20,15,588/- (రూపాయలు ఇరవై లక్షల పదిహేనువేల ఐదువందల ఎనభై ఎనిమిది మాత్రమే)	పాత క్రిష్ణా జిల్లా, ఇపుడు ఎన్‌టిఆర్ జిల్లా, కంచికచర్ల ఉప జిల్లా, కంచికచర్ల మండలం, కంచికచర్ల గ్రామం పంచాయతీ, ఆర్ఎస్ నెం.503-1, డోర్ నెం.7-16/1 ఆధారంగా ఆర్.సి.సి.తో కూడిన 117 చ.గ.ల విస్తీర్ణపు స్థలం కలిగిన ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: 10అ.ల వెడల్పు రోడ్డు-25 అ.లు, దక్షిణం: సింగారపు నరసింహస్వామి ఇల్లు-42 అ.లు, పడమర: దమ్మాలపాటి సీతారామయ్య మరియు కొప్పు కోటేశ్వరరావుల స్థలం మరియు ఇల్లు-25 అడుగులు, ఉత్తరం: దాసరి అన్నపూర్ణ స్థలం-42 అ.లు, అన్ని ఈస్‌మెంట్ హక్కులతో	నిర్మాణాత్మక స్వాధీనం	రూ.30,00,000/- (రూపాయలు ముప్పైలక్షలు మాత్రమే) / రూ.3,00,000/- (రూపాయలు మూడు లక్షలు మాత్రమే)	28.01.2026 మ.02.00 గంటల నుండి సా.04.00 గంటల వరకు (టెండర్ డాక్యుమెంట్ ప్రకారం 5 నిమిషాల చొప్పున ఆటోమేటెడ్ పొడిగింపులతో),

తనిఖీచేయు తేది & సమయం: 26.01.2026న ఉ.11.00 గం.ల నుండి సా.4.00గం.లు — కనీస బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/-
బిడ్/ ధరావత్తు/ పాల్గొనడానికి అభ్యర్థన లేఖ సమర్పించడానికి చివరి తేదీ: 27.01.2026న సా.05.00గం.ల వరకు

• రుణ ఒప్పందం, యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చులు, ఛార్జీలు మొదలైన వాటితో వర్తించే తదుపరి వడ్డీతో పాటు చెల్లింపు తేదీ మరియు / లేదా దాని అమలు తేదీ వరకు.
ఆస్తి తనిఖీకి సంబంధించిన ఏదైనా సహాయం కోసం లేదా బిడ్ డాక్యుమెంట్ పొందడం కోసం మరియు ఏవైనా ఇతర సందేహాల కోసం, దయచేసి చోళ మండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీకి చెందిన అధికారులైన శ్రీ.పరిమి శ్రీధర్, అతని మొబైల్ నెం.7337482233, ఇ-మెయిల్ ఐడి: Parimisv @chola.murugappa.com /శ్రీ. బి.గంగాధరం 8885615656, శ్రీమతి కోమల్ శర్మ, 8870464652 పై సంప్రదించండి. చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ మరియు ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌కి చెందిన అధీకృత అధికారికి సంబంధించిన అత్యుత్తమ జ్ఞానం మరియు సమాచారం మేరకు పై స్థిరాస్తులు/ సెక్యూర్డు అసెట్స్‌కు సంబంధించి రుణభారాలు లేవు.

సం/-
తేది: 24-12-2025 — అధీకృత అధికారి
ప్రదేశం: క్రిష్ణా, ఆంధ్రప్రదేశ్ — చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

HDFC BANK
బ్రాంచ్ ఆఫీస్: 1వ అంతస్తు, శ్రీ హరి టవర్స్, 59ఏ-1-5/1, 1వ అంతస్తు, శ్రీ హరి టవర్స్, మేరీ స్టెల్లా కళాశాల పక్కన, కె.పి. నగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520008. ఫోన్ నెం.0866-2429130. CIN: L65920MH1994PLC080618, Website: www.hdfcbank.com

డిమాండ్ నోటీసు

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం) యొక్క సెక్షన్ 13(2) క్రింద. ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ (తేది: 17 మార్చి, 2023 నాటి గౌ॥ ఎన్‌సిఎల్‌టి-ముంబై వారి ఉత్తర్వు ద్వారా ఆమోదం పొందిన విలీన పథకం క్రింద హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో పూర్వపు హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ వారు విలీనమైనారు) (హెచ్‌డిఎఫ్‌సి) యొక్క అధీకృత అధికారి అయిన క్రింది సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారము క్రింద తెలియజేసినట్లు సంబంధిత నోటీసు/లుల తేది నుండి 60 రోజులలోగా సంబంధిత డిమాండ్ నోటీసు/లలలో తెలిపిన బకాయి మొత్తమును తిరిగి చెల్లించమని ఋణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసుడు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి(లు)లను కోరుతూ వివరములు ఈ క్రింది విధముగా తెలియజేయడమైనది. ఈ క్రింది సంతకందారు సదరు ఋణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసుడు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి(లు) తెలియబర్చిన ఆఖరి చిరునామాల యొక్క ప్రాంగణంలో ఈ నోటీసులను అతికించడమైనది. అంతేగాక సదరు నోటీసు కాపీలు ఈ క్రింది సంతకందారు వద్ద లభ్యమగును మరియు ఋణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసుడు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి(లు) సంబంధిత సదరు కాపీలు కావల్సిన వారు ఈ క్రింది సంతకందారు నుండి ఏదైనా పని దినములలో కార్యాలయ పని వేళలయందు పొందవచ్చును. ఇందుకు సంబంధించి సదరు ఋణ ఒప్పందము మరియు ఇతర డాక్యుమెంట్లు/ వ్రాసిన దాని ప్రకారము ఏవైనా ఉన్నచో వీటితో చదువబడే బకాయి మొత్తము చెల్లింపు తేదీ మరియు/ లేదా రాబట్టుకొను వరకు కాలమ్ (సి) నందు దిగువ తెలియజేయబడిన సంబంధిత తేదీల నుండి సదరు డిమాండ్ నోటీసులలో వివరించబడిన ప్రకారము తదుపరి వడ్డీతో సహా వారి సంబంధిత పేర్లతో క్రింది తెలియజేయబడిన మొత్తములను ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపుగా హెచ్‌డిఎఫ్‌సికి చెల్లించవల్సిందిగా సదరు ఋణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసుడు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి(లు)కు మరొక పర్యాయము ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది. సదరు ఋణగ్రహీత(లు)చే వరుసగా హెచ్‌డిఎఫ్‌సికి దిగువ సెక్యూర్డ్ చేయబడిన ఆస్తి(లు) ఋణం తిరిగి చెల్లించుటకు తగిన విధంగా సెక్యూరిటీగా తనఖా పెట్టబడినవి. సెక్యూర్డ్ ఆస్తి/లను విడిపించుటలో లభ్యతనందు గల సమయమునకు సంబంధించి చట్టము యొక్క సెక్షన్ 13 నందలి ఉపసెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా ఋణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసుడు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి(లు)ల దృష్టికి తేవడమైనది.

క్ర. సం. (ఎ)	రుణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధుల పేరు (బి)	పూర్తి బకాయి మొత్తాలు (సి)	డిమాండ్ నోటీసు తేది (డి)	సెక్యూర్డ్ అసెట్స్/ స్థిరాస్తులకు సంబంధించిన వివరణ (ఇ)
1	1 శ్రీ.రవ్వల సాంబశివ రావు (రుణగ్రహీత) 2. శ్రీ. రవ్వల ప్రశాంత్ కుమార్(సహ రుణగ్రహీత) 3. శ్రీమతి. రవ్వల రాజేశ్వరి(సహ రుణగ్రహీత)	31-10-2025 నాటికి* రూ.20,42,083/- (హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో ఋణగ్రహీత యొక్క అన్ని ఋణాల బహిర్గతం/లు సహా)	14-11-2025	గుంటూరు, మంగళగిరి సబ్-జిల్లా, తాడేపల్లి మున్సిపాలిటీ, డి.నం.56, తాడేపల్లి మున్సిపాలిటీ బ్లాక్ నం.12, సమీప డోర్ నం.12-502 కలిగిన "రాయల్ గ్రాండ్"గా పిలువబడుతున్న భవనంలోని 4వ అంతస్తులో గల ఫ్లాట్ నం.502 యొక్క బిల్టప్ ఏరియా 1113 చ.అ.లు (ఫ్లింత్ విస్తీర్ణం 891, 222 చ.అ.ల కామన్ ఏరియా) మరియు మొత్తం విస్తీర్ణం 402.8 చ.గ.లలో అవిభాజ్యపు వాటా భూమి అయిన 40.08 చ.గజాల విస్తీర్ణంతో పాటు 120 చ.అ.ల పార్కింగ్ ఏరియా కలిగిన యావదాస్తి. మొత్తం భూమికి గల సరిహద్దులు: ఉత్తరం: గుడిపాటి సూర్య నారాయణకు చెందిన భూమి-74-0 అ.లు; దక్షిణం: వి.బి.సి ఇన్‌ఫ్రా మరియు గుత్తికొండ వెంకట సుబ్బారావుకు చెందిన భూమి-74 అ.గు.లు, తూర్పు: 33 అడుగుల వెడల్పు గల జాయింట్ రోడ్డు-49 అ.లు, పడమర: ప్రతాప్ మరియు హైమావతిలకు చెందిన భూమి. ఫ్లాట్ యొక్క సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: కామన్ కారిడార్.
2	1) శ్రీ ప్రత్తి మురళీ మోహన్ (ఋణగ్రహీత) 2) శ్రీ రామిశెట్టి లక్ష్మీ జ్వాల (ఋణగ్రహీత)	30-09-2025 నాటికి* రూ. 1,03,71,671/-	26-11-2025	గుంటూరు జిల్లా, కోరేటిపాడు సబ్ జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, నాన్ టౌన్ సర్వేయిడ్ గుంటూరు సిటీ, గుజ్జనగుండ్ల, కోరేటిపాడు గ్రామంలో డి.నం.377, మున్సిపల్ డోర్ నం.1-3-23/5 కలిగి 250 చ.గజాల విస్తీర్ణం గల భూమి దక్షిణం పోర్షనులో మున్సిపల్ ట్యాక్స్ అసెస్‌మెంట్ నం.1021149752 కలిగిన 150 చ.గజాల విస్తీర్ణం గల అనుబంధ భూమితో కలిపి ఆర్‌సిసి రూఫ్డ్ భవనం యావత్తు. సరిహద్దులు: తూర్పు: 15 అడుగుల వెడల్పు రోడ్ ద్వారా సరిహద్దులు గలది-25 అడుగులు, దక్షిణం: లింగంశెట్టి విజయలక్ష్మికి చెందిన ఆస్తి ద్వారా సరిహద్దులు గలది-54 అడుగులు, పశ్చిమం: కరెంటు ఆఫీసు యొక్క ప్రహరీ గోడ-25 అడుగులు, ఉత్తరం: నా ద్వారా గుర్రాల రంగారావుకు విక్రయించబడిన భూమి-54 అడుగులు.

*చెల్లింపు తేది వరకు మరియు/లేదా వసూలయ్యేంతవరకు అయిన తదుపరి వడ్డీ, వ్యయాలు, చార్జీలు మొదలైన వాటీతో.
సదరు ఋణగ్రహీతలు పైన తెలిపిన విధంగా హెచ్‌డిఎఫ్‌సికి చెల్లింపుచేయడంలో విఫలమైతే, ఖర్చులు మరియు పరిణామాలకు పూర్తిగా సదరు ఋణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసుడు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి(లు)ల బాధ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తించు నియమాల క్రింద పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తి (ఆస్తులు)/ స్థిరాస్తి (స్థిరాస్తులపై) హెచ్‌డిఎఫ్‌సి ముందుకు సాగుతుంది. హెచ్‌డిఎఫ్‌సి ముందస్తు వ్రాత పూర్వక అనుమతి లేకుండా పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తి (ఆస్తులు)/ స్థిరాస్తి (స్థిరాస్తులు)లను అమ్మకం, లీజు, ఇతరత్రా ఏ విధంగానైనా బదిలీ చేయటానికి సదరు చట్టం క్రింద సదరు ఋణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసుడు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి(లు) నిరోధించబడినారు. ఏ వ్యక్తి అయినా సదరు చట్టంలోని నిబంధనలను లేదా దాని క్రింద రూపొందించిన నియమాలను ఉల్లంఘించేందుకు ప్రేరేపిస్తే చట్టం క్రింద ఏర్పాటు చేసిన విధంగా కారాగార శిక్ష మరియు/ లేదా జరిమానా విధించబడుటకు బాధ్యులవుతారు.

తేది: 25 డిసెంబర్, 2025 — హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తరపున
ప్రదేశం: విజయవాడ — అధికృత అధికారి
రిజిస్టర్డు ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబయి-400020.

గురజాడ.. శ్రీశ్రీ.. శ్రామిక కవిత్వ వాడ!

సిఐటియు అఖిల భారత మహాసభకు వేదికైన విశాఖ పట్టణం కేవలం రాష్ట్ర ఆర్థిక రాజధాని మాత్రమే కాదు! సాహితీ రంగంలోనూ ఈ నగరం తెలుగు నేలపై తనదైన ముద్ర వేసింది. మహాసభలో పాల్గొనడానికి రాష్ట్రం నలుమూలల నుండి తరలి వస్తున్న కార్మిక యోధుల ప్రతినిధులకు సంఘీభావంగా ఈ నెల 28న ఇక్కడి ఎ.యు కన్వెన్షన్ సెంటర్‌లో శతాధిక కవి,గాయకులు 'శ్రమ కవనం'తో తమ గళం విప్పనున్నారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని తెలుగుకు వెలుగు అద్దిన విశాఖ సాహితీ వైభవం గురించి క్లుప్తంగా ...



విశాఖ పట్టణంలో సిఐటియు అఖిల భారత మహాసభలు జరుగుతున్న వేళ ఈ కార్మికోద్యమ చైతన్యం తెలుగు రచయితలలో ప్రవేశపెట్టిన ఆధునిక సాహిత్య చరిత్ర మదిలో మెదులుతుంది. ఇందుకు వైతాళికులు గురజాడ అప్పారావు, శ్రీశ్రీ అనే శ్రీరంగం శ్రీనివాసరావు ఇద్దరూ విశాఖ పట్టణంతోనే ముడిపడిన వారు కావడం చారిత్రిక విశేషం. తూర్పు తీరంలో తొలుత పోర్చుగీసు తర్వాత ఫ్రెంచి, డచ్చి, బ్రిటిష్ వారి మధ్య అనేక ఆర్థిక ఆధిపత్య యుద్ధాలు జరిగాయి. 17వ శతాబ్ది తర్వాత ఈ పోరాటంలో ఈస్టిండియా కంపెనీ పైచేయి సాధించింది. ముఖ్యంగా వస్త్ర పరిశ్రమ గురించి ఈ పోటీ జరిగింది. బరంపురం, విశాఖపట్టణం, భీమునిపట్నం వంటి చోట్ల తయారయ్యే వస్త్రాలను డచ్చివారికి అమ్మేవారు. సిల్కు వస్త్రాలకు బరంపురం, మస్లిన్ గుడ్డలకు శ్రీకాకుళం పేరొందాయి. ఈ ఏజన్సీ ప్రాంతాల్లో మంచి కలప దొరకడంతో నౌకా నిర్మాణం పెరిగింది. అప్పట్లోనే కోస్తా ప్రాంతం నుంచి మొత్తం 75 లక్షల విలువైన వ్యాపారం జరిగేది. వీటికి కార్మికులు కూడా అవసరమయ్యారు. మరో వంక జమీందారీల పీడన కారణంగా పేదరికంతో పాటు తరచూ కరువులు వస్తుండేవి. పరాయి పాలకుల అశ్రద్ధ, అవినీతి వల్ల క్రమేణా ఈ పరిశ్రమలు కూడా దెబ్బతినిపోయాయి. ఈ విధంగా పేదరికం, పారిశ్రామీకరణ రెండూ పైన వేసుకున్న చరిత్ర విశాఖ ప్రాంతానిది. 19వ శతాబ్ది ప్రారంభంలో గురజాడ అప్పారావు గిడుగు కృషితో అక్కడ తెలుగు వారి పునర్వికాసం మొదలైంది. ప్రజల భాషలో మాట్లాడటం, ప్రజల కోసం సాహిత్యం రచించడం గురజాడతో మొదలైంది. 1910లో ఆయన 'దేశభక్తి' రచన జరిగింది.

గురజాడ దేశభక్తితో పాటు శ్రమశక్తికీ పట్టం కట్టారు. 'నరుల చెమటను తడిసిమూలం ధనం పంటలు పండవలెనోయ్' అని సందేశమిచ్చారు.' అన్ని దేశాల్ క్మమ్మవలెనోయ్ దేశిసరుకల నమ్మవలెనోయ్' అని ఈ ఉత్పత్తులను అన్ని చోట్లా అమ్మాలని కూడా ఆశించారు. మందగించక ముందుకడుగేయాలనీ, వెనకబడితే వెనకేననీ చెప్పారు. ఈ భావాన్ని ఇంకా పెంచి 'పదండి ముందుకు' అన్న శ్రీశ్రీ 'శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేద'ని చాటి చెప్పారు. తన కవిత్వం 'కార్మిక లోకపు కళ్యాణానికి శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్పణం'గా ప్రకటించారు. దేశచరిత్రలు గేయంలో దేశ దేశాల కార్మికులందరూ కలసి 'చారిత్రిక యథార్థతత్వం చాటిస్తారొక గొంతుకతో' అని గొప్ప విశ్వాసం ప్రకటించాడు. అప్పటికి రాజ్యమేలుతున్న భావ కవిత్వం దశ దాటుకుని శ్రీశ్రీ లో సామ్యవాద చైతన్యం విశాఖ హార్బరు నిర్మాణంతోపాటే పెరగడం గొప్ప విశేషం, శ్రీశ్రీ ఇలా చెప్పారు: ''విశాఖపట్టణానికి హార్బరు వచ్చినప్పుడు నాకు యౌవనం వచ్చింది. అందరూ ప్రేమ గీతాలు రాసే ఆ ఋతువులో నేను పారిశ్రామిక విప్లవాన్ని కౌగిలించాను. అప్పుడు అబ్బూరి రామకృష్ణారావు గారే నా హార్బరూ విశ్వ విద్యాలయమూను. సగటున రోజుకో కొత్తపుస్తకం చదివించేవారాయన. వాల్తేరు దాకా నడుచుకుపోయేవాణ్ని. అబ్బూరి వారిచ్చిన పుస్తకం చదువుతూ సముద్రతీరం మీదగా ఏరాడ కొండదాకా నడుచుకు వచ్చేవాణ్ని. చింకిగుడ్డలు, కాళ్ళకి జోళ్ళుండేవి కావు. అలలు నా కాళ్ళనీ, షరాయినీ తడుపుతూన్నాయనే స్పృహ కూడా ఉండేది కాదు."

శ్రీశ్రీ తొలి గురువు ఆయన తండ్రి రమణయ్య మాష్టారు, సాహిత్య గురువుఅబ్బూరి రామకృష్ణారావు. ఆంధ్ర యూనివర్సిటీ లైబ్రేరియన్‌గా, అధ్యాపకుడుగా కూడా పని చేసిన అబ్బూరి మొదట కమ్యూనిస్టు అభిమాని. ఆయన అనేకమందికి అభ్యుదయ సాహిత్యం, సైద్ధాంతిక గ్రంథాలు ఇస్తుండేవారు. ఆ సమయంలోనే చంద్ర రాజేశ్వరరావు కాశీ విశ్వవిద్యాలయం వదలిపెట్టి వైజాగ్ మెడికల్ కాలేజీలో చేరారు. మరో నలుగురైదుగురు కూడా వీరితో సంబంధం కలిగి వుండేవారు. అప్పటికే దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం కార్మికోద్యమం నిర్మాణం మొదలు పెట్టిన పుచ్చలపల్లి సుందరయ్య ఎ.ఎల్.నరసింహారావు అనే యువ కార్యకర్తను విశాఖలో పని చేసేందుకై తెలిసిన ఒక డాక్టరు ద్వారా అబ్బూరి దగ్గరకు పంపించారు. ఇవన్నీ చర్చించేందుకు సుందరయ్య గారు ఎప్పుడు విశాఖ వస్తున్నారని తెలిసినా ముందే పోలీసులు నిఘా వేసి పసిగట్టేవారట. నాటకాలు, రాత్రి పాఠశాలలు నడుపుతూ వీరు యువకులతో కార్మికులతో సంబంధాలు పెంచుకునేవారు. క్రమేణా హార్బర్‌లో నరసింహారావు అనే ఫిట్టర్‌ను తొలగించడంతో దానిపై పోరాడేందుకు యూనియన్ ప్రారంభించారు. అప్పట్లో కార్మిక నాయకుడు తర్వాత కాలంలో రాష్ట్రపతి పదవి చేపట్టిన వి.వి.గిరి తో సహా మరికొందరు ఆ యూనియన్ ఏర్పాటుకు పోటీ పడ్డారు గానీ చివరకు కమ్యూనిస్టులే ఫలప్రదమైనారు. కాని బ్రిటిష్ పోలీసుల నిఘా ఎక్కువగా వుండేది. అబ్బూరి తన ఫార్ములా ప్రకారం అక్కడ కూడా రాత్రి పాఠశాల, కార్మికులకు విద్యాబోధన పేరుతో వచ్చేవారు. ఈ రాత్రి పాఠశాలను ప్రారంభించిన వ్యక్తి విశాఖ ప్రాంతంలో కవిగారుగా ప్రసిద్ధులైన మారేమండ రామచంద్ర శాస్త్రి, ఈ కవిగారి అధ్యక్షతనే 1935లో అంటే కచ్చితంగా 90 ఏళ్ల కిందట బరంపురంలో సాహితీ సమితి ప్రారంభించారు శ్రీశ్రీ తదితరులు.

1933లో జయభేరి గీతం రాసి భువన భవనపు బావుటా ఎగరేసిన శ్రీశ్రీ 1934లో మహాప్రస్థానంతో సహా పదకొండు గేయాలు వెలువరించారు. అదే ఏడాది తుమ్మల వెంకట్రామయ్య 'ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా' అంటూ తొలి ఎర్రజండా పాట రాశారు. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ శాఖ కూడా ఏర్పడింది. అప్పుడే నిడుబ్రోలులో రైతు విద్యాలయం తరపున ఆచార్య రంగా రైతు భజనావళి పేరిట 50 పేజీల సంకలనం ప్రచురించారు. అప్పట్లో కమ్యూనిస్టు భావజాలానికి ప్రతిబింబంగా వున్న ప్రభ పత్రికలోనూ వరుసగా అనేక శ్రామిక గేయాలు వెలువడ్డాయి. ఈ విధంగా శ్రామికవర్గ సంస్థల నిర్మాణంతో పాటు శ్రామిక సాహిత్య సృజన కూడా ఊపందుకుంది. ఈ కృషిలో పాలుపంచుకున్నవారు అనేకమంది. తర్వాత కొందరి మార్గాలు మారినా అప్పటి పాత్ర గుర్తుంచుకోవలసిందే. ఇటు బయట జరిగే ఈ కృషికి సైద్ధాంతిక భూమిక సమకూర్చింది ఆంధ్ర యూనివర్సిటీలో పని చేసిన హిరేన్ ముఖర్జీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి వారిని చెప్పుకోవాలి. అప్పట్లో కట్టమంచి రామలింగారెడ్డి వైస్ ఛాన్సలర్‌గా వుండి సామ్యవాద సాహిత్యాన్ని తీసేశారు గాని విశాఖ తీరం నుంచి కార్మికోద్యమాన్ని విప్లవ భావవికాసాన్ని మాత్రం అడ్డుకోలేకపోయారని ఈ వందేళ్ల చరిత్ర చెబుతున్నది. సామాజిక ఆర్థిక నేపథ్యం నుంచే ఎప్పుడైనా సాహిత్య రంగంలోనూ పరిణామాలు వస్తాయి. ఇప్పుడు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగంలోనూ ప్రజాస్వామిక సాహిత్యపరులు అందుకే మళ్లీ గళాలు వినిపిస్తున్నారు.

- తె.ర

పోర్టు వర్కర్ల పోరాటం



రాష్ట్ర కార్మికోద్యమంలో పోర్టు కార్మికుల పోర్టు కార్మికుల పోరాటానికి గణనీయమైన స్థానం ఉంది. 1937- 42 సంవత్సరాల కాలంలోనే విశాఖతో పాటు కాకినాడ,కాకినాడ, కళింగపట్నం, భీమునిపట్నంలలో పోర్టు కార్మికులకు చెందిన అనేక సంఘాలు ఏర్పాటయ్యాయి. వివిధ సమస్యలపై గళాన్ని వినిపించడంతో పాటు, కార్మికులను సంఘటితం చేసి పోరాటాలు నిర్వహించాయి.

విశాఖలో....

1937 డిసెంబర్ 24వ తేది సాయంత్రం విశాఖ పట్నంలో హార్బర్ కార్మికులు, మంగనీస్ కూలీలు, బస్తాలు మోసే కూలీలు దాదాపు 1500 మంది ఎర్రజెండాలతో వర్క్ షాపు వద్ద ప్రదర్శన చేసినట్టు రికార్డైంది. ఈ సందర్భంగా వారు 'హార్బరు, పోర్టు కార్మిక సంఘానికి జై' అంటూ నినాదాలు చేశారు. 1938 సెప్టెంబర్ నాటికే డాక్ కార్మికుల సంఘం ఏర్పాటైంది. అప్పటికే విశాఖ హార్బరులో రెండు వేల మంది దాకా కార్మికులు పనిచేస్తున్నారు. అదే ఏడాది డిసెంబర్‌లో కొందరికి క్రిస్మస్ సెలవులు ఇచ్చి మరికొందరికి ఆబ్సెంట్ వేయడంతో నిరసన తెలిపారు. కార్మికులను చీల్చడానికి యాజమాన్యం ప్రయత్నించడంతో 1939 జనవరి ఆరవ తేదిన కార్మికులు నిరసన తెలిపారు. పవర్‌హౌస్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించారు.

కాకినాడలో ...

కాకినాడలో అప్పటికి హార్బర్ లేకపోయినప్పటికీ తీరం వెం వచ్చి పోయే ఓడలు అక్కడ ఆగేవి. అప్పటికే స్టీమర్లలో పనిచేసే కార్మికులు 2వేల మంది దాకా ఉంటారని అంచనా. వీరందరికి సంఘటితం చేసే పనిని కమ్యూనిస్టులు చేపట్టారు. 1938 అక్టోబర్ 26వ తేదిన ఇక్కడి కార్మికులు సుమారు వెయ్యిమంది యూనియన్‌ను ఏర్పాటుచేసుకుని, డిమాండ్లను ప్రకటించారు. పనుల సమయంలో ఇక్కడి కార్మికులు గాయపడటం, కొన్ని సందర్భాలలో మరణించడం వంటి సంఘటనలు తరచు చోటుచేసుకునేవి! 1938 నవంబర్ ఒకటిన ఇలా ప్రమాదంలో మృతి చెందిన ఒక కార్మికుడి మృతదేహంపై ఎర్రజెండా పరిచి యూనియన్ నేతృత్వంలో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సంఘటన పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. సమస్యల పరిష్కారం కోసం 1939 జనవరి 30వ తేది నుండి స్టీవ్‌డోర్ కంపెనీకి చెందిన కార్మికులు రెండు వేల మంది సమ్మె నిర్వహించారు. సమ్మెను విచ్ఛినం చేయడానికి యాజమాన్యం కార్మిక వాడల్లోకి సారాబుడ్లను పంపిణీ చేయడంతో అన్ని రకాల చర్యలకు దిగింది. ఇతర హార్బర్ల నుండీ కార్మికులను తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. అలా వచ్చిన వారు సైతం ఇక్కడ జరుగుతున్న సమ్మె తీవ్రతను చూసి పనులు చేయడానికి నిరాకరించారు. మరోవైపు కార్మికులు వాలంటీర్ల దళాలను ఏర్పాటు చేసుకుని సమ్మెను ఉధృతం చేశారు. చివరకు సమ్మె విజయవంతమైంది.

కళింగపట్నంలో 6.12.1938న కార్మికులు సమ్మె చేశారు. సమ్మెకు నెల రోజుల ముందు మాత్రమే ఇక్కడ యూనియన్ ఏర్పాటు కావడం గమనార్హం.ఇక్కడ కూడా ఇతర హార్బర్‌ల నుండి కార్మికులును తీసుకువచ్చి పనులు చేయించే ప్రయత్నం చేశారు. అయినా సమ్మె కొనసాగింది. చివరకు యాజమాన్యం దిగివచ్చి కార్మికులతో చర్చలు జరిపి, కొన్ని డిమాండ్లను పరిష్కరించడానికి అంగీకరించింది. 8.2.39నాటి నవశక్తి పత్రికలో సమ్మెను విరమించినట్లు కార్మికసంఘం ప్రకటించింది. పోర్టు కార్మికులు చేసిన ఈ సమ్మెలు ఆ పట్టణాల్లోని ఇతర కార్మికులను చైతన్యపరిచాయి.

పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020)

పారిశ్రామిక సంబంధాల కోడ్ అమల్లోకి వస్తే ఈ కింది కీలక చట్టాలన్నీ రద్దవుతాయి.

1) ట్రేడ్ యూనియన్ చట్టం - 1926

2) పారిశ్రామిక వివాదాల చట్టం - 1947

3) స్టాండింగ్ ఆర్డర్ చట్టం - 1946

కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలరద్దు.
మోడీ ప్రభుత్వ దుర్మార్గపు చర్యలపై పోరాటమే వాద్దు.
దుర్మార్గపు లేబర్ కోడ్లు వద్దే వద్దు

శ్రామిక జన చైతన్యం

తిరుపతిలో స్కూటర్ ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మహాసభ జయప్రదానికి తిరుపతిలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పాత మున్సిపల్ కార్యాలయం దగ్గర సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాల వల్ల కార్మికులు కనీస వేతనం, సామాజిక భద్రత లేకుండా దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

జెండా ఊపి స్కూటర్ ర్యాలీ ప్రారంభిస్తున్న వందవాసి నాగరాజు

హలో కార్మికా.. చలో విశాఖ

రండి.. కదలిరండి



విశాఖ పూర్ణామార్కెట్ ప్రాంతంలో ముఠా కార్మికులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉత్తేజంగా ప్రచారం సాగుతోంది. అన్ని రంగాల కార్మికులూ ఈ ప్రచారంలో భాగస్వామ్యమవుతున్నారు. ప్రజల నుంచి విశేష స్పందన వస్తుంది. మహాసభ జయప్రదం కోసం ఆర్థిక, హార్థిక సహకారం అందిస్తున్నారు.

విశాఖ నగరంలో పూర్ణా మార్కెట్ వద్ద ముఠా కార్మికులతో కలిసి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఠా కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్‌తో కూడిన సమగ్ర చట్టం చేసి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, మహాత్మా గాంధీ పేరును తీసివేస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి లేకుండా చేయడానికి మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని, దీన్ని వ్యతిరేకించాలని యావత్ ప్రజానికానికీ సిఐటియు విజ్ఞప్తి చేస్తోందన్నారు.

శ్రామిక ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 27 నుంచి జనవరి రెండు వరకు విశాఖలోని ఎయు కన్వెన్షన్ హాల్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో తలపెట్టిన శ్రామిక ఉత్సవ్ పోస్టర్‌ను మద్దిలపాలెంలో ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, అమరావతి బాలోత్సవం ప్రతినిధి రామరాజు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణ, చంటి, సిఐటియు నాయకులు కుమారి పాల్గొన్నారు.

శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా శ్రమ సంస్కృతి, నేషనల్ ఇంటిగ్రేషన్ వంటి సాంస్కృతిక కళారూపాలు, సైన్స్ ఎగ్జిబిషన్, ఫొటో ఎగ్జిబిషన్, కార్టూన్ ఎగ్జిబిషన్, బుక్ ఫెస్టివల్, సాహిత్య వేదిక, షార్ట్ ఫిలిం స్క్రీనింగ్ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

కొమ్మాది శివశక్తినగర్ రహదారిలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. కార్మిక, ఉద్యోగ, ప్రజా పోరాటాలు, స్వాతంత్రోద్యమ, రైతాంగ పోరాటాలు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలను ప్రతిబింబిస్తూ ఈ ఫొటో ఎగ్జిబిషన్ సాగింది.

మహాసభ వాల్ పోస్టర్‌ను అనకాపల్లి జిల్లా మునగపాక మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశంలో కార్మికుల సమస్యలపై అకుంఠిత దీక్షతో పోరాడుతున్న సిఐటియు మహాసభ విశాఖలో జరగటం ఈ ప్రాంత పోరాటాలకే వెన్నుదన్నుగా నిలుస్తుందని అన్నారు.

జెన్‌కో ప్రాజెక్టు వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మికులు, నేతలు

ప్రజాశక్తి-ముత్తుకూరు, ఎఎస్‌పేట

నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని ఎపి జెన్‌కో ప్రాజెక్టు మెయిన్ గేటు వద్ద సిఐటియు మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాసభను జయప్రదం చేయాలని, కార్మిక తరలిరావాలని సిఐటియు నేతలు కోరారు. నెల్లూరు జిల్లా ఎఎస్‌పేట మండల పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. మహాసభ జయప్రదానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. మహాసభ ప్రాముఖ్యతను వివరిస్తూ... కార్మిక వర్గం తరలిరావాలని కోరారు.

కర్నూలు ఓల్డ్‌సిటీలో పిఎన్ఎం కళాకారుల నృత్య ప్రదర్శన

కళాకారుల శ్రామిక ఉత్సవ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఓల్డ్ సిటీలో ఆధ్వర్యంలో సూర్జీత్ భవన్ వద్ద శ్రామిక ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. పిఎన్ఎం కళాకారులు, జోహారాపురం చిన్నారుల నృత్యం, రైతు ఏకపాత్రాభినయం అలరించాయి. పిడికిలెత్తి నిలబడదాం అంటూ సాగిన నృత్యం ఆకట్టుకుంది.

కదుల్తున్న మన్యం

ప్రజాశక్తి - విజయనగరం

పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట, సాలూరు, మక్కువ మండలాల్లో మహాసభ జయప్రదానికి ప్రచారం నిర్వహించారు. ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. మహాసభకు కదలిరావాలని కోరారు. ఒకే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేర్వేరు వేతనాలు చెల్లించడం వల్ల అసమానతలు పెరుగుతున్నాయని, వెంటనే స్పందించి సమగ్ర శిక్ష, కెజిబివి ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- యంత్రాంగం

వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగులో స్థానిక తొగ్రివేముల ఆటోస్టాండ్ వద్ద వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. మహాసభను విజయవంతం చేయాలని, పెద్దఎత్తున కార్మిక వర్గం తరలిరావాలని సిఐటియు నేతలు కోరారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. బాపట్లలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, అధికసంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని నేతలు కోరారు.

దేశభక్తియుత పాటకు అనుగుణంగా నర్తిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

అనకాపల్లిలో చేపట్టిన శ్రామిక ఉత్సవ్ అందరినీ ఆకట్టుకుంది. స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లోని ఎస్‌బిఐ బ్రాంచ్ ఎదురుగా కళాకారులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలకు చప్పట్ల వర్షం కురిసింది. అనకాపల్లి నేతాజీ హాస్టల్, సిటీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, జివిఎంసి పాఠశాలల విద్యార్థులు నృత్యాలతో మెప్పించారు. ఐద్వా కార్యకర్తలు కోలాటం ప్రదర్శించారు. ఎన్‌టిపిసి ఉద్యోగి నాయక్ మ్యాజిక్ షో ఆలోచింపజేసింది. సొంట్యాన మురళి, మార్టూరు అజయ్, పెంటకోట లీలారాణి, దార్ల శ్రీనివాసరావు ఆలపించిన సినీ, దేశభక్తి గేయాలు వినసొంపుగా సాగాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68